రహస్యం

ఈ కథల మర్మమే వేరు

(పిల్లల కథలు)

రచయిత

డా॥ కొప్పరపు నారాయణమూర్తి. Ph.D

(ప్రొఫెసర్ డా॥ సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి Ph.D)

రహస్యం ఈ కథల మర్మమే వేరు (పిల్లల కథలు)

ముద్రణ : డిసెంబర్ 2023

ప్రతులు : 500

కాపీ రైట్ : సర్వ హక్కులు రచయితవే

ఐ.ఎస్.బి.ఎన్. నెం.: 978-93-341-1319-8

ప్రచురణ కర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి పిహెచ్.డి.
(డా॥సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి)
సెల్ : 7671909759

ముఖ పత్రం : రాపిక్సల్.కామ్ సౌజన్యంతో

పంపిణి : డా॥ కొప్పరపు నారాయణమూర్తి పిహెచ్.డి.
(డా॥సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి)
సెల్ : 7671909759

వెల : రూ. 80/-

చిత్రాలు గీచినవారు : బొమ్మన్ (బ్రహ్మం), విజయవాడ

డి.టి.పి. : శ్రీ దుర్గ గ్రాఫిక్స్, శ్రీ అష్టలక్ష్మి గుడి ఎదురుగా, కొత్తపేట,
తెనాలి - 522 201, సెల్ : 9110761291

విషయసూచిక

ముందుమాట	పుట సంఖ్య
మళ్ళీ నారాయణమూర్తి - డా. పత్తిపాక మోహన్, పి.హెచ్.డి.	i - iv
కథల పూల కత్తులు 'రహస్యం' - చొక్కాపు వేంకటరమణ	v - viii
నా మాట - డా॥ కొప్పరపు నారాయణమూర్తి, పి.హెచ్.డి.	ix - x
కథలు	
1. అదీ సంగతి!	1 - 5
2. విజయ రహస్యం	6 - 10
3. అవగాహన	11 - 15
4. ప్రతిభ	16 - 21
5. శాంతి - అహింస	22 - 26
6. నిజమైన తృప్తి	27 - 32
7. రహస్యం	33 - 38
8. లక్ష్యం	39 - 42
9. బొమ్మ మనసు	43 - 46
10. బొమ్మ జపమాల	47 - 51
11. అహింస	52 - 57
12. సాధన	58 - 62
13. బాధలో మర్మం	63 - 66
14. విద్య వేణువైన వేళ	67 - 71
15. గురువు బాధ్యత	72 - 74
16. వైవిధ్యం సృష్టి విలాసం	75 - 77
17. మితస్య అమిత: ఫలం	78 - 81
18. నవ్యతతో నాస్తి అవిద్య	82 - 85
19. శాకాంబరి	86 - 89

డా. పత్తిపాక మోహన్
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
తెలుగు సంపాదకులు & ఆఫీసర్ ఇంచార్జ్
దక్షిణ ప్రాంత కార్యాలయం, బెంగళూరు
నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
విద్యా మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం

మళ్ళీ నారాయణమూర్తి !

మొన్న ఉదయం హైదరాబాదులో విమానం దిగగానే ఫోను మోగింది. కొత్త నెంబరు. ఉద్యోగ ధర్మపు ఫోనుగా భావించి 'నమస్కారం' అనగానే, 'నమస్కారం! నా పేరు కొప్పరపు నారాయణమూర్తి' అంటూ వారి పరిచయం చేసుకున్నారు. గుర్తుపట్టలేదు నేను. తరువాత ఆయనే అన్నారు 'సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి పేరుతో నేను గతంలో రచనలు చేశాను పిల్లల కోసం' అన్నారు. ఆ మాట వినగానే ఆశ్చర్యపోవడం నా వంతయ్యింది. బహుశ: తొంభయ్యవ దశకం తరువాత మళ్ళీ వీరి పేరు పత్రికల్లో చూడలేదు. ఎందుకు చూడలేక పోయామో తరువాత చెబుతాను. మూర్తిగారు తొంభయ్యవ దశకంలోనే ఆంధ్రప్రభ ఆదివారం 'చిన్నారి లోకం', 'బాలప్రభ'ల్లో పిల్లల కోసం విరివిగా కథలు రాశారు. 'ఆంధ్రభూమి–ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమి' సంయుక్తంగా నిర్వహించిన బాలల నవలల పోటీల్లో బహుమతిని అందుకున్నారు. అటువంటి మూర్తిగారు 'మళ్ళీ' నాకు ఫోను ద్వారా వినిపించడం వెనుక మన తెలుగు పిల్లలకు లాభదాయకమైన ఏదోక పని ఉండడం నాకు మిక్కిలి సంతోషాన్నిచ్చింది. అది, వారి మొన్నటి, నిన్నటి బాలల కథలూ, నవలికను తిరిగి అచ్చులోకి తీసుకుని రావడం.

నేను తరువాత చెబుతానన్న ముచ్చట 1990 తరువాత బాల సాహిత్య రంగం నుండి మూర్తి గారు 'మాయం' కావడం గురించి.

తొలుత తెలుగు పత్రికల్లో ముఖ్యంగా విపుల, చతుర వంటి పత్రికల్లో దిగ్గజాలతో కలిసి పనిచేసిన వీరు తరువాత జర్నలిజం రంగంలో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు ప్రపంచ పటం మీది పలు దేశాల విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు చేయడం వలన తెలుగు పాఠకులకు వీరు దూరంగా ఉన్నారు. వృత్తిరీత్యా. ప్రవృత్తిరీత్యా ఆంగ్లం లోనే రచనలు చేయడం కూడా వీరి పేరు స్మృతిపథం లోంచి తొలగి పోవడానికి కారణం కావచ్చు.

ప్రపంచ ప్రఖ్యాత జర్నల్స్‌లో, జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురించిన వీరి వ్యాసాలు, పరిశోధనా పత్రాలు ఆచార్యులుగా మూర్తిగారి ప్రామాణికతకు నిదర్శనంగా నిలిచాయి. తేజ్‌పూర్ యూనివర్సిటీ, మణిపాల్ యూనివర్సిటీ, అమిటీ యూనివర్సిటీలు మొదలుకుని నార్త్ ఈస్ట్ ఆఫ్రికా, ఇంగ్లాండు, యూరప్‌లతో పాటు ప్రతిష్ఠాత్మకమైన చండీఘర్ విశ్వవిద్యాలయంలోనూ ఈయన పనిచేశారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితానంతరం మళ్ళీ తెలుగునేల మీద కాలు మోపి, 'ఆంధ్రా పారిస్' తెనాలిలో తిరిగి మకాం పెట్టారు. తాను రచయితగా ఎదిగిన అలనాటి మూలాల్లోకి వెళ్ళిన మూర్తిగారు బాల సాహిత్యంలోనే తెలుగు రచయితగా రెండవ ఇన్నింగ్స్ మొదలు పెట్టడం అభినందనీయం.

సుదీర్ఘ ఉద్యోగ జీవితం, దేశవిదేశాల్లోని పిల్లలు, వారి వారి మూలాలు, భిన్న సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యాలు మొదలగు అనేకానేక అంశాలు, జర్నలిస్టు కెమెరా లెన్స్‌లోంచి 'లో' చూపు వంటివి వీరి రచనలకు నిజంగానే కొత్త చూపునిచ్చాయనడంలో సందేహం లేదు. బాలలు ఎక్కడైనా బాలలే! వారిలోకం వారిదే, సాంస్కృతిక అంతరాలు, భాషాబేధాలు వంటి ఉండొచ్చుకాని పిల్లలంతా ఒక్కటే. బహుశ: ఆ అంశమే 'మళ్ళీ నారాయణమూర్తి' గారిని బాలల వైపుగా, బాల సాహిత్యంవైపుగా నడిపించి ఉండొచ్చు.

ఈ 'రహస్యం–ఈ కథల మర్మమే వేరు' మూర్తిగారు రాసిన చిరుకథల సంపుటి. ఈ సంపుటిలోని కొన్ని కథలు 1990ల్లో పత్రికల్లో వచ్చినవి. మిగతా కథలు ఇటీవల రాసినవి. నాడు నేడు చిన్నారి బాల బాలికలు చదువుకున్నవే. అయినా కాలంతో సంబంధం లేకుండా ఈ కథలు నేటికి అంతే తాజాగా ఉండిపోవడం వీరి రచనల్లోని సార్వకాలీనతకు నిదర్శనం. ఒక్కటని కాదు అనేక అంశాలు వీరి కథలను యిప్పటికీ తాజాగా ఉండేలా చేశాయి. మళ్ళీ తన కథలను తన మనవళ్ళు మనవరాళ్ళ వంటి నేటి బాలబాలికలకు తాజాతాజా తాయిలంగా అందిస్తున్నారాయన.

ఈ సంపుటిలోని కథల్లో దేని గొప్పదనం దానిదే! తొలికథ 'అదీ సంగతి' నిజంగా నాకు కూడా కొత్త పాతాన్ని నేర్పింది. మనకు పేరు మరిచిపోయిన ఈగ కథ తెలుసు. ఆ కథ యిందులోని అంశం. అయితే ఆ కథ పిల్లలతో ఎందుకు చెప్పిస్తారో అన్న విషయం వెనుక దాగున్న రహస్యాన్ని మూర్తిగారు చెప్పిన విధానం బాలల మనస్తత్వం పట్ల వారికున్న ఎరుకకు నిదర్శనం. నేను ఆ కథ చెప్పి అందులోని విషయాన్ని బయలుపరిస్తే మీరెలా చదవాలి! మీరే అది స్వయంగా చదవండి.

మూర్తిగారు రాసిన కథలు కేవలం నీతి కథలు కాదు. అచ్చమైన విజయ గాథలు. కాబట్టే అవి అప్పటి తరానికే కాదు నేటికీ కొత్తగా ఉన్నాయి. 'విజయ రహస్యం' కథలో సాధారణ దశ నుండి స్టేట్ ఫస్ట్ వచ్చిన అచ్యుత్ విజయ రహస్యం ఉంటుంది. అదేం పెద్ద బ్రహ్మ రహస్యం కాదు. బాల్యం నుంచి ఆ చిన్నారి కథలు వినడం, చదవడమే! స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీలను ఆదర్శంగా తీసుకుని వారి స్ఫూర్తితో ఎంతో గొప్పగా రాశారు మూర్తిగారు. అవును కదా! శ్రవణ, పఠనాలే కదా సృజనకు మూలంగా నిలుస్తాయి. ఇటువంటివే బడికి, తరగతి గదికి, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన అనేక విలువైన అంశాలను తన కథల్లో చెబుతారు. 'ప్రతిభ' అటువంటి కథే! ఇక మీరే చదవండి పిల్లలూ! పెద్దలూనూ!

'శాంతి–అహింస' మరో మంచికథ. బాలలకు చక్కని అవగాహన, ఆలోచన కలిగించే దిశగా పనికొచ్చే ఆకరమిది. 'నిజమైన తృప్తి' కూడా నీతికథ కాదు. పిల్లలకు రీతులను, నడతను పరిచయం చేసే కథ. ఇంకా ఈ కోవలోనివే 'బొమ్మ మనసు', 'బొమ్మ జపమాల' వంటివి కూడా!

ప్రతి కథను బాలలకు ఒక చక్కని పనిముట్టుగా తీర్చిదిద్దిన మూర్తిగారు ఈ కథలను యూరోపియన్ దేశాల్లో ఉండివచ్చాకనో, ఆంగ్ల సాహిత్యాన్ని, వర్గ సాహిత్యాన్ని అధ్యయనం చేశాకనో రాయలేదు. తొంభయ్యవ దశాకానికి ముందూ రాసినవే. అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, అరచేతిలో విశ్వాన్ని దర్శిస్తున్నా ఇంకా దయ్యాలు, భూతాలు, మంత్రాలకు పిల్లలు పుట్టడం, అభూత కల్పనలతో రచనలు చేస్తున్న బాల సాహితీవేత్తల్ని మనం చూస్తున్నాం. కాని తొంభయ్యవ దశకం లోనే ఇటువంటి కథలను రాయడం మూర్తిగారికే చెల్లింది.

ఒక్కమాట మాత్రం నేను చెప్పగలుగుతాను. ఈ కథలు గొప్ప కథలో.. మరోటో... ఇంకోటో కాకపోవచ్చు... అకస్మాత్తుగా మాయచేసి మార్పును తేకపోవచ్చు... కానీ చదివిన ప్రతివారినీ బాలలపట్ల విద్యావిధానం పట్ల, పేరెంటింగ్ పట్ల తప్పక ఆలోచింపచేస్తాయి. అవును మరి, కావల్సింది అదేగదా! బాలలకే కాదు... బాలల కోసం రాస్తున్న వాళ్ళకోసం అచ్చంగా 'బాలశిక్ష'. మళ్ళీ మన కోసం ఓపిక చేసుకుని కథల తాయిలం అందిస్తున్న మూర్తి గారికి నమస్సులు. బాలల కథా ప్రపంచలోకి 'రహస్యం' కథా ప్రభలకు స్వాగతం.

– పత్తిపాక మోహన్

చొక్కాపు వేంకటరమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
మాజీ ఉద్యోగి జవహర్ బాల భవన్
హైదరాబాదు.

'టీచింగ్' వికృతిగా మారి 'టీజింగ్' కాకుండా కాపాడే విలువైన కథల పూల కత్తులు 'రహస్యం'

కాన్వెంటు చదువులు 'కేజీ'ల లెక్కన లక్షలకు అమ్ముడుపోతున్న ఈ రోజుల్లో టీచర్లకే చదువూ-సంస్కారం నేర్పే కథల సంపుటి 'రహస్యం'. విద్యాలయాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పిల్లలో దిగజారుడుతనాన్ని కళ్ళకు కట్టినట్టు సినిమా చూపిస్తూ రాసిన సీన్లు ఇవి. పాఠశాలల్లో జరిగే అనేక సంఘటనల సంపుటీకరణ ఈ కథలు. వర్తమాన చదువుల సంగ్రామంలో మానసిక వత్తిడిని వత్తిగా చేసి, ఆత్మ విశ్వాసాన్ని చమురుగా పోసి మనోధైర్యంతో ఆశల దీపాల్ని వెలిగించిన విలువైన కథలు ఇవి.

ఉపాధ్యాయ వృత్తికి అవసరమైన బీ.ఇడి, ఎమ్.ఇడి లను ఫస్టు క్లాసులోనెగ్గుకురావడం, విద్యా విధానం మీద డాక్టరేట్ చేయడం, ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, విశ్వ విద్యాలయాల్లో ఆచార్యుడిగా పనిచేయడం అనే క్వాలిఫికేషన్లు ఒక్కరిలోనే ఉండటం చాలా అరుదైన విషయం. అలాంటి అరుదైన అర్హతలున్న వ్యక్తి డా॥ కొప్పరపు నారాయణమూర్తి. అలాంటి విద్యావేత్త జర్నలిజంలో ఎమ్.ఏ. ఎమ్ఫిల్, పిహెచ్డి చేయడమే కాక ప్రొఫెసర్గా కొనసాగితే – ఆయనకు సైన్సు సబ్జెక్టు మీద కూడా ఇష్టం ఉంటే – ఆ రచయిత నుంచి విద్యారంగం మీద పదునైన రచనలు వచ్చే ప్రమాదం

ఉంటుంది. డా॥ కొప్పరపు నారాయణమూర్తి రాసిన 'రహస్యం' పిల్లల కథల సంపుటి చదివాక అలాంటి ప్రమాదమే ముంచుకు వచ్చిందని అనిపించింది.

డా॥ నారాయణమూర్తి 'ఈనాడు' పత్రికలో నాతోపాటు జర్నలిస్టుగా పనిచేసిన 'గిరిజానారాయణ్'గా నాకు పరిచయం. అనేక ప్రముఖ పత్రికల్లో కాలమిస్టుగా కలానికి రెస్టు లేకుండా కొనసాగడం, జర్నలిజంపై 65 పరిశోధనా పత్రాలు సమర్పిస్తూ 25 దేశాలు పర్యటించడం, జీవశాస్త్రంపై సైన్సు రచనలు చేయడం – అంత పాపులారిటీ ఉన్న 'గిరిజానారాయణ్' అనే పేరుని పక్కన పెట్టి సొంత ఊరికి వచ్చినట్టు సొంత పేరుకి రావడం నాకు మిలియన్ డాలర్ల ప్రశ్న ?

బాధ్యత తెలిసిన మనిషి బరువెత్తుకుంటాడు గానీ పారిపోడు. చైతన్య శిల్పాలను చెక్కే ఉపాధ్యాయుడిగా పని చేసిన నారాయణమూర్తి 'పిల్లలకివ్వాల్సింది ఆస్తికాదు. జ్ఞాన విజ్ఞానాల అస్థిత్వం' అనే బాధ్యతను గుర్తించి 'రహస్యం' కథల సంపుటి తెచ్చే బరువెత్తుకున్నారు. ఆ బరువు కథలు విద్యాలయాల పరువు నిలిపే కథలు.

అక్షరం ఒక నమ్మకం. అడ్డగోలుగా ఆ అక్షరాలను వాడి అభాసుపాలు చేయకుండా చక్కని కథలకు వాడారు నారాయణ మూర్తి. ఈ కథలలో తరాల అనురాగాల స్వరాల ధ్వనులున్నాయి. చెరగని చిరునవ్వుల ముత్యాల ముగ్గులున్నాయి.

విద్యారంగాన్ని పట్టి పీడిస్తున్న నైతిక విలువల లోపానికి కారణం ఆధ్యాత్మిక విలువల గురించి తెలియకపోవటమేనని తన కథల ద్వారా సున్నితంగా చెప్పారు నారాయణమూర్తి. విద్యాలయాల్లోని సమస్యలను కథలుగా మలిచిన తీరుని చూస్తే నారాయణమూర్తిలో సాహితీ విప్లవకారుడున్నాడనిపించింది.

ఇష్టం వచ్చినట్లు 'రాసు'కు పూసుకు తిరుగుతూ, కథలు 'రాసి' రంపాన పెట్టే కొందరు సాహితి టెర్రరిస్టుల్లాంటి కేటగిరీలోకి రారు నారాయణమూర్తి. ఈ విప్లవకారుడు చాపకింద నీరులా పాకిపోయి, అంతర్లీనంగా విద్యా వ్యవస్థనీ, నేటి చదువుల అవస్థని చావు దెబ్బకొట్టారు. ఈ కథల్ని మామూలుగా చదివే వారికి అంత సులువుగా అర్థం కావు. ఆలోచించే వారికి స్పష్టంగా అర్థమవుతుంది.

విలువలన్నీ పతనమై నేటి మనిషి సజీవ యంత్రంగా మారి 'టీచింగ్' వికృతిగా 'టీజింగ్' అయిన పరిస్థితుల్లో 'బడిలో నేర్పించాల్సింది 'అక్షర బిందువులనే కాక – ఆలోచనా సింధువుల్ని సైతం' అని నిరూపించిన నారాయణమూర్తి రాసిన కథల వేదాల పాదాలే ఈ 'రహస్యం' కథల సంపుటి.

గురువు అంటే చేతిలో బెత్తం కాదు. బొగ్గును బంగారం చేసే కొలిమి. ఆ కొలిమి నుంచి పుట్టిన 'పూలకత్తులే' ఈ 'రహస్యం' కథలు.

'రహస్యం' – ఒక కథల చెట్టు. చెట్టు ఒక సిద్ధార్థుణ్ని బుద్ధుడిగా మార్చింది. చెట్టు ఒక క్రీస్తు మరణం కోసం ఆత్మ బలిదానం చేసుకొని శిలువుగా మారింది. ఈ 'చెట్టు' మాత్రం శాంతి సామ్రాట్టు'.

పిల్లల ముందు బంగారం వెలలేనిది. అందుకే నారాయణమూర్తి తన మనసు నిండా పిల్లల్ని అలంకరించుకున్నారు. వారి కోసం పనికొచ్చే కథలు రాశారు. వీటిలో ఒక్కో కథని వివరిస్తే అది సమీక్ష అవుతుంది. ముందుమాట పేరుతో సమీక్షరాస్తే ఈ కథలకు ద్రోహం చేసినట్లవుతుంది. కథల సారాంశం తెలిస్తే కథలింక చదవడం ఎందుకులే అనిపిస్తుంది. అది నాకిష్టంలేదు. ప్రతివారూ ఈ అద్భుతమైన కథలు చదవాలి. నాలాగా వీటిని ఆస్వాదించాలి. నలుగురికీ వీటి ఘనతను చాటి చెప్పాలి.

సాధారణంగా రచయితలు ఏ సమస్యల్ని అయినా కథల ద్వారా భూతద్దంలో చూపి భయపెట్టి తప్పుకుంటారు. నారాయణమూర్తి మాత్రం ఆ సమస్యలకు సరైన పరిష్కార మార్గాలు చూపి, నిలబడి, దారి దీపాలు వెలిగించారు. విద్యా రంగానికి, పిల్లలకు, ఉపాధ్యాయులకు మేలు చేసే కథలివి. అందుకే ఈ కథలు నాకు బాగా నచ్చాయి. మీకూ నచ్చుతాయని హామీ ఇవ్వగలను. ఇంకా ఆలస్యం ఎందుకు ? పదండి లోపలికి !!

– చొక్కాపు వేంకటరమణ

నా మాట

ఈ 'రహస్యం' లోని కథలన్నీ నేను బి.ఇడి., ఎమ్.ఇడి., చదువుతున్న రోజుల్లో నాలో రేగిన అనేక ఆలోచనల నుంచి ఉద్భవించినవే. అదే కాలంలో నేను స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండేవాడిని. ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు – ఈ ముగ్గురు నా ఆలోచనలను నిత్యం ప్రభావితం చేసేవారు. తెల్లవారితే స్కూల్ నిర్వహణ ఒక పెను సవాలుగా ఉండేది. పిల్లల మనస్తత్వం అర్థం చేసుకోవడం అటు ఉపాధ్యాయులకు, ఇటు పిల్లల తల్లిదండ్రులకు చాలా క్లిష్టంగా ఉండేది. అందువల్ల, అందరూ ప్రిన్సిపాల్‌నైనా నేనే సమస్యలకు పరిష్కారం చూపుతానేమోనని నా వైపు చూసేవారు. తల్లిదండ్రులతో నెలకొకసారి పిల్లల చదువుల, ప్రవర్తన విషయమై ఒక ప్రత్యేక మీటింగ్ ఉండేది. తరగతి వారీగా సెక్షన్ వారీగా జరిగే ఈ మీటింగులలో పిల్లల తల్లిదండ్రులు వాళ్ళింట్లో పరిష్కారం కావలసిన ఎన్నో సమస్యలకు ప్రిన్సిపాల్‌గా నన్ను పరిష్కారం చూపమనేవారు. నాకు ఆశ్చర్యం వేసేది. అయినా తప్పలేదు. అలాంటి సందర్భాలతో నేనెంతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవాడిని. కొన్ని సందర్భాలలో ఇంటికి వచ్చాక కూడా వాటి గురించి ఆలోచన చేసేవాడిని. అదో పెద్ద కసరత్తయ్యేది. ఒక్కోసారి నిద్ర పట్టేదికాదు. అలా నిద్రలేని రాత్రులెన్నో గడిపాను ప్రిన్సిపాల్‌గా.

స్కూల్ నిర్వాహణ అనేది చాలా క్లిష్టమైన పని. ఒకేసారి అనేక విషయాల (మల్టీ టాస్కింగ్) పై దృష్టి సారించవలసి వచ్చేది. యాజమాన్యాలు వారి రాజకీయాలు, టీచర్ల విభేదాలు, వారి రాజకీయాలు, తల్లిదండ్రుల అహంకారాలు, అన్నీ ముప్పేటన ప్రిన్సిపాల్‌నైనా నా చుట్టూ వైపై లాగా పరిభ్రమించేవి. సముద్రపు అలల్లాగా ఈ మూడు మానవ సమూహాలు నిరంతరం సమస్యల సుడిగుండాలను సృష్టించేవి. అలా ఆ సుడిగుండాల్లో కొట్టుమిట్టాడుతూ ఉపాధ్యాయుడుగా, ప్రిన్సిపాల్‌గా దాదాపు 10 సంవత్సరాలు పనిచేశాను.

ఆ రోజుల్లో కొంతమంది విద్యార్థుల సమస్యలను నేను పరిష్కరించి ఈ కథల రూపంలో వాటిని పదిలపరిచాను. ఇవన్నీ వాస్తవాలనించి ఉద్భవించిన కథలే. కథ కోసం చేసిన కల్పనలు కావు. ఈ ప్రయత్నంలో ప్రిన్సిపాల్‌గా నేననేకమంది తల్లిదండ్రుల విద్యార్థుల ప్రేమకు పాత్రుడనయ్యాను. ఆ విధంగా నేను అనుభవించిన వత్తిడులకు ఈ అభిమానపు చిరుజల్లు ఒక చిరుకానుక, ఉపశమనం కూడా.

నిజానికి ఈ నేపథ్యం ఎంతో బలమైనది. అప్పట్లో ఆంధ్రప్రభలో 'బాలప్రభ'కు చొక్కాపు వేంకటరమణ ఇన్‌చార్జిగా ఉండేవారు. వారు తన పూర్వాశ్రమంలో ఈనాడులో నాకు సహచరులు, మిత్రులు. ఆయన 'బాలప్రభ'కు నన్ను కథలు రాయమని ప్రోత్సహించేవారు. అలా ఈ కథలు తొలిసారిగా 'బాలప్రభ'లో అక్షర రూపం దాల్చాయి. ఆ తరువాత ఆంధ్ర ప్రభ వారపత్రికకు కూడా రాశాను. ఇప్పుడు మళ్ళీ రాస్తున్నాను. ఈ మధ్యలో ఒక 30 సంవత్సరాలు నేను తెలుగు జర్నలిజం నుంచి జర్నలిజం విద్యారంగం, పరిశోధనా రంగం వైపు మళ్ళాను. చివరకు జర్నలిజంలో ప్రొఫెసర్‌గా రిటైరైనాను.

తిరిగి నాటి వ్యాసంగాన్ని పునరుద్ధరించాను. అదే సమయంలో గతంలో రాసిన కథలను ఒక పుస్తకంగా తెస్తే అనేక మంది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రిన్సిపాళ్ళకు, పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించాను. అడిగినదే తడవుగా ముందుమాట రాసిన చొక్కాపు వేంకటరమణకు, ప్రత్తిపాక మోహన్‌గారలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. వీరిరువురు బాలసాహిత్యంలో పేరుగాంచిన రచయితలు. ఇరువురికి కేంద్రసాహిత్య అకాడమీ 'బాలసాహితీ' పురస్కారాలు లభించడం విశేషం. ఈ కథలకు అందమైన బొమ్మలు గీచిన ఆర్టిస్టు బొమ్మన్, విజయవాడ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకం పిల్లలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అలరిస్తుందన్న నమ్మకంతో వినయ పూర్వకంగా దీన్ని మీ ముందుంచుతున్నాను. దయచేసి ఆదరిస్తారు కదా !

– డా॥ కొప్పరపు నారాయణమూర్తి, పి.హెచ్‌డి.

అదీ సంగతి !

హెడ్ మాస్టారు శర్మగారంటే ఆ స్కూల్ పిల్లలకే కాదు టీచర్లకు కూడా ఎంతో గౌరవం, భక్తి. ఆయన చిత్తశుద్ధితో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ, తోటి ఉపాధ్యాయులను ఆవిధంగానే విధి నిర్వర్తించేలా ప్రోత్సహించటమే అందుకు కారణం.

ఆ రోజు శర్మగారు వారం వారం టీచర్లు రాసే టీచింగ్ నోట్సులను తనిఖీ చేస్తున్నారు. పిల్లలకు తాము చెప్పే పాఠాల్లోని ముఖ్యాంశాలు, ఆ పాఠాలతో బాటు మరే ఇతర ఆసక్తికర విషయాలను క్లాసు గదిలో ఉపయోగించబోతున్నది వంటి అనేక అంశాలు ఆ టీచింగ్ నోట్సులో రాస్తారు ఉపాధ్యాయులు.

నిజానికి పిల్లల పాఠ్యాంశాలపట్ల, చదువుపట్ల టీచర్లు ఎంతటి ఆసక్తి కనబరుస్తున్నారో తెల్సుకోవటానికి హెడ్ మాస్టారుకు ఇదో మహా అవకాశం.

యధావిధిగా టీచింగ్ నోట్సులను శ్రద్ధగా సరిదిద్దుతున్న శర్మగారి దృష్టి రామారావు మాస్టారుగారు టీచింగ్ నోట్సులోని 'ఈగ పేరు' కథమీద ఆగిపోయింది.

రామారావు మాస్టారుగారు ఇటీవలనే టీచరుగా ప్రభుత్వ పరీక్షలో ఉత్తీర్ణుడై ఈ మున్సిపల్ హైస్కూల్లో తొలిసారిగా ఉద్యోగ ప్రవేశం చేశారు.

వయస్సులో మిగతా వారికన్నా చాలా చిన్నవాడైన రామారావు మాస్టారు ఉద్యోగంలో చేరీ చేరకముందే పిల్లలి చావచితక కొట్టే మాస్టారుగా పేరు తెచ్చుకోవటం శర్మగారికి ప్రాణాంతకంగా పరిణమించింది.

వారం రోజుల క్రితం నేతి బాలయ్యగారి అబ్బాయి వివేక్‌ను కొట్టడంతో విషయం అదుపు తప్పుతున్నట్లు గ్రహించారు శర్మగారు. వాస్తవానికి వివేక్ చాలా చురుకైన కుర్రవాడు.

రామారావుని పిలిచి "ఏంటయ్యా రామారావు? పిల్లలకి పాఠం చెప్తున్నావా? లేక పిల్లల్ని కొట్టడం ఎలానో ప్రదర్శన చేసి చూపుతున్నావా?" అని అడిగారు శర్మగారు.

"అది కాదు...! మాస్టారు... ఎంతచెప్పినా జ్ఞాపకం ఉండి చావదు మొద్దు గాడిద కొడుకులకు... ఛస్తున్నాననుకోండి. అయినా అసలు కొట్టకపోతే ఇవాళ, రేపు

పిల్లలు మన మాట వినేటట్లు ఉన్నారటండీ!...” పిల్లల్ని కొట్టడం అనేది ఒక విషయమే కాదన్నట్లు తేలిగ్గా తీసిపారేస్తూ మాట్లాడాడు రామారావు.

శర్మగారికి రామారావు ప్రవర్తన చాలా చికాకు కలిగించింది.

“చూడు రామారావూ! మెదడుతో పనిచేస్తూ, పిల్లల మెదడు పనిచేసేలా చేయించే వాడేనయ్యా ఉపాధ్యాయుడు. శరీరాన్ని హింసించి బుర్రకు పాఠాలు నేర్పించటం అసాధ్యం అన్నది చరిత్ర నిరూపించిన సత్యం. టీచర్లు గూండాలు ఒకటి కారాదు సుమా! మరోసారి ఇలా మాట్లాడకండి. ఎందుకంటే పిల్లలకు మీరు చేస్తున్న దేహశుద్ధే మీకూ చేస్తామంటున్నారు – అనేకమంది ఫిర్యాదుదారులు! నిజానికి పిల్లల్ని కొట్టే హక్కు తల్లిదండ్రులకే లేదు – మీకెవరిచ్చారండి? నేను మీకు పనిష్మెంట్ ఇవ్వగల అధికారం ఉన్నా మిమ్మల్ని మానసికంగా హింసించి మార్చాలన్న వైఖరి నాకు కూడా లేదు. తెల్సిందా?” గద్దించారు శర్మగారు.

తెల్సిందన్నట్లు తలూపారు రామారావు మాస్టారు.

“పిలలకు జ్ఞాపకశక్తి లేదని, తక్కువగా ఉంటుందని, అందుకే చావకొడుతున్నానని కదా మీరంటున్నారు... ఈసారి టీచింగ్ నోట్సులో దాని గురించి మీ అభిప్రాయాలు రాయండి. అవసరమైతే దానిగురించి చదివైనా రాయండి” చెప్పారు శర్మగారు.

ప్రస్తుతం టీచింగ్ నోట్స్ చూస్తున్న శర్మగారికి ప్రస్తుతం గతం అంతా మెరుపులా ఒక్కసారిగా గుర్తుకొచ్చింది.

అది ఈగ, తనపేరు మర్చిపోయిన కథ. కథ పేరు... “నా పేరేమిటి?” కథ మొత్తం చదివారు హెడ్ మాస్టారుగారు. రామారావుగారు రాసిన నోట్సు చూశారు.

వెంటనే ఒక ఆలోచన ఆయన మనస్సులో తళుక్కుమంది.

మర్నాడు రామారావు మాస్టారు “నా పేరేమిటి?” కథ చెప్తున్నప్పుడు ఆయన క్లాసుకు చెకింగ్ రౌండుపై వెళ్ళినట్లు వెళ్ళారు శర్మగారు.

రామారావు హెడ్ మాస్టారుగారు రావటం గమనించి పాఠం చెప్పటం ఆపారు.

“ఆపారేం... పాఠం కొనసాగించండి” ఉత్తర్వు జారీ చేశారు హెడ్ మాస్టారు గారు.



రామారావు పాఠం పూర్తి చేశాక పిల్లలవైపు తిరిగి "మీకీ పాఠంలో నీతి ఏమిటో బోధపడిందా?" అడిగారు హెడ్ మాస్టారుగారు.

పిల్లలు మౌనం దాల్చారు.

హెడ్ మాస్టారుగారు నేతి బాలయ్య గారబ్బాయి వివేక్‌ని లేపి అడిగారు "వివేక్... నీకీ కథ అర్థమయ్యిందా? దీని నీతి ఏమిటి?"

"ఈ కథలోని నీతి పిల్లలు జ్ఞాపకశక్తిని పెంపొందించటమే సార్!... ఈగ నిజంగా తన పేరు మర్చిపోతే... పేదరాశి పెద్దమ్మ... పేదరాశి పెద్దమ్మ కొడుకా!... కొడుకు చేతిలో గొడ్డలి... గొడ్డలి కొట్టే చెట్టా... అంటూ ప్రతిసారి తను అడిగిన వారందరి పేర్లన్నింటినీ కలిపి ఎందుకు చెబుతుంది. కాబట్టి నిజంగా ఈగ తన పేరు మర్చిపోలేదు. ఈగ జ్ఞాపకశక్తి నిరూపించటానికీ, ఆవిధంగా మాకు జ్ఞాపకశక్తి పెరగాలంటే ఎలా గొలుసుకట్టుగా చదవాలో చెప్పడానికే ఈ కథ అల్లారు" చెప్పాడు వివేక్.

వివేక్ సమాధానం విని రామారావు మాస్టారుగారు ఆశ్చర్యపోయారు.

"రామారావు మాస్టారుగారు... వివేక్ చెప్పింది కరెక్టేనా?" అడిగారు హెడ్ మాస్టారుగారు.

షాక్ తిన్న మాస్టారు అవునన్నట్టు తలూపారు.

"మరి... టీచింగ్ నోట్సులో మీరు మరోలా రాశారేమిటి? పిల్లలకు ఎలా చెప్పాలో చిట్కాలు కనుగొనడమేనండి ఉపాధ్యాయ వృత్తి అంటే. మీ మేధస్సును ఉపయోగించే బదులు, మీ దేహబలాన్ని ఉపయోగించకండి సుమా!" అంటూ వెళ్ళిపోయారు శర్మగారు.

తనకు బోధపడని ఆ కథలోని మర్మం వివేక్‌కు ఎలా బోధపడిందో రామారావు గారికి చాలాకాలం తర్వాతగాని తెలియలేదు. హెడ్ మాస్టారు శర్మగారు వివేక్‌కు ముందురోజే అర్థమయ్యేట్లు తన గదిలోకి పిలిచి ఆ కథను విడమర్చి చెప్పారని తను

కొడ్తానేమోనన్న భయంతోనే వివేక్‌తోపాటు, క్లాసులో అనేకమంది తమకు ఉన్న తెలివితేటలను కూడా వ్యక్తపరచ లేకపోతున్నారని తెలుసుకొన్న రామారావు మాస్టారు వివేక్‌ను పిలిచి మృదువుగా అతని తల నిమిరారు.

- 13.10.1991 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

విజయ రహస్యం

వారం రోజుల పనిపై పట్నం వచ్చిన సాయిబాబాకు ఆ ఊరిలో అయినవారు, బంధువులు ఎవ్వరూ లేకపోవడంతో తప్పనిసరై చిన్ననాటి మిత్రుడు సత్యప్రసాద్ ఇంటికి వెళ్ళాడు.

సత్యప్రసాద్ ప్రభత్వ ఉద్యోగం చేస్తున్న మధ్యతరగతి కుటుంబీకుడు. రెండు చిన్నగదుల్లో ఇద్దరు పిల్లలు, సత్యప్రసాద్ దంపతులు జీవితం గడపటం సాయిబాబాకు ఎంతో మనస్తాపం కలిగించింది.

సాయిబాబాది ఫక్తు గ్రామం వాసనలుపోని మధ్యతరహా టౌను – అక్కడ సాయిబాబా అనాథ విద్యార్థులకు చదువు చెబుతూ, వారి తిండి, బట్టకు అవసరమయ్యే ఖర్చు వారి చేతివృత్తులపైన వచ్చే ఆదాయంతోనే జరుపుతూ, క్రమశిక్షణతో వారిని పెంచుతున్నాడు. సాయిబాబా అనాథ శరణాలయంలో విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో రంగాలలో పెట్టిన పోటీల్లో ప్రథమస్థానంలో రావటం చాలామందికి తెలుసు.

సత్యప్రసాద్ పిల్లలో ఒకడు ఆరవ తరగతి, మరొకడు ఏడవ తరగతి చదువుతున్నారు. ఇద్దరిదీ ఇంగ్లీషు మీడియం స్కూలే. పెద్దవాడి పేరు అచ్యుత్, రెండవ వాడి పేరు వాసు.

భోజనాల వేళ మాటల సందర్భంలో సాయిబాబాతో "ఏమోనండి అన్నయ్యగారూ! మీరు అక్కడ అంతమందిని ఎలా చదివించి పైకి తెస్తున్నారోగాని, మేము మాత్రం ఈ ఇద్దరి పిల్లలతో ఛస్తున్నాం. పిల్లలేమంత అల్లరివాళ్ళు కాదుగానీ, మంచి స్కూళ్ళలో వేలు డొనేషన్లు కట్టి చేర్చలేకపోయామే అని బాధపడుతుంటాం. ఇతర స్కూళ్ళు పాఠాలు రుబ్బించేయటం, పిల్లల్ని పరీక్షలకోసం చదివించడమే లక్ష్యమన్నట్లుగా యాంత్రికంగా వారికి ఎసైన్‌మెంట్స్, హోంవర్కు ఇవ్వడంతో సరిపెడుతున్నాయి. ఇక ఆ పని ముగించుకోగానే పిల్లలు టీ.వి., సినిమాలు, పాటలు, బ్రేక్ డాన్సులు, కబుర్లు వగైరా వగైరాతో కాలక్షేపం చేస్తున్నారు. చదువుపట్ల ఉండవలసిన భక్తిశ్రద్ధలు, ఉత్సాహం, ఉత్తేజం వీళ్ళలో ఏ కోశానా కనిపించవు. పిల్లల్లో ఒకరిని ఇంజనీరు, మరొకరిని డాక్టరు చేయాలని మా ఆశ. మరి వారి అదృష్టం ఎలా ఉందో?" అంది సత్యప్రసాద్ భార్య యశోదమ్మ.

ఆవిడ చెప్పిందంతా శ్రద్ధగా విన్న సాయిబాబా తలెత్తి పిల్లలవైపు ఒకసారి పరికించి చూశాడు.

"చూడమ్మా! ఇక్కడ మీకు ఇబ్బంది కాదంటే ఒక వారం రోజులుంటాను. మీ పిల్లల గురించి నువ్వు చెప్పినవి ఎంతవరకూ నిజమో నేను స్వయంగా వారితో మాట్లాడి తెలుసుకొంటాను. నువ్వు వారి గురించి బెంగపడకు." అన్నాడు.

సాయిబాబాకు కథలు రాయడం, చెప్పడం వచ్చునని తెలిసి అచ్యుత్, వాసులు మర్నాటినుంచే ఆయనతో మాటలు కలిపారు.

సాయిబాబా వారడిగినట్టే రకరకాల కథలు చెబుతూ కథంతా చెప్పడం అయిన తర్వాత ప్రతిసారీ ఒక తమాషా ప్రశ్న వేసేవాడు. ఆ ప్రశ్నలు వారిని మరింత ఆకట్టుకొనేవి. మర్నాడు సాయిబాబా వారికి మరో కథ చెప్పాడు.

"ఒక టీచరు తన పిల్లలకు గురుత్వాకర్షణ గురించి పాఠం చెబుతున్నాడు. గ్రహాల మధ్య గురుత్వాకర్షణ వల్లనే ఈ గ్రహాలు ఏవీ పడిపోకుండా స్థిర కక్ష్యలో తిరుగుతున్నాయని కూడా చెప్పి, పిల్లలకు ఈ విషయం అర్థమయ్యిందో కాలేదో తెలుసుకోవడం కోసం ఒక ప్రశ్న వేశాడు – ఇప్పుడు నేను మిమ్మల్ని వేస్తున్నట్టుగానే. "రేయ్! ఇప్పుడు చెప్పండి! మన భూమి ఎందుకు పడిపోవడం లేదు?" – ఇదీ టీచర్ పిల్లల్ని అడిగిన ప్రశ్న. పిల్లలంతా ఆ ప్రశ్నకు తలా ఒక సమాధానం చెప్పారు... కానీ ఒక పిల్లవాడు లేచి ఏమన్నాడో తెలుసా?... "సార్! మీ ప్రశ్న చాలా పిచ్చి ప్రశ్న. దీనికి సమాధానం చెప్పడం మరింత పిచ్చి పని" అని అన్నాడు. ఈ సమాధానం విని టీచర్ క్షణకాలం విస్మయానికి లోనైనా కొద్దిక్షణాల తర్వాత తన ప్రశ్న నిజంగానే పిచ్చి ప్రశ్న అని అర్థం చేసికొన్నాడు.

వారం రోజుల్లో సాయిబాబా వారికి చాలా మంచి స్నేహితుడిగా, మంచి టీచరులా, ఎంతో నాలెడ్జి ఉన్న వాడిలా కనిపించడంతో వారికి ఆయనతో మంచి సంబంధం ఏర్పడింది.

పిల్లలను ఆలోచింపచేసే చదువులు, జిజ్ఞాస కలిగించే టీచర్లు నేడు చాలా కరువయ్యారని తెలిసే సాయిబాబా ఈ పని తనపై వేసుకున్నాడు. వారం రోజుల



తరువాత ఊరెళుతూ సాయిబాబా పిల్లలని సెలవులకు తన ఊరు రమ్మనమని చెప్పి మరీ వెళ్ళాడు. సెలవులకు ఊరు వెళ్ళిన పిల్లలు వాసు, అచ్యుత్‌లు ఊరి నుంచి తిరిగి వచ్చేటప్పటికి పూర్తిగా మారిపోయారు. వారి ఆలోచనల్లోని లోపాలు సరికావడంతో గతంలోలా వారికి సినిమాలు, కబుర్లు, పాటలు, డ్యాన్సులు అంటే చెవికోసుకోవడం పోయింది. ఏ పనిచేసైనా ముందైనా అది తమకెంతవరకూ నిజంగా ఉపయోగపడుతుంతో ఆలోచించి, విచక్షణతో మరీ చేయడం మొదలుపెట్టారు.

గతంలో తమ పిల్లల స్కూళ్ళ పేరు గొప్పలు చెప్పి, యశోదను, ఆమె పిల్లలను చిన్నబుచ్చిన యశోద స్నేహితురాళ్ళు కూడా క్రమంగా అచ్యుత్, వాసులో వచ్చిన మార్పు గమనించి తిన్నగా యశోదతో మర్యాదగా మాట్లాడటం ప్రారంభించారు.

మూడేళ్ళు చదువులు ఇలా కొనసాగించేసరికి, అచ్యుత్ పదవ తరగతిలో స్టేట్ ర్యాంక్ వచ్చాడు.

అతని ఫోటో, ఇతర ర్యాంక్ హోల్డర్ల ఫోటోతో అచ్చయింది. పత్రికలవాళ్ళు అచ్యుత్‌ని, అతని తల్లిదండ్రులను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చారు – యధా ప్రకారంగా.

“ఈ పరీక్షలో నా విజయానికి కారణం మా అమ్మ... ఆవిడ ఇచ్చిన క్రమశిక్షణ, నైతిక స్థైర్యం. మిగతా వివరాలు మా అమ్మని అడిగితేనే న్యాయం...” అని ముక్తసరిగా జవాబిచ్చాడు అచ్యుత్. అతని సమాధానం విని పత్రికల వాళ్ళు అచ్యుత్ తల్లి యశోదను కూడా ప్రశ్నించారు.

“... ... మీరు నేటిదాకా ప్రతి ఏటా స్టేట్ ర్యాంక్ వచ్చిన పిల్లలను ఎంతోమందిని ప్రశ్నించి ఉంటారు. వారంతా తమ విజయానికి తమ తల్లిదండ్రులే కారణమని చెప్పడం కూడ గమనించి ఉంటారు.

చిన్నప్పుడు వారికి ఉత్సాహాన్ని కలిగించే కబుర్లు, కథలు చెప్పాలంటే, వారిలో నైతికి స్థైర్యం, నైతికతలోని హాయి అర్ధమయ్యేలా చేయాలంటే స్వామి వివేకానంద చెప్పినట్లు రామాయణ, మహాభారతాలు ఎంతగానో తోడ్పడ్తాయి. చరిత్రలో వీరులైన శివాజీ, రాణాప్రతాప్, రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మి కథలు, కృష్ణరాయల సాహసాలు, పంచతంత్రం – వంటివి పిల్లలను నైతికంగానూ, లక్ష్యంవైపు నడిపిస్తాయి. ఇదే పిల్లల విజయానికి రహస్యం. అంతేగాని గొప్ప కాలేజీనో, గొప్ప స్కూలో పిల్లలకు ర్యాంక్

తెచ్చిపెట్టదు. ఈ విషయం మాకు అర్థమయ్యేలా చెప్పింది తొలిసారిగా సాయిబాబా అన్నయ్యగారే. ఆయనకే ఈ ఘనత న్యాయంగా చెందుతుంది” అంది యశోద.

- 26.01.1992 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

అవగాహన

“పిన్నీ... వాడు నన్ను కొట్టడానికి వస్తున్నాడు చూడు” అంటూ గబగబ పెరుగెత్తు కొచ్చి తన వెనుక దాక్కున్న లీలవైపు చూసింది శాంత. లీల ముఖంలో శేఖర్ దెబ్బల భయం స్పష్టంగా కనిపించింది శాంతకు.

“ఎందుకు కొడతాడు? నువ్వేం చేశావు?” అడిగింది శాంత.

“కాదు పిన్నీ... నేనేమీ చేయలేదు. వాడూరికే నా వెంబడి పడ్డాడు'' అంటూ శేఖర్ వస్తున్నవైపు చూసి “పిన్ని... పిన్ని... వాడిని కేకలేయి పిన్ని... లేకపోతే వాడొచ్చినా జడకుప్పెలు పీకేస్తాడు పిన్నీ... కొత్తవి పిన్నీ... అమ్మ ఇటీవలే ఎల్లోరా నుంచి తెచ్చింది పిన్నీ!” దీనంగా ముఖంపెట్టి బతిమాలింది లీల.

“రేయ్ శేఖర్! ఆగు అక్కడ. చేతిలో కర్ర పడేయ్. పడేయ్ ముందు” గుడ్లురుముతూ చెప్పింది శాంత.

శాంత పిన్నంటే శేఖర్‌కు మొదటినుంచి భయమూ, గౌరవమూ కూడ. ఒక్కసారిగా పిన్ని అలా కళ్ళు గోలికాయలంత పెద్దవి చేసి అరిచేటప్పటికి వాడు కర్ర కిందపడేసి బిక్కముఖంతో నిలబడిపోయాడు.

వాడ్ని చూడగానే ఎక్కడలేని జాలి కలిగింది శాంతకు. ప్రేమగా దగ్గరికి తీసుకొని, “లేదు ఏడవకు! నేనేమన్నానని ఏడుపు? అసలేం జరిగిందో చెప్పు. ఎవరి తప్పయితే వారికి నేనే పనిష్మెంట్ ఇస్తా” అని బుజ్జగిస్తూ చెప్పింది శాంత.

“మరే! నన్ను మొద్దు, మొద్దు” అని అందరిలో పిలవద్దంటే పిలుస్తుంది. మా ఫ్రెండ్స్ ముందరకూడ అలానే పిలుస్తుంది” చెప్పాడు శేఖర్.

“ఏయ్ ఇటురా ముందరికి! వాడ్ని ‘మొద్దు’ అని ఎందుకు పిలుస్తావు నువ్వు? నువ్వు పెద్ద తెలివిగలదానివా?” అని వెనక నక్కిన లీలని పిలిచి అడిగింది శాంత.

“అవును ‘మొద్దును’ ‘మొద్దు’ అని పిలిస్తే తప్పేముంది. మమ్మీ, డాడీ, స్కూల్లో మాస్టారు అందరూ వాడిని ‘మొద్దు’ అనే అంటారు. అందుకే నేను అంటాను. అందుకని కొడతాడా?” అంది లీల గుడ్లు తిప్పుకుంటూ పెద్ద ఆరిందలా.

“ఎందుకనిటా!” అంది శాంత.



"ఏమో! నాకు మటుకు ఏం తెలుసు! మా మమ్మీ, డాడీ మాత్రం ఎప్పుడూ శేఖర్ మొద్దు వెధవ. వాడి బుర్ర ఎప్పుడూ ఎక్కడో ఉంటుంది. ఏదైనా రాయమంటే ముందురాయవల్సిన పదాలు వెనుక, వెనకవి ముందుకు తారుమారుచేసి అయోమయంగా రాస్తాడు. ఎప్పుడూ పరధ్యాసలో ఉన్నట్టుంటాడు. వాడికేపని చెప్పినా సరిగ్గా చేయడు" అని అంటుంటారు. అందుకే నేనూ అంటాను" అంది లీల.

"ఏరా శేఖర్... నిజంగా నువ్వు అలానే చేస్తావా?" అడిగింది శాంత.

శేఖర్ ఏమీ బదులు చెప్పలేదు.

"క్లాసులో కూడ పిన్నీ! వీడికి తోడు అరడజనుమంది మొద్దు వెధవలు స్నేహితులు. మొన్న క్లాసులో మాస్టారు అడిగే ప్రశ్నలకు వీడు, వీడి ఫ్రెండ్స్ సమాధానం చెప్పలేక పోయారు. అప్పుడేమో మా క్లాస్‌మేట్ దీపచేత వీళ్ళకి చెంపదెబ్బలు వేయించారు మాస్టారు. ఆ కోపం పెట్టుకొని క్లాసయిపోయాక దీప బట్టలపై ఇంకు చల్లారు వీళ్ళు" మళ్ళీ చెప్పింది లీల.

"దీప ఎవరు?" అడిగింది శాంత.

"నా డియరెస్ట్ ఫ్రెండ్ అన్నమాట. చాలా ఇంటలిజెంట్. మా క్లాసులో ఆ అమ్మాయంటే అందరికీ ఇష్టమే" చెప్పింది లీల కళ్ళింతవి చేసి, మెలి తిరిగిపోతూ.

"ఏంకాదు పిన్నీ... మా క్లాసులో బసంత్ అందరికంటే ఇంటలిజెంట్. కావలిస్తే మా మాస్టారినే అడుగు. ఎప్పుడూ అతనే ఫస్టు. మా సెక్షనుకొచ్చే ఒక్క రాఘవరావు మాస్టారుకే దీపంటే ఇష్టం. ఎందుకంటే వాళ్ళ నాన్న పెద్ద ఆఫీసరులే అందుకని. నాకు తెలిదా ఏంటీ? దీని మాటలన్నీ అబద్దాలు" కోపంతో శాంత నుంచి దూరంగా జరిగి మరీ చెప్పాడు శేఖర్.

"అది సరే! దీప ఇంటలిజెంట్ అని లీల, 'బసంత్' ఇంటలిజెంట్ అని నువ్వు పరాయి వాళ్ళ గొప్పలు డబ్బా కొట్టీ చెప్తున్నారు. మీ సంగతేంటి?'' అడిగింది శాంత.

"పిన్నీ... నాకు దీనికన్నా మార్కులు ఎప్పుడూ ఎక్కువే. అయినా ఇంటిపనులు బాగా చేసి, డాడీకి, మమ్మీకి బాగా చెంచాగిరి, తైరు కొడుతుంది పిన్నీ, అందుకని నన్నూ ఊరికే మొద్దు, మొద్దు అంటూంటారు. నువ్వు చెప్పు పిన్నీ నేను మొద్దునా!"

అడిగాడు శేఖర్.

"లేదు... నువ్వు బంగారు తండ్రివి. మీరిద్దరూ తెలివిగలవాళ్ళే. మీ తెలివితేటలను దీప, బసంత్‌ల్లా బాగా కృషిచేసి పెంచుకోవాల్సింది పోయి, మిమ్మల్ని మీరు మొద్దులుగా భావించుకొని ఒకరినొకరు బాధపెట్టుకొంటున్నారు. దీప, బసంత్‌లు తెలివిగల వాళ్ళని మీరంటే, మీరు మొద్దులనేనా అర్థం" అడిగింది శాంత లీలని.

"ఎందుకు? నేను బాగానే చదువుతున్నానుగా! నాకూ వాడితో సమానంగానే మార్కులొస్తాయి. కాకపోతే ఎప్పుడూ వాడిదే హై ర్యాంకు అనుకో! అంది లీల బుంగమూతి పెట్టి.

"వాడికొకవేళ నీకన్నా తక్కువ ర్యాంకు వచ్చినా, నీకొకవేళ వాడికన్నా తక్కువ ర్యాంకు వచ్చినా ఆ మాత్రానికే మొద్దులయిపోతారా? మీకన్నా తెలివిగలవాళ్ళని గెలవడానికి కృషి చేయాలి సరేనా" అంది శాంత.

లీల, శేఖర్ సరేనని తలూపారు. అప్పటికి గొడవ ఉపశమించింది. కాని శాంతకు తెలుసు. ఇది పరిష్కారం కాదని. ఇందుకు లీల, శేఖర్‌ల అమ్మా, నాన్నలకు పిల్లల ప్రవర్తనపై సరైన అవగాహన లోపించటమే కారణం. అందుకేం చేయాలో బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది.

వారం రోజుల తర్వాత లీల, శేఖర్‌ల స్కూల్ వార్షికోత్సవాలు జరిగాయి. ఆ రోజు పిల్లలను తల్లిదండ్రులతో సహా రమ్మని కబురు చేశారు హెడ్మాస్టరు.

లీల, శేఖర్‌లు వాళ్ళమ్మా నాన్నలతో సహా స్కూలుకు వెళ్ళారు. శాంత మాత్రం వెళ్ళలేదు.

గంటన్నర తర్వాత పిల్లలు, వాళ్ళమ్మా, నాన్న వచ్చారు.

"అబ్బ శాంత! ఆవిడెవరో పెద్ద డాక్టరట. గొప్ప మాటకారి. పిల్లల మనస్సు, ప్రవర్తన గురించి ఆవిడకు ఎన్ని విషయాలు తెలుసో. మమ్మల్ని నవ్విస్తూ ఎన్ని విషయాలు చెప్పిందో. మన శేఖర్‌ని అనవసరంగా మనం 'మొద్దు మొద్దు' అంటామా! అసలు అట్లా అనకూడదట. నిజానికి మొద్దుతనం అనేది ఆ వయస్సులో ఆడ, మగా ఇద్దరిలోనూ సమానమేనని ఆవిడ ఎన్నో ఉదాహరణలు చెప్పింది. మగా, ఆడ శరీర నిర్మాణాన్నిబట్టి

వాళ్ళ ఆలోచనల్లో తేడావల్లనే ఇద్దరూ చెరో విషయంలో మొద్దుల్లా కన్పిస్తారుగాని, వాస్తవానికి చురుకు విషయంలో ఆడ, మగా సమానమే. నా ముఖం మండా! నాకు తెలిసి చచ్చింది గాదు ఈ విషయం" అని శేఖర్‌గాడ్ని ఎత్తుకొని ముద్దులు కురిపించింది శేఖర్ తల్లి.

శాంత తన ఎత్తు పారినందుకు ఎంతో సంతోషించింది. లీల, శేఖర్‌లలా అనేక కృత్రిమ సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు, వాళ్ళ తల్లిదండ్రులకు సరైన అవగాహన కలిగించాలని వాళ్ళ హెడ్ మాస్టారితో మాట్లాడి తన సైకాలజీ ప్రొఫెసర్‌ను ఆహ్వానించేలా చేసింది శాంతనే. ఇకపైనన్నా అన్ని స్కూల్స్ తప్పనిసరిగా ఇలాంటి పని చేస్తే బాగుండుననికొంది శాంత మనస్సులో.

- 17.03.1991 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

ప్రతిభ

"నమస్కారం సార్" చేతులెత్తి గౌరవాభివందనం చేస్తున్న మాస్టర్లను చూసి, లోపలికి రండని సాదరంగా ఆహ్వానించారు హెడ్మాస్టరు శర్మ.

"అర్జంటుగా మమ్మల్నందర్నీ కలిసికట్టుగా రమ్మని స్టాఫ్ రూమ్‌కు కబురు పంపారుట, విషయమేమిటో తెలుసుకోవచ్చా?" అడిగారు సీనియర్ టీచర్ హన్మంతరావు మిగతా మాస్టర్లందరి తరఫున.

"నిజంగానే అర్జంటు. నిన్న సాయంత్రం జరిగిన విద్యాశాఖాధికారి, కలెక్టర్ సమావేశంలో మన జిల్లాకంతటికీ కలిపి వచ్చే నెల్లో సృజనాత్మక కళల్లో పిల్లలకు పోటీ ఏర్పాటుచేయాలని, దానికి మన స్కూలే ఆధ్వర్యం వహించాలని నన్ను కోరారు. అందుకు నేనూ అంగీకరించాను. అఫ్‌కోర్స్, మీరంతా సహకరిస్తారనే ధీమాసుమీ!" అన్నారు హెడ్మాస్టరు శర్మ.

ఒక్కసారి టీచర్లందరి గుండెల్లో పిడుగు పడ్డట్టయింది. ఏదో ముక్కున పట్టిన నాలుగు ముక్కలు చీదేసి, హాయిగా కాలం గడుపుదాం గదా అని టీచర్‌గా చేరితే తడవకొక జాతర తప్పిచావటం లేదనుకొన్న టీచర్లే వారిలో చాలామంది. అయితే హెడ్మాస్టరు శర్మంటే ఉన్న భయంకొద్దీ ఒప్పుకోక తప్పలేదు.

"సరేసార్! అలాగే చేద్దాం. అసలు ఏం చేయాలో చెబితో చకచకా నరుక్కుంటూ వెళ్ళిపోతాం" అన్నారు సుబ్బారావు మాస్టారు.

"ఏమీలేదు. సృజనాత్మకంగా ఆలోచించగలిగే పిల్లలు మీ మీ తరగతుల్లో ఎవరెవరున్నారో ముందు ఒక లిస్టు తయారుచేయండి. ఎంత త్వరగా మీరు నాకు లిస్టు సమర్పిస్తే అంత త్వరగా నేను తర్వాత అడుగు ముందుకు వేస్తాను" అన్నారు శర్మ.

'ఓ' అని తలత్రిప్పుతూ అంతా లేచి, హెడ్మాస్టరుగారికి నమస్కారం చెప్పి, బయటికి నడిచారు ఆయన రూమ్ నుంచి.

నాలుగు రోజుల్లో అందరూ తమ తమ లిస్టులను హెడ్మాస్టారు గారికి పంపి, ఒక పనైందని చేతులు దులుపుకొన్నారు.

హెడ్మాస్టారు శర్మంటే ఉద్దండపిండం అని మిగతా మాస్టర్లకు తెలుసు. అయితే ఆయన మూర్తీభవించిన సత్ప్రవర్తనకు ప్రతిరూపం అని చాలామందికి తెలియదు. క్రమశిక్షణపట్ల ఆయన దృఢ నిశ్చయం చాలామంది టీచర్లకు కంటగింపుగా ఉండటంవల్ల ఆయన సత్‌గుణం వీరికి తెలియలేదు. అక్కడే పప్పులో కాలేశారు.

హెడ్మాస్టరు ఆ లిస్టులను పరిశీలించి, వారం తర్వాత మాస్టర్లందరినీ తన రూమ్‌కు రమ్మని కబురంపారు.

మాస్టర్లందరూ పోలో మంటూ హెడ్మాస్టర్ రూమ్‌కు వచ్చారు.

"చూడండి హన్మంతరావుగారు, పదవ తరగతి లిస్టు ప్రిపేర్ చేసింది మీరేనా?" అని అడిగారు శర్మగారు.

"ఆ... అవును సార్ నేనే" అన్నారు హన్మంతరావుగారు.

"చూడండి. ఈ లిస్టులు మీరు ఇలా ఇస్తారని నేనిదివరకే ఊహించాను. నా తర్వాత కాబోయే హెడ్మాస్టరయి ఉండి కూడా మీరు ఇలా అలసత్వంతో ప్రవర్తించటం బాగోలేదు. క్లాసులో ఫస్టు మార్కు వచ్చిన విద్యార్థులే ప్రతిభకల విద్యార్థులనా మీ అభిప్రాయం" సూటిగా మొహంమీదనే అడిగారు శర్మగారు.

ఒక్క క్షణం హన్మంతరావుగారి ముఖంలో రంగులు మారాయి.

"అదికాదు సార్, ఈ సంవత్సరం అన్ని పరీక్షల్లోనూ ఇంతవరకూ ఏవరేజ్ మీద, విడివిడి సబ్జెక్టుల్లోనూ ఫస్టు మార్క్ వచ్చిన వాళ్ళే నిజమైన ప్రతిభగల వాళ్ళని మీకు వాళ్ళ పేర్లున్న జాబితా ఇచ్చాను. పైగా ఎప్పుడూ ఫస్టు వచ్చే మన శ్యాంప్రసాద్ కలెక్టరుగారబ్బాయి అని మీరు మర్చిపోకూడదు సుమా?" అన్నారు హన్మంతరావు మాస్టరు.

"చూడండి హన్మంతరావుగారు, కలెక్టర్‌గారబ్బాయి ఎప్పుడూ ఫస్టు రావటం అభినందనీయమే. అయితే మార్కులనుబట్టి ప్రతిభ నిర్ణయం చేయటం సబబుకాదు. అధిక మార్కులు, ర్యాంకులు వచ్చే వారిలో సృజనాత్మక ప్రతిభ ఉండవచ్చు. కాని సృజనాత్మక ప్రతిభ ఉన్న వారందరికీ మార్కులు కొలబద్ద కానేరవు. అందువల్ల 'సృజనాత్మక'ను మార్కుల కొలబద్దతో చూడటం అసంబద్ధం. అది తెలుసుకోండి" అన్నారు శర్మగారు.

“బాగుంది మీరు చెప్పేది. పిల్లల్లో సృజనాత్మక ప్రతిభ ఉందో లేదో వేరే పద్ధతిలో కనుక్కోవటం ఎలా? అలాంటప్పుడు క్లాసువారిగా అందరికీ పోటీ నిర్వహిస్తే తెలుస్తుంది. అది నాలుగు రోజుల్లో ఎలా సాధ్యం?” అన్నారు హన్మంతరావుగారు శర్మగారి మాటను అసంగతంగా కొట్టిపారేస్తూ.

“అది అసాధ్యమేమీ కాదు! నిజానికి మీరిలాంటి లిస్టు ఇస్తారని ఊహించే, నేను సొంత ప్రయత్నం ఒకటి రహస్యంగా చేశాను. ఇదిగో అయిదవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ క్లాసు వారీగా ఓ మోస్తరి సృజనాత్మక ప్రతిభ ఉన్నవారి లిస్టు. దీన్ని తీసుకొని పరిశీలించండి” అని ఏ క్లాసువారి లిస్టు వారికి అందజేశారు హెడ్మాస్టరు శర్మగారు.

అయిదు నిమిషాల తర్వాత లిస్టులు పరిశీలించిన మాస్టర్ల ముఖంలో నెత్తురు చుక్కలేదు.

“ఏమిటి అలా అయిపోయారు? ఏదైనా పొరపాటు జరిగిందా?” అడిగారు హెడ్‌మాస్టారుగారు. “మరీ అలగాజనం, లోక్లాసు వాళ్ళ పిల్లలైన షీలా, లక్ష్మి, వెంకట్‌లను కూడా ఈ జాబితాలో వేసేశారు. పైగా మంచి మార్కులొచ్చిన పెద్ద పెద్ద వాళ్ళ పిల్లలు బొత్తిగా లిస్టులో మాయం అయిపోయారు” అన్నారు రంగనాయకులు, హన్మంతరావులు నిరసనగా.

“చూడండి మాస్టారూ! ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ కూడా ఇటువంటి మలినమైన ఆలోచనలు మిమ్మల్ని వేధిస్తున్నాయని తెలిసి నేను సిగ్గుపడుతున్నాను. అయితే ఒక చిన్న సవాల్. ఇక్కడ గోడమీద మూడు మోడల్స్ ఉన్నాయి. వీటిలో ఒకటి అద్భుతమైన పెయింటింగ్, మిగతా రెండు సైంటిఫిక్ మోడల్స్, వీటిని ముందు మీ లిస్టులోని ఎక్కువ మార్కులొచ్చే పెద్ద పెద్ద వాళ్ళ పిల్లల్ని పరిశీలించి వివరించ మనండి. ఆపై మీరు కరెక్టో, నేను కరెక్టో తేలిపోతుంది” అని హెడ్మాస్టరు మాస్టర్లు తయారుచేసిన లిస్టులోని పిల్లల్ని తన రూంకు తీసుకురమ్మని ప్యూన్‌ను ఆదేశించారు.

మాస్టర్లంతా మౌనంగా కూర్చొని, ఆ బొమ్మలవైపు చూస్తూ అవేమిటని దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.



ఇంతలో చాలామంది పిల్లలు బిల బిలా హెడ్మాస్టరు రూం దగ్గరికి వచ్చారు. హెడ్మాస్టరు పదవ తరగతితో ఎప్పుడూ ఫస్టు వచ్చే కలెక్టర్‌గారబ్బాయి శ్యాంప్రసాద్‌ని పిలిచి, అక్కడ పెట్టిన మూడు మోడల్స్ చూపించి జాగ్రత్తగా పరిశీలించి వాటిని వివరించమన్నాడు.

శ్యాంప్రసాద్ పది నిమిషాలు పరిశీలించి "మొదటిది పెయింటింగ్, అదేమీ అర్థం కావటంలేదు. రెండవది మైనంతో చేసిన ఇంటిలోని కొవ్వొత్తి. మూడవది రకరకాల జీవుల మధ్య సంబంధం" అని చెప్పాడు.

"మైనపు ఇంట్లోని కొవ్వొత్తి ఇంటికి హాని జరగకుండా వెలిగించగలవా?" అడిగారు హెడ్మాస్టరు శర్మగారు.

కాసేపు ఆలోచించి నిస్సహాయత ప్రకటించాడు శ్యాంప్రసాద్. అలాగే మిగతా పిల్లలు కూడా నిస్సహాయత వ్యక్తం చేశారు.

చివరగా "మాస్టర్లయినా ఫర్వాలేదు. ఈ మైనపు ఇల్లు చూశారు గదా! దీనికి ఒకవైపు గోడ పారదర్శక అద్దం. మిగతా మూడువైపులా మైనం గోడలు. పైకప్పు మైనంతో చేసింది. పైకప్పులో చిమ్నీకోసం సన్నటి పొడవాటి గొట్టం ఉంది. ఇంటిని నాలుగువైపులా మూసేశారు. లోపల కొవ్వొత్తిని ఎలా వెలిగిస్తారు?" అడిగారు శర్మగారు.

ఎవ్వరికీ ఎంత ఆలోచించినా తట్టలేదు.

వెంటనే మాస్టారుగారు తను తయారుచేసిన లిస్టులో లీలా, లక్ష్మీ, వెంకట్‌లను పిలిపించి వాటిని వివరించమన్నారు.

వారు వివరించింది విని మాస్టర్లు నోరువెళ్ళపెట్టక తప్పలేదు.

"చూడండి! డబ్బున్నవారు, ఆర్థికంగా బాగా ఉన్నవారు పిల్లలకు చదువుకొను వసతులు కలిపించి, ట్యూషన్లు చెప్పించి, పదిరకాల పుస్తకాలిచ్చి వాళ్ళచేత అన్నింటినీ రుబ్బించి పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చేట్లు చేయవచ్చుగాని, ఆర్థికంగా స్తోమతలేని లక్ష్మీ, షీలా, వెంకట్‌లకు ఉన్న ఒకే ఒక సౌకర్యం వారి మేధస్సు మాత్రమే. అందువల్ల వారు తమకున్న మేధస్సులోంచి సృజనాత్మక ప్రతిభను వ్యక్తపరిచారు. ఇవి తయారు చేసింది కూడా వారే. వెంకట్ రానున్న అణు ప్రమాద నివారణను, అగ్రరాజ్యాలు

చేసుకొన్న శాంతి ఒప్పందాన్ని తన పెయింటింగ్‌లో వివరించాడు. షీలా మైనపు ఇంటిని చేయటమేగాక లోపల కొవ్వొత్తిని చిమ్నీ గొట్టం ద్వారా ఆల్కాహాలులో ముంచిన సన్నని ఒత్తి ద్వారా వెలిగించగలదు. లక్ష్మి సౌరశక్తిని ఉపయోగించుకొని వ్యవసాయ దారుడు బయోగ్యాస్, బయోమాస్‌లను ఎలా వాడుకోవచ్చో చేపలు, కోళ్ళు, ధాన్యం, కంపోస్ట్, మొక్కలు, సూర్యుడికి మధ్యనున్న వలయం ద్వారా వివరించింది. కాబట్టి ప్రతిభను చెప్పేది మార్కులు కావు. ఇకపై సరైన ప్రతిభకోసం విద్యార్థులను శోధించండి. ఆణిముత్యాలు భూగర్భంలో ఉన్నా, సముద్రంలో ఉన్నా వెలికితీయటం మానవుడి వంతు, అలాంటి విద్యార్థులను వెలికితీయటం టీచర్ వంతు" చెప్పారు హెడ్మాస్టరు శర్మగారు. లక్ష్మి, షీలా, వెంకట్‌ల కళ్ళు చెమ్మగిల్లాయి. కృతజ్ఞతగా ఆయనవైపు చూశారు.

- 25.11.1990 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

శాంతి - అహింస

"ఒరేయ్ శీను... ఆ సత్యంగాడిని తన్నాలిరా" అన్నాడు రమేష్. వాడి ముఖం ఎర్రగ్రా మారి కళ్ళు ద్వేషాన్ని, అసహ్యాన్ని వెదజల్లుతున్నాయి.

"ఏం పాపం! ఏం చేశాడు..." అడిగాడు బాలాజీ కూనిరాగం తీస్తూ. బాలాజీ, ధర్మయ్య, పెంటయ్యలు రమేష్‌గాడి బలానికి భయపడి వాడికి ఒత్తాసు పలికే వందిమాగధులు.

దూరాన కూర్చుని ఉన్న వివేక్ వీళ్ళ మాటలన్నీ వింటూనే ఉన్నాడు. వివేక్ వీళ్ళ ఈడువాడైనా జన్మతః వచ్చిన బుద్ధికుశలత ఎక్కువ ఉన్నవాడు. ఇలాంటి గొడవల్లో ఏవిధమైన ఆనందంలేదని, చదువు, ఏకాగ్రత, వినయంలోనే ఆనందం ఉందని విశ్వసించే పిల్లల్లో వివేక్ ఒకడు. అందుకే అతను క్లాసులో ఎప్పుడూ ఫస్టే.

తన చేతిలోని గౌతమబుద్ధుడి చరిత్ర పుస్తకం మూసి, అక్కడినుంచి లేచి దూరంగా వెళ్ళాడు. వివేక్ తనకు ఏకాగ్రత భగం కాకుండా ఉండేందుకు పోతూ పోతూ ఈసారి రమేష్‌కు, సత్యానికి గట్టిగా ఎలా బుద్ధిచెప్పాలా అని మాత్రం ఆలోచించాడు.

ఏ కారణంగానో సత్యం, రమేష్ వర్గాలు ఒక వారం దాకా కనబడలేదు. కొట్టుకోలేదు. కాని, నానాటికీ ఒకరినొకరు రెచ్చగొట్టుకోవటం, పిల్లల్లో గ్రూపులను లేవనెత్తటం మాత్రం అధికం చేయసాగారు.

ఆరోజు ఆదివారం పిల్లలందరినీ గండిపేటకు తీసుకెళ్ళాడు వాళ్ళ హెడ్ మాస్టరు. రమేష్, వివేక్‌ల క్లాస్ టీచర్ కూడా వాళ్ళతో వెళ్ళారు. పిల్లల ఖర్చుతో, పిల్లల పేరు చెప్పి ట్రిప్‌లు కొట్టటం స్కూలు యాజమాన్యాలకు ఇవాళ, రేపు మామూలేనంటూ ఇష్టంలేకపోయినా కష్టమైనా తల్లిదండ్రులకు పిల్లలను పంపక తప్పట్లేదు.

ఇదే అదననుకొని దూరాన తన వర్గం వారితో ఆడుకొంటున్న సత్యం డబ్బా తీసి నీళ్ళల్లోకి విసిరేశాడు రమేష్ వర్గంలోని బాలాజి.

వెంటనే ఆటలో ఉన్న సత్యం ఆట మానేసి బాలాజీ వెంటపడ్డాడు. బాలాజీ పరుగెత్తుకుంటూ వెళ్ళి రమేష్‌కు ఈ విషయం చెప్పాడు.

ఎదురుగా పరుగెత్తుకొస్తున్న సత్యంను ఢీకొట్టడానికి చొక్కా గుండీలూడదీసి, సినిమా ఫక్కీలో ఎదురెళ్ళి నిల్చున్నాడు రమేష్. ఇదంతా చూస్తున్న వివేక్‌కు సిన్మా

చూస్తున్నట్లే అనిపించింది. మాస్టర్లకోసం దరిదాపుల్లో చూశాడు. ఎక్కడా వారి జాడ కనిపించలేదు.

"రండి సార్! మనం కాసేపు జెల్సాచేసి, వీడియోలో సినిమా కార్యక్రమం ప్రారంభిద్దాం!" అంటూ మిగతా మాస్టర్లు హెడ్‌మాస్టరుగారిని పిలవటం, ఆయన పెద్దగా మాట్లాడవద్దు పిల్లలు వింటారని చేత్తో సైగచేసి, మరోవైపు వెళ్ళటం వివేక్ చెట్టు చాటునుంచి చూడనే చూశాడు.

సత్యం దగ్గరికి వస్తూనే రమేష్ పొత్తికడుపులో గుద్దడానికి తలను వంచి పొట్టేలులా ఎగిరాడు. అది గమనించి రమేష్ కూడా తలవంచి తన తలను సత్యం తలతో ఢీకొట్టాడు. రెండు తలకాయలు ఒక్కసారి టప్‌మని శబ్దం చేశాయి. ఇద్దరూ కలియబడ్డారు. ఇక లాభం లేదనుకొని వివేక్ వాళ్ళవద్దకు వెళ్ళి మిగతా పిల్లల సాయంతో వారిని వేరు చేశాడు.

"ఏంటోయ్! మధ్యలో నువ్వెడివి?" అడిగాడు రమేష్ సీరియస్‌గా. "చెప్తా విను. మీ ఇద్దరూ దేనికోసం కొట్టుకుంటున్నారు?" అడిగాడు వివేక్ ఇద్దర్నీ. జరిగింది చెప్పాడు సత్యం శాంతంగా. అయితే రొప్పు మాత్రం ఆగలేదతనికి.

"ఇప్పుడు కొట్టుకోబోవటం వల్లనే ఏం తేల్చుకోవాలనుకుంటున్నారు?" అడిగాడు వివేక్ ఇద్దర్నీ సూటిగా.

"వాడికి నాలుగు తగిలిస్తేగాని పిచ్చి పనులు మానడు" సత్యం కోపంగా.

"వాడికి నాలుగు తగిలించే శక్తి ముందు నీకుందా?" అని అడిగాడు సందేహంగా సత్యాన్ని.

సత్యం తీవ్రంగా వివేక్‌వైపు చూసి "ఏమిటి తమాషా ఆడుతున్నావా? ఎక్కువ మాట్లాడితే నీకూ రెండు పడ్తాయి వాడితో సమంగా" అన్నాడు.

"ఆ... కోపం తెచ్చుకోకు. ఈ ప్రశ్న నీకేగాదు రమేష్‌కు కూడా వేశానని ఎందుకనుకోవు?" అన్నాడు సత్యంను శాంతపరుస్తున్నట్లుగా. రమేష్‌ను కూడా కలిపాడని చెప్పేసరికి సత్యం మనస్సు శాంతించింది.

"ఏం! మనబలం సంగతే అనుమానిస్తున్నావా?... తప్పుకో చూపిస్తా నా తడాఖా" అంటూ క్రాఫ్ సరిచేశాడు రమేష్.

ఓకే... ముందు మీ ఇద్దరి బలం నిరూపించుకోండి. అయితే ఒక చిన్న షరతు. మీరిద్దరూ కొట్టుకోకుండా మీ బలం తేలిపోయే పద్ధతి ఏదన్నా నేను చెబితే మీకు అంగీకారమేనా?" అడిగాడు వివేక్.

"ఓ..." అన్నారు ఇద్దరూ.

మిగతావాళ్ళవైపు తిరిగి "మీరూ చూడండి. వీళ్ళిద్దరూ ఇప్పుడు ఒప్పుకున్నారు. తరువాత వీళ్ళు మాటమారిస్తే మనమే తందాం వీళ్ళిద్దర్నీ" అన్నాడు వివేక్.

అంగీకారంగా తలూపారు అంతా.

ఒక్క క్షణం తోటప్రక్కకు వెళ్ళి ఒక కుందేలును పట్టుకొచ్చాడు వివేక్.

"ఇది కుందేలు. దీని బరువంతా కలిపి కిలోన్నరకంటే ఎక్కువ లేదు. దీన్ని పట్టుకోవాలంటే సైంటిఫిక్‌గా చెవుల దగ్గరే పట్టుకోవాలి. అప్పుడే ఇది ప్రశాంతంగా కదలకుండా ఉంటుంది. కానీ, చెవులదగ్గర కాకుండా దీని నాలుగు కాళ్ళను గట్టిగా కదలకుండా పది నిమిషాలు పట్టుకొని ఉంచగలిగినవాడు బలవంతుడు. ఇది పెంపుడు జంతువు సుమా! కదలకుండా కాళ్ళు పట్టి ఉంచమన్నానేగాని మొరటుగా విరవ వద్దు... మీలో గెలిచినవాడు ఓడినవాడికి క్షమాపణ చెప్పి మరెప్పుడూ ఇలా చేయకూడదు సరేనా?" అడిగాడు వివేక్. ఇద్దరూ సరేనని తలూపారు. ముందు రమేష్ కుందేలును చేతుల్లోకి తీసుకొన్నాడు. కాని, కుందేలు కాళ్ళను బలంగా విసిరేస్తుంటే తన చేతులతో బలంగా వాటిని కదలకుండా ఆపలేకపోతున్నాడు రమేష్. ఎంత ప్రయత్నించినా రమేష్ చేతుల్లోంచి బయటికి వచ్చి అతని ముఖంపై తన్నాయి. దాని గోళ్ళవల్ల అతనికి బుగ్గ రక్కుకుపోయి మంట పుట్టింది. లాభంలేక వదిలేశాడు రమేష్.

సత్యం కూడా ప్రయత్నించి విఫలమయ్యాడు.

ఇద్దరి ముఖాలవైపు చూశాడు వివేక్. ఇద్దరూ తలవంచుకున్నారు. పిల్లలంతా నవ్వుకున్నారు.

"శాఖాహార జీవైనా కిలోన్నర బరువున్న కుందేలును కదలకుండా పది నిమిషాలు పట్టుకోవటానికి మీవల్ల కాలేదే... ఇక మీరేం బలవంతులు, ఏం కొట్టుకుంటారు... శారీరిక శక్తి పరిమితి ఎంతో తెలియక ఇటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడి మీరు మీకు, మాకు కూడా బాధ కలిగిస్తున్నారు. దేహశక్తి ఆరోగ్య సంరక్షణకోసం,

ప్రశాంత జీవనంకోసం వాడాలే తప్ప, ఇలా రాక్షసుల్లా కొట్టుకునేందుకు కాదు. మీకంటే బలవంతుడైన ఈ కుందేలు, గుర్రం, ఏనుగు, ఆవు, బర్రె ఆఖరికి పులైనా తమలో తాము కొట్టుకుంటున్నాయా? మరి మీకెక్కడినుంచి వచ్చింది జంతువుల్లో లేని బలహీనత. కనుక మన స్వభావం ప్రశాంతమైంది. అది తెలుసుకుంటే మనిషి... తెలుసుకోకపోతే జంతువుకన్నా హీనం... కాదా!" అడిగాడు వివేక్.

ఇద్దరూ తలలు వంచుకు నిల్చునిపోయారు. ఇదంతా దూరం నుంచి గమనించి హెడ్‌మాస్టర్ తన స్కూల్లో వివేక్‌వంటి చురుకైన విద్యార్థి ఉండటాన్ని గ్రహించి, గర్విస్తూ... "భేష్.. వివేక్ ఇలా చెప్పటం ఎలా తెలిసింది నీకు..." అని అడిగాడు వివేక్‌ని అభినందిస్తూ.

చేతిలోని గౌతమబుద్ధుడి జీవితం పుస్తకం మాస్టారుకు అందించాడు వివేక్. దానిమీద... "శాంతి-అహింస" అనే రంగురంగుల అక్షరాలు మిలమిలా మెరుస్తూ కనిపించాయి హెడ్‌మాస్టర్‌గారి కళ్ళకు!

- 30.09.1990 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

నిజమైన తృప్తి

చందూ బుంగమూతి పెట్టుకు రావటం చూసింది దూరాన నిల్చున్న మాళవిక.

"ఏంటిరా? అన్నింటికీ అలా ఫీలవుతావు?" అడిగింది మాళవిక చందూని.

"మరీ కిషోర్ వాళ్ళ అమ్మ వాడికేదో టిఫిన్ చేసి పెట్టినట్లుంది. 'రేయ్ చందు... నువ్వ బయటికి ఫో! మావాడే వస్తాడు' అని చెప్పి బయటికి పంపేసిందే." ఏడుపొచ్చేలా ఉంది చందూకు.

తనకంటే సంవత్సరం చిన్నవాడైన చందూకు ఈ చిన్ని విషయం బోధపడనందుకు చందూపై ఎంతో జాలిపడింది మాళవిక.

"అదికాదురా... ఎవరింట్లోనైనా ఏదైనా టిఫిన్ చేస్తుంటే ముందుగా మనమే బయటికొచ్చేయాలి. లేకపోతే వాళ్ళు మనల్ని లేకిపిల్లలు అనుకుంటారు. ఆ టిఫిన్ కోసమే వాళ్ళింటికి వచ్చి అది అయ్యేవరకూ అక్కడే కూర్చున్నాం అని అనుకొంటారని మమ్మీ చెప్పలా?" అంది మాళవిక చందూ తల నిమురుతూ.

"ఏం? అలా ఎందుకనుకోవాలి? మనం మనింట్లో ఎన్నో టిఫిన్లు తింటున్నాం. డాడీ బోలెడన్ని టిఫిన్లు తెస్తారు ఇంటికి. మనం ఏమన్నా లేనివాళ్ళమా?" అడిగాడు చందూ పౌరుషంగా, అమాయకంగా.

"పోనీ... నీతో వాదించలేను... ఎందుకుండాలి ఆ సమయంలో అక్కడ మనం. అది మనిల్లుకాదు గదా!" అంది మాళవిక. మాళవికకు వాదనలు చేయటంకన్నా వివేకంగా నడుచుకోవటం ఇష్టం. చందూ తత్త్వం వేరు.

"అసలు నాకు కిషోర్‌వాళ్ళ మమ్మీ టిఫిన్ తయారుచేస్తున్న ధ్యాసకూడా లేదు. 'హౌస్‌బిల్డింగ్' ఆడుకొంటున్నాను ప్లాస్టిక్ బ్రిక్స్‌తో. ఇల్లు చక్కగా తయారవుతుండగా ఆవిడ వెళ్ళిపొమ్మంది. అందుకని ఏడుపొచ్చినంత పనైంది" అన్నాడు చందు.

"అది కాదురా చందూ... మమ్మీ చెప్పింది, ఒక్కోసారి ఎవరింట్లోనైనా కొంచెమే టిఫన్ తయారు చేశారనుకో... మరి ఆ కాస్త నీకు, నాకు అందరికీ పందారం చేస్తే మరి కిషోర్‌కు ఏం మిగులుతుంది? మన పక్కింటి ఆషా ఆంటీ మొన్న మనింటికి వచ్చి మమ్మీతో ఈ విషయమే చెప్తోంది. ఎప్పుడూ వాళ్ళబ్బాయి శ్రీకాంత్ స్నేహితులు ఇంట్లోనే

ఉండటంతో అన్నీ ఎక్కువెక్కువ టిఫిన్లు చేయాల్సి వస్తోందట. ఈ మధ్య వాళ్ళని శ్రీకాంత్ కోసం ఇంటికి రావద్దని చెప్పిందట... ఆవిడ మాటలన్నీ నేను ఆడుకొంటూ విన్నాను" చెప్పింది మాళవిక.

"ఏమో, మన మమ్మీ ఇలా అనటం నేను చూడలేదు. కొంచెమే చేసినా మమ్మీ అందులోనే కాస్త నా ఫ్రెండ్స్‌కి, నీ ఫ్రెండ్స్‌కి టేస్ట్‌కు ఇస్తుంది. కడుపునిండా తినాలా ఏంటి?" అని చందూ వేరేవాళ్ళతో ఆడుకోను వెళ్ళిపోయాడు.

రెండురోజుల తర్వాత చందూ, మాళవిక లంచ్ బెల్ కొట్టగానే క్లాస్‌లోంచి బయటికి వచ్చారు.

క్యారీయర్స్ షెల్ఫ్‌లో వాళ్ళ లంచ్ బాక్స్ కన్పించకపోయేసరికి మాళవిక కంగారు పడింది. చందూకైతే ఆకలి విపరీతంగా ఉంది.

కాసేపు అటూ ఇటూ షెల్ఫ్ అంతా వెదికారు. చివరికి ఆయాని అడిగారు. క్లాస్ టీచర్‌కు చెపుదామంటే ఆవిడ లంచ్‌రూంలోకి వెళ్ళిపోయింది.

ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని దూరాన కిషోర్, వాడి చెల్లెలు సత్యవతి కూర్చున్నచోటికి వెళ్ళారు.

"ఏం... మీరు ఇవాళ క్యారేజ్ తెచ్చుకోలేదా?" అడిగాడు కిషోర్ మాళవికని.

"తెచ్చాం... కానీ క్యారేజ్ పోయింది" కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ చెప్పింది మాళవిక.

"ఓహో!" అంటూ కిషోర్, వాడి చెల్లెలు వాళ్ళిద్దరూ తెచ్చుకున్న డబ్బాలు విప్పి తినసాగారు.

"కిషోర్... మా చందూకి బాగా ఆకలిగా ఉంది. నాకు లేకపోయినా ఫర్వాలేదు... వాడికి కాస్త పెట్టరా మీరిద్దరూ... రేపు మళ్ళీ మా క్యారేజ్‌లోది పెడ్తాంలే" అడిగింది మాళవిక.

"అమ్మో! మా మమ్మీ చంపేస్తుంది. 'ఒరేయ్ మీ క్యారేజ్‌లోది మీకే సరిపోదు... ఎవరికైనా పందారం చేశారో చంపేస్తాను' అని మరీ మరీ చెప్పింది. దయచేసి అడక్కండేం!" అన్నాడు కిషోర్ తన చెల్లెలువైపు చూస్తూ... సత్యవతి అన్నయ్య చెప్పింది కరెక్టు అన్నట్లుగా తలూపింది.



"సరే... పోదాం పదరా చందూ... ఈ ఒక్కపూటకి ఓర్చుకో. జ్వరంవస్తే అన్నం తినవుగదా! అలానే అనుకో... ఏం నాన్నా!" బ్రతిమాలుతూ పొంగివచ్చే కళ్ళ నీళ్ళను ఆపుకొంటూ చెప్పింది మాళవిక.

"అలాగే... అక్క... నువ్వు ఏడవకు. నాకు ఏడుపొస్తుంది. ఆకలి తగ్గిపోయిందిలే..." అన్నాడు చందు.

మర్నాడు చందూ, మాళవికలకి వేరే క్యారేజి కట్టిచ్చింది వాళ్ళ మమ్మీ.

ఇద్దరూ క్లాసులోంచి బయటికి రాగానే కిషోర్, సత్యవతుల కోసం అటూ ఇటూ చుశారు.

ఇద్దరూ మంచినీళ్ళు తాగి చెట్టుకింద కూర్చోవటం కనబడింది. గబగబా వాళ్ళ వద్దకు వెళ్ళారు చందూ, మాళవికలు.

"ఏం మీరు టిఫిన్ తెచ్చుకోలేదా..." అడిగింది మాళవిక.

"లేదు... మా అమ్మకు రాత్రి బాగా జ్వరం వచ్చింది. డాడీ ఊర్లో లేరు. పక్కింటి సరస్వతి అంటీ మా అమ్మని చూస్తోంది. 'ఇంట్లో ఉండి గొడవ చేస్తారు, మీరు స్కూలుకెళ్ళండి అని ఆంటీ అరిస్తే స్కూలుకొచ్చాం" చెప్పాడు కిషోర్.

"మరైతే ఎలా? ఆకలేయట్లేదా?" అడిగాడు చందు.

"వేయకేం. నాకంటే బాగా బాధపడుతోంది సత్యవతి. కాని, ఏం లాభం, నిన్న మీరడిగితే నే పెట్టలేదుగా. ఇవ్వాళ మీరెందుకు పెడతారు మాకు" అన్నాడు కిషోర్ సత్యవతి వంక చూస్తూ.

"అదేంకాదు, మీరు కావాలని పెట్టనన్లేదుగా. మీ మమ్మీ అంటే భయంతో పెట్టలేదు. మా మమ్మీ ఏం అనదు. రండి అందరం కలిసి తిందాం. మా మమ్మీ ఇవాళ పెద్ద క్యారేజి కూడా కట్టిచ్చింది. నిన్న పాత క్యారేజి పోయిందిగా!" చెప్పారిద్దరూ.

చందూ, మాళవికలు క్యారేజి విప్పారు. ఘుమఘుమ వాసనలు వచ్చి కిషోర్, సత్యవతి ముక్కుపుటాలను తగిలాయి.

"మీ మమ్మీ బాగా వంట చేస్తుందిలాగుందే" అన్నాడు కిషోర్.

"ఏం మీ మమ్మీ చేయదా?" అడిగాడు చందూ.

"ఇంత టేస్ట్ ఉండవు. అయితే కారం, లేకపోతే చప్పగా" అంది సత్యవతి.

అందరూ దాని మాటలు విని నవ్వారు. కిషోర్, సత్యవతులు బాగా ఇష్టపడుతుంటే తనవంతు కూడా ఇచ్చేశాడు చందూ.

"లేదురా! నువ్వు తిను! మాకు చాలు ఇది. మరి నీకు అసలు లేకపోతే కష్టం కదూ" అన్నాడు కిషోర్.

"ఏమో! నువ్వు, సత్యవతి తింటుంటే మాకు మేం తిన్నంత సంతృప్తిగా ఉంది. మా ఇంట్లోనూ మమ్మీ, డాడీ, నేను, మా అక్క అందరం ఎవరికైనా సరే ఏదైనా తినడానికి పెడ్తే భలే సంతోషపడ్తాం. మాకు ఎంతో తృప్తిగా ఉంటుంది అలా చేస్తే" అన్నాడు చందు.

'అవును' అంది మాళవిక.

వాళ్ళిద్దరి కళ్ళు నిజంగా సంతోషంగా, గర్వంగా మిల మిలలాడటం కిషోర్ చూసి సంతృప్తిగా తిన్నాడు. సమానంగా అందరూ భోంచేశాక ఎవరి క్లాసులకు వాళు ళ్ళ వెళ్ళిపోయారు.

సాయంత్రం కిషోర్‌వాళ్ళ అమ్మకి తెలివి వచ్చాక పిల్లవాడు కిషోర్‌ని దగ్గరికి పిలిచి "ఇవ్వాళ భోంచేశారా? ఎవరు పెట్టారు?" అని అడిగింది.

"పక్కింటి అంటీగాని ఎవ్వరూ కాని పెట్టలేదు మమ్మీ. మేం అడిగినా విసుక్కున్నారు. సరస్వతీ ఆంటీ అయితే స్కూలుకు పొమ్మని అరిచింది. స్కూలుకు వెళ్ళాం. అక్కడ చందూ, మాళవిక వాళ్ళ మమ్మీ ఏమీ అనదని వాళ్ళ క్యారేజీలో సగం మాకు పెట్టారు. ఎంతో సంతోషంగా తిన్నాం. చందూ, మాళవిక ఏమన్నారో తెలుసా" అడిగాడు కిషోర్ వాళ్ళమ్మని.

"ఏమన్నారు?" అడిగింది వాళ్ళ తల నిమురుతూ.

"ఎప్పుడైనా చేసుకొంది మనం తింటే తృప్తే ఉండదు. జంతువులు తిన్నట్లుగా ఉంటుంది. మనం చేసుకొన్నవి వేరేవాళ్ళు తిని బాగుందంటే మనకు నిజమైన తృప్తి" అన్నారు మమ్మీ. నిజంగానే కదూ" అన్నాడు కిషోర్.

కిషోర్ వాళ్ళమ్మకు కళ్ళు తిరిగినంత పనైంది. పసివాడినుంచి వచ్చిన అ మాటల దెబ్బకు.

ఆపై కిషోర్ వాళ్ళమ్మగారెప్పుడూ ఇదివరకులా ప్రవర్తించకపోవటం చందూ, మాళవికలను, కిషోర్ స్నేహితులనూ బాగా ఆశ్చర్యపరిచింది.

- 28.10.1990 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

రహస్యం

"వద్దు డాడీ! కొట్టొద్దు డాడీ!... అమ్మా!... అమ్మో! డాడీ!" దీనంగా, ఆర్తితో అరుస్తున్నాడు రామం ఇంటి ఎదురు శంకరం గారబ్బాయి వాసు.

"చావరా గాడిదకొడకా! చావు! ఎన్నిసార్లు చదివినా గుర్తుండదురా నీకు! ఉండదురా నీకు!..." ఫట్! ఫట్! ఫట్ శంకరంగారి అరుపులు, బెల్టు దెబ్బలు వినిపించాయి రామానికి.

రామానికి ఇది కొత్తేమీ కాదు. అందుకు కారణాలు రెండు. ఒకటి – రామం చిన్ననాటి చదువంతా అమ్మా, నాన్నల చావుదెబ్బలతో సాగటం, మొదటిసారిగా ఉ ద్యోగ జీవితంలో ప్రవేశించి, ఆ కాంపౌండ్‌లోని చిన్న రూంలో అద్దెకు ఉంటున్న రామానికి చుట్టుప్రక్కల ఉన్న అన్ని మధ్యతరగతి కుటుంబాలలో పిల్లల చదువులు, హాహాకారాలతో సాగటం రెండవది.

ఒకసారి చెవులో మిషనువంక చెయ్యి పోనిచ్చి ఆప్యాయంగా తడిమి కీర్తిశేషులైన తండ్రిని గుర్తుచేసుకున్నాడు. చిన్నప్పుడు తనను చదివించడానికి తన తండ్రి చేసిన దౌర్జన్యం, హింసకు తీపిగుర్తుగా ఆ హియరింగ్ మిషిన్ తన చెవికి తప్పనిసరైందని జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా రామం మనస్సు కకలావికలం అవుతుంది. వాసులాంటి పిల్లల ఆర్తనాదాలు విన్నప్పుడు చిరు అలలాంటి గతం ఉప్పెనలా, బడబాగ్నిలా లేచి బద్ధలవుతుంది.

"నో... ఇకమీద ఈ హింసాకాండ జరగడానికి వీల్లేదు. దీనికి అడ్డు వేయాల్సిందే" అని ఓ క్షణం అతని మనస్సు ఆక్రోశించింది. ఆవేదన పడింది. ఒక క్షణం ప్రశాంతంగా కూర్చుని ఆలోచించాడు. ఏదో ఐడియా అతని బుర్రలో తళుక్కున మెరిసింది.

అంతే! తిన్నగా శంకరం గారింటివైపు వెళ్ళాడు. వాసు ఏడుస్తూ ఓ మూల నిల్చుని చదువుతున్నాడు. అతని చేతులు గజగజవణుకుతున్నాయి. ఏడుపుతో కలిసిన అతని చదువు స్పష్టంగా లేదు. ఎక్కిళ్ళు వస్తున్నాయతనికి మధ్య మధ్యన. శంకరంగారు కొడుకును కొట్టి, అలిసిపోయి పడక కుర్చీలో సేదతీర్చుకుంటున్నారు.

రామాన్ని చూడగానే, "రా రామం! రా!" అంటూ లోపలికి ఆహ్వానించాడు.

వాసువైపు రామం జాలిగా చూస్తూ వెళ్ళి కుర్చీలో చతికిలపడ్డాడు.

వాసువైపు రామం చూసిన జాలిచూపులను గమనించి "రేయ్! సరిగా చదువు! పెద్దగా చదువు! సరిగ్గా గంటలో చెప్పలేకపోయావో ఈ పూట నీకు నా చేతిలో చావు తప్పదు" అన్నాడు శంకరం తను పిల్లల చదువు విషయంలో ఎంత స్ట్రిక్టో రామానికి అర్థం కావాలన్నట్లుగా.

"గంట ఎందుకు? అరగంటలో చెప్తాడు మీకు కావలిస్తే. కదు వాసూ!" అంటూ ఆప్యాయంగా పలకరించాడు రామం వాసుని.

రామం అంకుల్ అంటే వాసుకు చాలా ఇష్టం. స్కూటర్‌మీద తిప్పుతాడు. చాక్లెట్లు కొనిస్తాడు. చక్కటి కథలు చెప్తాడు. అందువల్ల రామం రాగానే వాసు మనస్సు కాస్త చల్లబడింది.

"ఆ... చెప్పాల్సిందే! వెధవకి నాలుగు ముక్కలు గుర్తుండవు. గట్టిగా చదవరా ఎందుకు గుర్తుండవో చూస్తా అంటే చదివితేగా! ఎప్పుడూ ఆటలూ! పాటలూ! చదువు సంధ్య లేకపోతే ఎందుకు పనికివస్తాడు? మీరే చెప్పండి" అంటూ రామం వత్తాసు కోసం చూశాడు శంకరం.

"గుర్తుండవు మర్చిపోతాను" అని అన్నాడు వాసు.

వాసు రామం దగ్గరకి వచ్చాడు. "దా! ఇలా నా ఒళ్ళో కూర్చో" అంటూ తన ఒళ్ళో కూర్చోబెట్టుకొని; జేబులోంచి ఒక చాక్లెట్‌తీసి వాసుకిచ్చి, నే కొన్ని ప్రశ్నలు అడుగుతాను సమాధానం చెప్తావా?" అని ఆప్యాయంగా తల నిమురుతూ అడిగాడు రామం.

ఓ... అన్నట్లు తలూపాడు వాసు.

"నీకు ఏ విషయాలూ గుర్తుండవా! లేక చదువుకు సంబంధించిన విషయాలే గుర్తుండవా?" అడిగాడు శంకరం.

"కొన్ని గుర్తుంటాయి. కొన్ని గుర్తుండవు అంతే" అన్నాడు వాసు.

"ఏవేం గుర్తుంటాయి?" అడిగాడు రామం వాసుని మళ్ళీ.

"హిస్టరీ, ఇంగ్లీషు, తెలుగు, హిందీ బాగానే గుర్తుంటాయి. సైన్సు, లెక్కలు

ఎంత చదివినా గుర్తుండవు" అన్నాడు వాసు భయం భయంగా.

"అదేం, అవేం పాపం చేశాయేంటి?" అందుకున్నాడు శంకరం కోపంగా.

"మీరూరుకోండి. నే ప్రశ్నిస్తున్నాగా. ఏం సమాధానం చెప్తాడో విననీయండి" అన్నాడు రామం శంకరంగారితో.

"సరే కానీయండి. నాకు ఇవన్నీ అనవసరం. నాకు గంటలో వాడు పాఠం ఒప్పచెప్పకపోతే వాడి చావు మూడిందే అని అర్థం" అన్నాడు శంకరం అదేదో ఘనకార్యం అన్నట్లుగా.

"అంటే గంట తర్వాత ఒప్పచెప్పి మళ్ళీ వాసు ఆ పాఠం హాయిగా మర్చిపోవచ్చునేగా మీ అభిప్రాయం" అన్నాడు రామం.

"అదెట్లా కుదురుతుంది. ఎప్పుడు ఎన్నిసార్లు అడిగినా గుర్తుండాలి" అన్నాడు శంకరం.

"అయితే నా మాట వినండి. గంటలో ఒప్పచెప్పమంటే చెప్తాడు కాని, ఎప్పుడూ గుర్తుంచుకోవటం అతనికి సాధ్యపడదు. ఎప్పుడూ గుర్తుండేటట్లు చదవాలంటే వాసుకి కొంత వ్యవధినివ్వండి. బాబుకు నే చేయవలసిన సహాయంనే చేస్తాను" అన్నాడు రామం.

"మీరు మాట్లాడేది నాకర్థం కావటం లేదు. ఇలా రెండురకాలు ఉండటం ఎలా సాధ్యం?" అడిగాడు శంకరం.

"సింపుల్. చిన్నప్పుడు మీరు ఎక్కాలు ఎంతవరకూ చదివారు?"

"ఇరవై వరకు. మా రోజుల్లో చావకొట్టి చదివించారు మాస్టార్లు. అప్పట్లో కిందినుంచి పైకి, పైనుంచి కిందికి కూడ అప్పచెప్పేవాళ్ళం" అన్నాడు గర్వంగా శంకరం.

"అయితే పందొమ్మిది పద్దెనిమిదులెంత? ఠక్కున చెప్పండి చూద్దాం" అన్నాడు రామం.

"... ..."

"సారీ. చెప్పలేకపోయారు. హెచ్చవేసి నిముషం తర్వాత నేను చెప్పగలను. చదివినది గుర్తుండాలి అనడానికి మనస్తత్వశాస్త్ర సూత్రం ఒకటి ఉంది. అది మీకు ఇప్పుడర్థం కాదు. వాసులో మార్పు వచ్చాక మీరే తెలుసుకుంటారు" అన్నాడు రామం.

"సరే, అయితే... నువ్వు చెప్పినదానికి ఒప్పుకొన్నాను" అన్నాడు శంకరం. రామం, వాసుని తీసుకొని, శంకరంగారికి చెప్పి బయటికి వచ్చాడు.

వాసుకి జైల్లోంచి బయటపడ్డట్టయింది. రామం అంకుల్ అంటే ఇష్టం మరింత పెరిగింది.

ఒక వారం గడిచీ గడవక ముందే వాసు ప్రతి సబ్జక్టు గుర్తుండేలా ఎక్కువ జ్ఞాపకశక్తితో చదివి, వాళ్ళ నాన్నకు అప్పజెప్తున్నాడు. శంకరంగారికి వాసులో వచ్చిన మార్పునుచూసి ఆనందం పొంగి పొర్లింది.

గబగబా రామం రూముకు వెళ్ళాడు. రామం మిత్రుడు వివేకానందతో మాట్లాడుతున్నాడు.

"రండి సార్! సమయానికి వచ్చారు. ఇదిగో ఈయనే మాస్టర్ వివేకానంద. చిల్డ్రన్ సైకాలజిస్ట్" అని వివేకానందను పరిచయం చేశాడు శంకరంగారిని రామం.

నమస్కారం చేసిన వివేకానందకు "ఈయనెవరో తెల్సా. నీ లేటెస్ట్ స్టూడెంట్ వాసు వాళ్ళ నాన్నగారు" అని సౌంజ్ఞ చేశాడు రామం.

"మా అబ్బాయిలో వచ్చిన మార్పుకు నువ్వే కారణమని, థాంక్స్ చెప్పి భోజనానికి పిలుద్దామని వచ్చానోయ్!" అన్నాడు శంకరం ఎంతో స్వతంత్రంగా.

"అది నా గొప్పేమీ కాదు సార్. ఇదిగో మా వివేకానంద చలవే అది. చెప్పవోయ్" అన్నాడు రామం.

"భలేవాడివోనోయ్ రామం. వాసు బుద్ధిమంతుడైన కుర్రవాడు. అయితే బాబుకూ, మీకు కూడా తెలియని విషయం ఒకటుంది. గుర్తుంచుకోవటం, మిగతావి మర్చిపోవటం సహజమే. వాసుకు లెక్కలు, సైన్స్, అంటే ఆసక్తి తక్కువ. కాని ఇతరత్రా సిన్మాలు, కథలు, సాహిత్యం, చరిత్ర అంటే చాలా ఆసక్తి. అందువల్ల ఎప్పుడూ అవే మననం చేసుకుంటూ, ఆలోచిస్తూ ఉంటాడు కనుక – లెక్కలు, సైన్సు గుర్తుండేవి కావు.

"వాసూ! నిజానికి వాటిపట్ల నీకున్న ఆసక్తివల్ల అవి నీకు చాలా సులభంగా కనిపిస్తున్నాయే తప్ప, లెక్కలు, సైన్సుల్లో ఏ లోపం కాదు. అవి నీకు గుర్తుండక పోవటానికి కారణం నీ అనాసక్తే తప్ప మరొకటి కాదు. సైన్సు, లెక్కల్లో కూడా అనేక తమాషాలున్నాయి. అవి లేకపోతే మిగతా సబ్జక్టులు కూడా ఆసక్తికరం కావు అని ఉదాహరణలతో చక్కగా చెప్పాం. అంతే వాసుకి సైన్సు, లెక్కలపట్ల కూడా ఆసక్తి కలిగింది. ఆసక్తే జ్ఞాపకశక్తికి కారణం. ఇదే అసలు రహస్యం" అన్నాడు వివేకానంద.

ఈ విషయం తెలియక పసివాడైన వాసుని హింసించినందుకు చాలా కుమిలి పోయాడు శంకరం.

- 11.11.1990 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

లక్ష్యం

రాఘవరావు మాస్టారుగారు క్లాసులో పాఠం చెబుతుండగా, అటెండర్ సర్క్యులర్ తీసుకువచ్చాడు. పాఠం చెప్పటం ఆపి మాస్టారు సర్క్యులర్ చదివి తలెత్తి "పిల్లలూ! వినండి! వచ్చేవారం నుంచి మీకు క్వార్టర్లీ పరీక్షలు. టైమ్ టేబుల్ హెడ్‌మాస్టారుగారి రూమ్ దగ్గర నోటీస్ బోర్డులో చూడండి" అని పిల్లలకు దాని వివరం చెప్పి ప్యూన్‌ను పంపించివేశారు.

ఆనంద్, వివేక్‌లు సర్క్యులర్ వివరాలు వినగానే ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఇద్దరూ ఏడవ తరగతి కామన్ పరీక్షలు ఫస్ట్‌క్లాస్ మార్కులతో ప్యాసై, ఎనిమిదవ తరగతికి వచ్చారు. ఈ సంవత్సరం ఇద్దరూ ఒకే వీధిలో దగ్గర దగ్గర ఇళ్ళ వాళ్ళే. ఆరవ తరగతి నుంచి ఇద్దరూ పోటీపడి చదువుతున్నారు. కానీ, వివేక్‌కన్నా తనకు ఎప్పుడూ మార్కులు తక్కువరావటం ఆనంద్‌కు సహించరానిదిగా పరిణమించింది నానాటికీ.

రాఘవరావు మాస్టారు సాధారణంగా క్లాస్ అవడానికి అయిదు నిమిషాల ముందే పాఠం చెప్పటం పూర్తి చేసి, పిల్లలకు మర్నాడు చేయవలసిన హోంవర్కు డిక్టేట్ చేస్తారు ఎప్పుడూ. అదేవిధంగా ఈ రోజు కూడా క్లాస్ ముగించి – "పిల్లలూ! వినండి! ఎటూ మీకు క్వార్టర్లీ పరీక్షలని నోటీస్ వచ్చింది కాబట్టి ఇక మీకు హోంవర్కు ఇవ్వదలచుకోలేదు.

దాని బదులు మీరు ఇంతవరకూ ఎంత బాగా ప్రిపేర్ అయ్యారో తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో మీకు రేపు క్విజ్ కాంపిటేషన్ పెడ్తాను.

యధావిధిగా సెక్షన్ రెండు వర్గాలు అవుతుంది. ఆనంద్, వివేక్‌లను చెరో వర్గం పంచుకుంటుంది. సరేనా!" అంటూ పిల్లలవైపు చూసి కనుబొమ్మలు ఎగరవేశారు. పిల్లలంతా తలూపారు. రాఘవరావు మాస్టారు ఆనంద్, వివేక్‌ల వైపు చూశారు. వివేక్, ఆనంద్‌లు కూడా అదే అదనుకోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళ కళ్ళల్లో వెలుగు మాస్టారుగారిని ఎంతో సంతృప్తి పరిచింది.

"రేయ్! వివేక్! క్విజ్ కాంపిటేషన్ పేరు వినగానే ఆనంద్ పులి అయిపోతాడు.

నువ్వు మేకవవుతావు. ఈసారి అలా కాకూడదు సుమా! మీ ఇద్దరి మధ్యా ఏమైనా ఒప్పందం ఉందా ఏమిటి సంగతి? పరీక్షల్లో ఎప్పుడూ నువ్వ ఫస్ట్ వస్తావు. క్విజ్‌లో ఎప్పుడూ ఆనంద్ ఫస్ట్ వస్తాడు. నాకీసారి మీరిద్దరూ మార్పు చూపించాలి. సరేనా! అప్పుడే మీరిద్దరూ సమ ఉజ్జీలన్న ఆనందం నాకు కలుగుతుంది" అన్నారు మాస్టారు.

వివేక్ తలూపాడు. ఆనంద్ మాత్రం గర్వంగా వివేక్‌వంగా, మాస్టారివంకా మార్చి మార్చి చూశాడు. మాస్టారుగారు వెళ్ళిపోయారు బెల్ మ్రోగడంతో.

పైకి ఆనంద్ గర్వంగా ముఖం పెట్టినా వివేక్‌ను పరీక్షల్లో తను అధిగమించలేక పోయానన్న మాస్టారి మాట అతని మనస్సులో ఎక్కడో ముల్లులా కదులుతూనే ఉంది.

తను అందుకు కారణం ఎన్నోసార్లు ఆలోచించాడు. పరీక్షల సమయానికి తనలో తనకు తెలియని భయం ఒకటి ప్రవేశిస్తుంది. తను చదివినవే పరీక్షలో వస్తాయో, రావోనని – తను అన్ని ప్రశ్నలకు తగినంత సమాధానం రాసే సమయం ఉంటుందో, ఉండదోనని – ఈసారైనా తను రాసే జవాబులు వివేక్ రాసే సమాధానాల కన్నా బాగుంటాయో, బాగుండవోనని. ఈసారైనా తనకు ఫస్ట్ మార్కులు వస్తాయో రావోనని. ఇలా తనలో తను అనేక ప్రశ్నలు వేసుకుంటాడు. ఈ ప్రశ్నలతోనే తను చదివి పరీక్షలు రాస్తాడు. నిద్రరాకుండా, అన్నంకూడా మానేస్తాడు. టీ, కాఫీలు తెగ త్రాగుతాడు. కానీ, చివరకు తనకన్నా వివేక్‌కే ఎక్కువ మార్కులు వస్తాయి. ఇదే తన సమస్య. దీన్ని ఎలా అధిగమించాలో ఆనంద్‌కు తెలియలేదు. రోజంతా ఈ ఆలోచనలతోనే సతమవుతున్నా ఆనంద్ రాత్రి ఇంటికి వెళ్ళేటప్పటికి వాళ్ళ బాబాయి రామకృష్ణను చూసి ఎగిరి గంతేశాడు. రామకృష్ణ బాబాయి ఫారిన్‌కు వెళ్ళేముందు – వెళ్ళి వచ్చాక ఎలా చదివి ప్రపంచఖ్యాతి గాంచాడో చిన్నప్పటి నుంచి అమ్మ చెప్పేది విని ఆనంద్ ఆయనపట్ల ఎంతో అభిమానం, ప్రేమ పెంచుకున్నాడు. తన సమస్యను బాబాయి పరిష్కరిస్తాడేమోనన్న ఆశ వెంటనే అతనిలో కలిగింది.

ఆ రాత్రి బాబాయి పడుకోబోయే ముందు తన సమస్యలన్నీ పూసగుచ్చినట్లు చెప్పాడు ఆనంద్. ఈ పోటీయుగంలో ఆనంద్ సమస్యలను సహజమైనవిగా గుర్తించి వాటిని పరిష్కారం చేసేశాడు రామకృష్ణ.

ఆ రాత్రి ఆనంద్ హాయిగా నిద్రపోయాడు. మరునాడు రాఘవరావు మాస్టారుగారు ఊహించనివిధంగా క్విజ్‌లో వివేక్ ఆనంద్‌పైన ఆధిపత్యం సాధించాడు. క్లాస్ పిల్లలంతా వివేక్‌ని గాలిలోకి ఎత్తి చప్పట్లు కొట్టారు. ఆనంద్ కూడా వివేక్‌కి అభినందన తెలియజేశాడు.

తరువాత క్వార్టర్లీ పరీక్షలు ముగిసి రిజల్ట్స్ వచ్చాయి. ఆనంద్‌కు ఫస్ట్ మార్కులు రావటం వివేక్‌తో సహా మొత్తం స్కూలు మాస్టర్లందరికీ ఆశ్చర్యం కలిగించింది. తన కోరిక తీరి ఆనంద్, వివేక్‌లు సమ ఉజ్జీలయినందుకు రాఘవరావు మాస్టారుగారు ఎంతగానో సంతోషించినా ఆనంద్ విజయానికి కారణం ఆయనకూ బోధపడలేదు.

వివేక్, ఆనంద్‌తో కలిసి లంచ్ సమయంలో "ఇంతకీ నన్ను ఓడించటానికి నువ్వు ఏ కొత్త పుస్తకం చదివావో కాస్త నాకు చెప్పు బాబూ" అన్నాడు. వివేక్ అంటే మునుపటి ఈర్ష్య లేదిప్పుడు ఆనంద్‌కు.

ఏంలేదు వివేక్! ఇంతకుముందు కూడా నీతో సమంగా కృషి చేసేవాడిని. కానీ, చదువుతున్నప్పుడు, పరీక్ష రాస్తున్నప్పుడూ మానసికంగా సన్నద్ధమవుతున్నప్పుడు కూడా నేను చేయవలసిన కర్తవ్యం కాక నీపై ఈర్ష్యతో రాబోయే ఫలితం గురించి ముందే ఊహించి ఆలోచించేవాడిని. ఫలితంగా నా ప్రిపరేషన్ డైవర్టయి దెబ్బతినటమే కాక, మానసిక ఒత్తిడి, భయం, కంగారు కూడా కలిగేవి. అందువలన మానసిక సామర్థ్యం దెబ్బతినటం సహజమే కదా! పోటీకి, ఈర్ష్యకి తేడా ఇదే – చెప్పాడు ఆనంద్.

ఆ పక్కనే లంచ్‌రూంలో భోజనం చేస్తున్న రాఘవరావుగారికి ఆనంద్ మాటలు ఎంతో ముచ్చటగొలిపాయి.

- 21.04.1991 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

బొమ్మ మనసు

ఆ రోజు ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో పేరెంట్స్ మీట్. ఎప్పటిలాగే ఈసారి కూడా స్కూలు ఆవరణం పిల్లల తల్లిదండ్రులతో కళకళలాడుతోంది. సాధారణంగా పేరెంట్స్ మీట్‌కు ఎక్కువమంది తల్లులే వస్తుంటారు. ఎందుకంటే మధ్యతరగతి కుటుంబాలలో పిల్లల చదువుగురించి తండ్రులకన్నా తల్లులకే శ్రద్ధ ఎక్కువ.

పిల్లల తల్లులంతా ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకొంటుండగా ప్రిన్సిపాల్ వేదకుమార్ మారుతీకారు కాంపౌండ్‌లోకి ప్రవేశించింది. ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఇద్దరు పెద్దమనుషులు కూడా కారు దిగి వారు వేదికవైపు వెళ్ళారు.

క్షణాల్లో నిశ్శబ్దం అలుముకుంది. వేదకుమార్, ఆయనవెంట వచ్చిన వారు వేదికపైన కుర్చీల్లో ఆసీలులైనారు. స్త్రీలంతా ఒకవైపు, మగవారంతా మరోవైపు కుర్చీల్లో కూర్చున్నారు.

కార్యక్రమం ప్రారంభమైనట్లు వేదకుమార్ ప్రకటించగానే, స్త్రీలలోనుంచి వసంత లేచి తన పదమూడేళ్ళ బాబు రాఘవ గురించి తను ఎదుర్కొంటున్న సమస్య చెప్పనారంభించింది.

"మీ స్కూలుకు చాలా పేరుందని మా అబ్బాయిని ఇక్కడ చేర్చాం. కానీ మా వాడి చదువులో చెప్పుకోదగ్గ మార్పేమీ రాలేదు. ఏ ఒక్కసారైనా మావాడి ప్రోగ్రెస్ రిపోర్టులో మార్పు వస్తుందేమోనని ఎంతో ఆశపడతాను. కానీ, ఒక్కసారి కూడా మావాడికి ర్యాంకు రావటం లేదు. మావాడికన్నా దద్దమ్మలకు ర్యాంకులు వస్తున్నాయి గానీ, మావాడు మాత్రం 'ఎక్కడవేసిన గొంగళి'లాగే ఉన్నాడు. మాకు ఈ స్కూల్‌పై నమ్మకం పోతోంది"

ఆమె చెప్పింది విని, "నెక్ట్స్, అన్నాడు ప్రిన్సిపాల్.

"మా అబ్బాయి ఎప్పుడూ అదోలా ఏదో ఆలోచిస్తూ ఉంటాడే తప్ప చదువు సీరియస్‌గా పట్టించుకున్నట్లు కనిపించడు. అదేమంటే తనకు చదువులో పెద్ద శ్రద్ధ లేదు. ఈ సైన్స్, లెక్కలు నాకు ఏమంత ఆసక్తికరంగా లేవంటాడు. స్కూల్లో సరిగ్గా పాఠాలు చెప్తే, వెనకబడిన పిల్లలపట్ల శ్రద్ధ తగినంతగా చూపితే మా బాబు అలా

ఎందుకంటాడు? మీ స్కూల్లోనైనా మావాడు బాగా చదువుకొని చురుకవుతాడను కొన్నాను. కాని, ఫలితం కనిపించలేదు. ఈసారి కూడా మా అబ్బాయిలో మార్పు రాకపోతే మరెక్కడన్నా రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చక తప్పదు” అంది సుశీల.

సుశీలగారిని కూర్చోమని సైగచేసి, మిగతావారి సమస్యలు కూడా శ్రద్ధగా విన్నాడు ప్రిన్సిపాల్. దాదాపు సగం ఫిర్యాదులు తమ పిల్లలకు చదువుపై శ్రద్ధ లేదనే.

“చూడండి... మీ సమస్యలన్నీ ప్రధానంగా రెండు రకాలుగా నాకు తోస్తున్నాయి. ఒకరకం క్లాస్ రూం సమస్యలు. రెండవ రకం కుటుంబ వాతావరణ సమస్యలు. రెండవదాన్ని గురించి మీకు బొత్తిగా తెలియదు. కనుక అన్ని సమస్యలూ క్లాస్‌రూం సమస్యలేనని భావిస్తున్నారు. ఫలితంగా మీరు స్కూలు యాజమాన్యాన్ని, అధ్యాపక సిబ్బందిని నిందిస్తున్నారు.

నిజానికి ఒక విద్యార్థి ఎంతో ప్రతిభకలవాడు. అతని హృదయం, మనస్సు నవనీతం వంటిది. బుద్ధి సున్నితమైంది. కాని ప్రయోజనమేమిటి? వాళ్ళింట్లో అమ్మ, నాన్న ఎప్పుడూ కలహించుకుంటూ ఉంటారు. ఒక్కసారి అతనిముందే కలబడి కొట్టుకుంటారు. ఇవన్నీ ఇంట్లో తలుపుచాటున, నాలుగు గోడల మాటున గుట్టుగా జరుగుతున్నాయని వాళ్ళనుకోవచ్చు. కానీ, వాటిని చూసే పసిహృదయాల్లో అవి ముద్రితమై, వారి ఆలోచనలను, మేధాశక్తిని, సున్నితమైన మనస్సును ఆక్రమించి రకరకాల మార్గాల్లో బయటి ప్రపంచంలోకి ప్రసరిస్తాయి.

అలాంటి పిల్లలు తమ భావాలను ఎలా వ్యక్తం చేస్తారో ఆయా తల్లిదండ్రులు తమ పిల్ల పాఠ్య పుస్తకాలోసారి తిరగవేస్తే తెలుస్తుంది. వాళ్ళు రాసే రాతలు, గీసే బొమ్మలు కార్టూన్లను మించి ఉంటాయి. ఒకసారి పరీక్షిస్తే అర్థమవుతుంది.

ఇలాగే మరో రకం సమస్య. కొందరికి పెద్ద పెద్ద పాఠాలు చదవటం, గుర్తు పెట్టుకోవటం, అప్పజెప్పటం కష్టంగా ఉంటుంది. దానికి బదులు చక్కని బొమ్మలు గీయటం అంటే చాలా ఇష్టం ఉండవచ్చు. కానీ, ఏ సబ్జెక్టు చదివైనా అందులో ప్రధాన సారాంశాన్ని బొమ్మ గీయటమే నిజమైన డ్రాయింగ్ అని ఆ బాబుకు నచ్చచెప్తే తాలు. అతను సైన్సు, చరిత్రలు కూడా శ్రద్ధగా చదివి, ‘గెలీలియో’ ప్రయోగాలను కూడా



బొమ్మలుగా గీయగలగటం ఎన్నోసార్లు మేము చూడటం జరిగింది. నేను చెప్పింది కథ కాదు. మొదటిరకం విద్యార్థిని నేనైతే, రెండవ రకం విద్యార్థి ప్రముఖ ఆర్టిస్టు గోపీచంద్. ఈ వేదికపైనే ఉన్నారు. కాబట్టి మీ పిల్లల సమస్యల పరిష్కారానికి మనమంతా కలిసి పనిచేయాలి. త్వరలోనే మీరు మార్పు గమనిస్తారు. సెలవు" చెప్పాడు వేదకుమార్.

ప్రిన్సిపాల్‌కు పిల్లల సమస్యలపట్ల ఉన్న అవగాహనేగాక, ఇళ్ళల్లో పిల్లలపట్ల తాము ఉన్నత విలువలు పాటించకపోవటానికి పశ్చాత్తాపపడుతూ చాలామంది ఇళ్ళకు వెళ్ళారు.

పదిహేను రోజుల తర్వాత ఒక రోజు రాఘవ నోట్‌బుక్ తీసి చూశాడు వేదకుమార్. అతని నోట్‌బుక్‌లో తల్లిదండ్రులు కొట్టుకుంటున్నట్లు, వాళ్ళను తను ఏవగించుకొంటున్నట్లు ఇంతకుముందు గీచిన కార్టున్ల స్థానంలో "అమ్మా, నాన్న జిందాబాద్" అని తను కుటుంబసభ్యులను కార్టూన్‌గా గీసిన బొమ్మను గమనించాడు. అలాగే, సుశీలగారి అబ్బాయి నిజంగానే తన నోట్‌బుక్‌లో ఆర్కిమెడిస్ నీటిలో మునిగి "యురేకా" అంటూ అరుస్తున్న బొమ్మను గీస్తూ కనిపించాడోసారి. తాము గీచే బొమ్మలు తమ సమస్యలను పరిష్కరించాయని ఆ చిన్నారులకు మాత్రం తెలియదు.

పిల్లల ప్రవర్తనను క్షుణ్ణంగా పరిశీలించటం ద్వారా, వారి సమస్య ఏమిటో తెలుసుకొని, ఆ విషయం నేరుగా ప్రస్తావించి, నలుగురిలో వారిని అవమానించకుండా తాను, గోపీచంద్ వారి మనోగతాన్ని ఆనాడు వేదికపై ప్రతిబింబాలుగా మారి, తమ కర్తవ్యాన్ని యుక్తిగా నిర్వహించినందుకు ఎంతో తృప్తిగా నిట్టూర్చాడు వేదకుమార్.

పిల్లలు తమ మనోభావాలను బొమ్మలు, కార్టూన్ల ద్వారా కూడా వ్యక్తం చేస్తారని తెసుకున్న వసంత, సుశీలలాంటి తల్లులు మరెప్పుడూ వారికి ఆ అవకాశం ఇవ్వలేదు.

- 10.03.1992 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

బొమ్మ జపమాల

వివేక్ బుంగమూతి పెట్టుకొని ఇంటికి రావటం చూసిన కోటమ్మ కొడుకు ఇంటికి రాగానే – "ఏమైంది వివేక్? ఎందుకు అలా ముఖం ముడుచుకుని వస్తున్నావు? ఏమైంది నాన్నా?" అని గాబరాగా ప్రశ్నల వర్షం కురిపించింది.

వివేక్ కళ్ళనీళ్ళ పర్యంతం, ఎక్కిళ్ళు పెడుతూ బ్యాగ్‌లోని ప్రోగ్రెస్ కార్డు తీసి అమ్మకిస్తూ – "అమ్మా... డాడీకి చెప్పొద్దే ప్రోగ్రెస్ కార్డు ఇచ్చారని... ఈసారి కూడా బాగా తక్కువ మార్కులు వచ్చాయే... నాన్నడిగితే మరేదైనా చెప్పు..." అంటూ గజగజ వణుకుతూ చెప్పాడు.

వాడి భయం, దుఃఖం, గాబరా చూసి కోటమ్మ మనసు కలవరపడింది.

"లేదులే! ఛీ ఈ మాత్రం దానికి ఇంత భయం ఎందుకు... మీ నాన్నకు నేను చెప్తాలే సరేనా!" గుండెకు బిడ్డను హత్తుకుంటూ చెప్పింది కోటమ్మ.

ఈసారికి గండం తప్పిందనిపించినా వివేక్ మనస్సులో ప్రతిసారీ తనకు మార్కులు తక్కువ ఎందుకొస్తున్నాయో బోధపడటం లేదు.

ఏం చేయాలి? తనలో తాను ఆలోచించుకుంటూ నిద్రలోకి జారిపోయాడు వివేక్.

తెల్లవారి నిద్రలేచేసరికి వివేక్ కళ్ళముందు తను రోజూ పూజించే వివేకానంద స్వామి ఫొటో బదులు తన మేనమామ సాయిబాబా ముఖం కనపడింది.

"ఏరా వివేక్! గుర్తుపట్టావా?" అడిగాడు వివేక్ మామయ్య సాయిబాబా!

"అదేం!... ఎప్పుడొచ్చావు మామయ్యా?" అంటూ ఒక్కసారిగా పక్కపై నుంచి లేచి మామయ్యను కౌగలించుకున్నాడు వివేక్.

"అమెరికాలో రీసెర్చ్ అయిపోయింది. ఇక్కడే హైదరాబాద్ యూనివర్సిటీలో నాకు ఉద్యోగం దొరికింది. వారం రోజులయింది వచ్చి. ముందు ఒంగోలు వెళ్ళి అమ్మమ్మను, తాతయ్యను చూసి ఇక్కడికొచ్చాను" చెప్పాడు సాయిబాబా.

సాయంత్రం స్కూలు నుంచి రాగానే మామయ్య సాయిబాబాతో ఇందిరాపార్క్, ట్యాంక్‌బండ్ వైపు వెళ్ళాడు వివేక్. దారిలో మామయ్యకు చదువులో తను ఎదుర్కొంటున్న

సమస్య గురించి చక్కగా వివరించాడు వివేక్.

“అది సరే! నువ్వు చదువుతున్నప్పుడు నీ మనస్సంతా పుస్తకంలోని విషయంపైనే ఉంటుందా? లేక నీ మనస్సు మళ్ళించే ఇతర విషయాల చర్చలు, దృశ్యాలు మనోనేత్రంలో కనిపిస్తుంటాయా?” అని అడిగాడు సాయిబాబా.

“అరే భలే కనుక్కున్నావ్? సరిగ్గా అదే అవుతుంది మామయ్యా. కళ్ళు పుస్తకంవైపు చూస్తుంటాయి. కానీ నా స్నేహితులతో స్కూల్లో జరిగిన చర్చలు, వాటికి సంబంధించిన దృశ్యాలు, హాస్య సంభాషణలు, సినిమా కబుర్లు ఇవన్నీ నా కళ్ళముందు లైవ్ టెలికాస్ట్‌లా కనిపిస్తుంటాయి.

“అదేరా సమస్య ప్రతి విద్యార్థికి. ఆఖరికి చిన్నప్పుడు నాకు కూడా ఇదే సమస్య... రోజు మొత్తం మీద జీవితంలో జరిగే ప్రతి చిన్న విషయం మన మనస్సుపై ఒక ముద్రలా పడుతుంది. అవి మనకు ఇష్టమైనవి అయినా, వ్యతిరేకమైనవైనా మనస్సు పదే పదే వాటి గురించి ఆలోచించేలా చేస్తూ... అందులో ఒకరకమైన సంతోషాన్ని పొందాలని ప్రయత్నిస్తుంది. కానీ ఇటువంటి ఇమాజినేషన్ మనిషికి చాలా ప్రమాదాన్ని కూడా తెచ్చి పెడుతుంది. అందువలన నీకొక చిట్కా చెబుతాను. రేపటినుంచి నువ్వు అది ఫాలో కా. నెలరోజుల్లోనే చదువుమీద నుంచి నీ మనస్సు ప్రక్కకు పోదు. అంటే నీ మనస్సులో నీ అంగీకారం లేకుండా మరో విషయం రాదు సరేనా...!” చెప్పాడు సాయిబాబా.

మేనమామ చెప్పిన చిట్కాను ఆ రాత్రినుంచే ఫాలో అయ్యాడు వివేక్. క్రమంగా రెండునెలలు అయ్యేసరికి వివేక్ తను ఇదివరకు కన్నా ఇప్పుడు తక్కువ టైములోనే పుస్తకాలు క్షుణ్ణంగా చదువుతున్నట్లు గ్రహించాడు. తన తెలివితేటలు, గ్రహణశక్తి బాగా పెరిగి, జ్ఞాపకశక్తి అదంతటదే ఏర్పడ్డట్టు తెలుసుకోగలిగాడు.

ఈలోగా మంత్లీ ఎసైన్‌మెంట్స్‌లోనూ, ఆఫ్ ఇయర్లీలోనూ వివేక్‌కు దాదాపు స్కూలు ఫస్ట్ మార్కులు వచ్చాయి. టీచర్లు, పిల్లలు, వివేక్ తల్లి కోటమ్మ, తండ్రి సుబ్బారావు – వారు వీరేమిటి అంతా ఆశ్చర్యపోయారు ఈ హఠాన్మార్పుకు.

తమ బిడ్డ ఇదివరకులా గంటల తరబడి పుస్తకాలముందు కునుకుపాట్లు



పడకపోగా, చాలా చురుకుగా, చలాకీగా ఉండటం గమనించిన కోటమ్మ, సుబ్బారావులు ఒకరోజు వివేక్‌ని అడిగారు – "అరేయ్ వివేక్... నువ్వు ఇదివరకన్నా చాలా మారిపోయావు. హఠాత్తుగా ఈ పెనుమార్పు రావటానికి కారణం ఏమిటి?"

"అదా మీ అనుమానం... మీరు ఏదో ఒకరోజు ఈ ప్రశ్న అడగాలనే నేను ఎదురు చూస్తున్నాను – మిగతా వారంతా అడగటం అయిపోయింది. కాని, వాళ్ళకెవ్వరికీ నేను ఏం చెప్పినా తమాషాగా తీసుకుంటారు. ఎగతాళి చేస్తారు అని ఏమీ చెప్పక మౌనం దాల్చాను. నాలోని మార్పుకు కారణం బామ్మ జపమాల. సాయిబాబా మామయ్య చెప్పిన చిట్కానే బామ్మ జపమాల. అదే చిన్నప్పుడు మామయ్యకు ఎంతో సాయం చేసిందట. కానీ, ఆనాటి మామయ్య ప్రతిభకు "జపమాలే" కారణం అని ఇటీవల తాను చదివిన ఒక బ్రిటిష్‌వారి పరిశోధనలతో మామయ్య తెలుసుకున్నాడట. నాకూ అదే చెప్పాడు" అంటూ జేబులోని బామ్మ జపమాల తీసి చూపాడు వివేక్.

సరిగ్గా అదే సమయానికి సాయిబాబా అక్కడికి వచ్చాడు.

"రేయ్! సాయిబాబా విన్నావా? నువ్వేదో జపమాల రహస్యం చెప్పావని, దానివల్లే నువ్వు ఎంతో గొప్ప సైంటిస్ట్ అయినావని, మా వివేక్ కూడా ఇటీవల నువ్వు చెప్పినట్లే బామ్మ జపమాలతో ఎన్నో మార్పులు తెచ్చుకున్నానని అంటున్నాడు... వాడి మాటలు కోతలా, నిజాలా నువ్వు చెప్పు?" అడిగింది కోటమ్మ అమాయకంగా.

"నిజమే అక్క! పిల్లల్లో పఠనాశక్తి లేకపోవటాన్ని వైద్యశాస్త్రంలో 'డైస్లెక్షియా' అంటారు. కొందరు త్వరగా చదివి అవగాహన చేసుకోగలిగితే – కొందరు రోజుల తరబడి చదివినా ఏమీ ఒంటబట్టదు వాళ్ళకి. దీనికి కారణం ఏమిటో ఇటీవల బ్రిటన్‌లోని షై ఫీల్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. దాని ప్రకారం బాగా చదివే పిల్లలను ఒంట్లు ఒకటి నుంచి పది దాకా లెక్కపెడుతూ, వెనక్కూ నడుస్తూ పైనుంచి క్రిందికి, ముందుకు నడుస్తూ క్రిందినుంచి పైకి చదవమన్నారు.

వాళ్ళు హాయిగా చదివేశారు. కాని, బాగా చదవలేని పిల్లలు మాత్రం ముందుకు, వెనక్కి నడుస్తూ – ఒంట్లు పది దాకా పైకి, క్రిందికీ చదవమంటే ఒక పని చేస్తే రెండవ పని ఏకకాలంలో చేయలేకపోయారు. కాబట్టి చెప్పిన రెండు చర్యలను కలిపి మెదడు ఏకకాలంలో చేయగలిగితే అదే పఠనాశక్తికి నిదర్శనం అని వారు తెలిపారు. మన

ఇళ్ళల్లో అనాదిగా జపమాలతో జపం చేయటం మనకు తెలుసు. ఒక మంత్రం పూర్తిగా చదివి, జపమాలలోని ఒక పూసను ముందుకు జరపాలి. ఇలా మంత్రం పూర్తయినప్పుడల్లా ఒక పూస జరుపుతూ ఖచ్చితంగా నూట ఎనిమిదిసార్లు చేయటం బ్రిటిష్‌వారి పరిశోధనల్లోలాగా ఒంట్లు పైకి, క్రిందికి లెక్కపెడుతూ ముందుకూ, వెనక్కూ పోవటంతో సమానం. చాలామంది మంత్రం పాటికి మంత్రం చదువుతూ, పూసల పాటికి పూసలు నెట్టేస్తారు. ఫలితంగా "జపమాల" అర్థమే తలక్రిందలవుతుంది దీన్నే మనం "ధారణ" అంటాం.

ఇప్పుడు మన వివేక్ బ్రిటిష్‌వారి పరిశోధనల్లో లాగా ఒంట్లు క్రిందికీ, పైకి లెక్కపెడుతూ ముందుకు, వెనక్కి నడిస్తే మనం కరెక్ట్ అన్నమాట! అంటూ వివేక్‌కు సైగచేశాడు.

అమ్మ, నాన్న, మామయ్య చూస్తుండగా వివేక్ చక్కగా చెప్పినపని తప్పులేకుండా చేసి చూపడంతో ఆశ్చర్యపోవటం కోటమ్మ, సుబ్బారావుల వంతు అయ్యింది.

- 15.12.1991 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - చిన్నారిలోకం)

❖ ❖ ❖

అహింస

“మాస్టారూ! వివేక్ నన్ను కొట్టాడండి...” ఏడ్చుకుంటూ పార్వతీశంగారికి ఫిర్యాదు చేశాడు రమేష్.

ఒక్కసారి వివేక్‌వైపు చూశారు పార్వతీశం మాస్టారు. వివేక్ కళ్ళు బెదిరి పోతున్నాయి. శరీరం కంపించిపోతోంది. వివేక్‌కు పార్వతీశం మాస్టారి పిచ్చి కోపం తెలుసు. ఇదివరలో రమేష్ వల్లనే వివేక్ మాస్టారుగారి చేతిలో దెబ్బలు తిన్న సందర్భాలు కోకొల్లలు.

క్షణాల్లో పార్వతీశంగారి కళ్ళు ఎర్రబడ్డాయి. ఆయన ముక్కుపుటా లెగరసాగాయి. తలెత్తి పాక చూరులోంచి పేనుబెత్తం తీశాడు. “లే... లే! రా...! రా! ఇటు” అంటూ గర్జించారు పార్వతీశంగారు. క్లాసంతా గుండుసూదిపడితే వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది. అందరికళ్ళూ బెంచీలోంచి లేచి నలుగుర్ని తప్పించుకుంటూ వస్తున్న వివేక్‌పైనే ఉన్నాయి. వివేక్ దగ్గరికొచ్చాడు.

“ఏరా! నీకు సిగ్గూ ఎగ్గూ లేదా? రోజూ ఎవరినో ఒకరిని కొట్టావని క్లాసుకు రాగానే నాకు కంప్లైంటా? ఎన్నిసార్లు కొట్టినా నీకు బుద్ధి రాదురా?” అన్నారు మస్టారు.

“నేను కొట్టలేదు సార్! రమేష్‌నే కాదు, ఎవరినీ కొట్టలేదు సార్!” కంపిస్తున్న వివేక్ పెదాలపైనుంచి మాటలు తునిగి తునిగి ముక్కలు బయటికి ప్రవహించాయి.

“ఛీ! అబద్ధమాడతావా?” అన్నాడు పార్వతీశంగారు.

“లేదు... మాస్టారూ! నిజం చెబుతున్నాను. ఒట్టు” అన్నాడు వివేక్ పెల్లుబుకుతున్న ఎక్కిళ్ళను బలవంతంగా ఆపుకుంటూ.

“రేయ్! రమేష్ వీడు నిన్ను కొట్టినప్పుడు సాక్ష్యం ఎవరన్నా ఉన్నారా? లేండి...” గట్టిగా అరిచారు పార్వతీశం.

రమేష్ పక్కనే ఉన్న శీను, బాలాజీలను – “లేండిరా... లేండి... చెప్పండి...” అని ముందుకు తోస్తున్నాడు వెనకనుంచి. వాళ్ళు “ఊహు” అంటూ తలలు అడ్డంగా తిప్పుతూ లేవటంలేదు – రమేష్ ఎంత బ్రతిమాలినా.

“ఏంట్రా రమేష్?” అడిగారు మాస్టారు.



"శీను, బాలాజీలున్నారండి..." అంటూ వాళ్ళను చూపి, వాళ్ళవైపు తిరిగి – "మీరిప్పుడు చెప్పకబోతే సాయంత్రం మీ సంగతి చూస్తాను" అని మెల్లిగా బెదిరించాడు రమేష్.

"లేండ్రా శీనూ! బాలాజీ!" అరిచారు పార్వతీశం మాస్టారు.

వాళ్ళిద్దరూ గబుక్కునలేచి నిల్చొని "వివేక్ కొట్టాడండి. నిజమేనండి" అని చటుక్కున కూర్చున్నారు.

"ఇప్పుడేమంటావు? పెద్ద సత్యసంధుడిలాగా ఒట్టు వేస్తున్నావు. నన్నే అటకాయిద్దామనుకున్నావురా?" అంటూ పేంబెత్తంతో వివేక్‌ను "రెయ్... రేయ్..." మని కొట్టసాగారు మాస్టారు.

మొదటి రెండు మూడు దెబ్బలకే "అమ్మో!" అని ఎలుగెత్తి అరిచిన వివేక్ తరువాత దెబ్బలకు అరవలేకపోయాడు.

మాస్టారు "నీకు బుద్ధి రాదురా. నిన్ను ఇలా కాదు" అంటూ వాడిని గోడకేసి, కుర్చీకేసి, కిందపడేసి కొట్టారు.

పిల్లలందరి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మాస్టారు అలసిపోయారు. వివేక్ తిన్నగా లేచి వెళ్ళి సీట్లో కూర్చున్నాడు. ఆ పూటకు మాస్టారు బిందెడు మంచినీళ్ళు తాగి కుర్చీలో సొమ్మసిల్లిపోవటం చూశాడు వివేక్. వివేక్‌నీ, మాస్టార్నీ చూసి అయోమయంలో పడ్డారు పిల్లలు.

బెల్ కొట్టారు మధ్యాహ్నం భోజనానికి. పిల్లలంతా బెదిరిన జింకల్లా లేచి బయటికి వస్తున్నారు. చివరగా లేచిన వివేక్ బయటికి వస్తూ మాస్టారి పక్కనుంచి వచ్చి – "మాస్టారూ! చాలా సారీ అండి. నన్ను కొట్టి మీరు అలిసిపోయారు. మీకంటే చిన్నపిల్లవాడిని మరి నేను తన్నులు తిన్నా మీలాగా అలసిపోలేదు. దేనికి? ఎప్పుడైనా ఈ ప్రశ్నకు సమాధానం తెలిస్తే చెప్పండి" అంటూ చకచగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

వివేక్ వేసిన ప్రశ్నకు మాస్టారి కళ్ళు బైర్లు కమ్మాయి. "వెధవ, తన్నులు తిని మరీ మొద్దుబారిపోయాడు" అని మాత్రం అనుకోకుండా ఉండలేకపోయారు.

వివేక్‌ను కొట్టి రెండు రోజులు కాకముందే సత్యాన్ని, ప్రకాశాన్ని, అనంత్‌లను వరుసపెట్టి బాలాజీ, శీను, ధర్మయ్య, బుచ్చిబాబు చేసిన ఫిర్యాదులపైన కొట్టటం, వాళ్ళు పార్వతీశం మాస్టారి దెబ్బలకు ఓర్చుకోలేక నేలపైన పొర్లటం జరిగిపోయింది. పార్వతీశం మాస్టారి క్లాసంటే పిల్లలకు భయం పట్టుకొంది. రమేష్, బాలాజీ, శీను, ధర్మయ్య లాంటి కొంటె కుర్రాళ్ళకు విజయగర్వం తలకెక్కసాగింది.

వారం పదిరోజులు గడిచేసరికి పిల్లలకు ప్రాణాలు కడబట్టాయి. ఇంతలో ఒకరోజు డీ.ఈ.ఓ.గారు రొటీన్ ఇన్స్పెక్షన్‌కు వస్తున్నారని పిల్లలకు చెప్పి, శుభ్రమైన బట్టలతో, అన్ని పుస్తకాలతో క్లాసుకు రోజూ రావాలని పార్వతీశం మాస్టారు హెచ్చరించారు.

మూలిగే నక్కపైన తాటికాయ పడ్డట్టయింది వాళ్ళకు. మాస్టారే ఇలా ఉంటే, డీ.ఈ.ఓ. ఎలా ఉంటారో – అని కంపించిపోయారు పిల్లలు. డీ.ఈ.ఓ. రానే వచ్చారు క్లాసుకు. పార్వతీశం మాస్టారుకు ఆయనముందు ఓ పాఠం చెప్పక తప్పలేదు. అది గాంధీకి దక్షిణాఫ్రికాలో జరిగిన అవమానం గురించి వివరించే ఓ సంఘటన.

"గాంధీని ఫస్టు క్లాసులో ప్రయాణిస్తున్నందుకు కోపించి ఆంగ్లేయులు ఆయన్ని బూటు కాలితో తన్ని రైలుపెట్టె బయటికి ఈడ్చారు. కాని, ఆయన వారిని తిరిగి కొట్టలేదు. వారిని దూషించలేదు. ఆయన్ని రైలు దింపాలని శతవిధాల ప్రయత్నించిన బ్రిటిష్‌వారు. చివరికి ఆయన నిగ్రహం, శాంతాల ముందు ఓడిపోక తప్పలేదు. పోలీసువారు వచ్చి ఆయన్ని అరెస్టు చేసి తీసుకువెళ్ళగా, జడ్జి "మీరు మా బ్రిటిష్‌వారిని తిరిగి ఎందుకు కొట్టలేదు?" అని అడిగారు గాంధీని.

"మాకు కావలసింది బ్రిటిష్‌వారితో సమానంగా రైల్లో ప్రయాణించే హక్కు. దీనికోసం బ్రిటిష్‌వారిని తిరిగి కొట్టటం సరైన పరిష్కారం కాదు. అందుకు పరిష్కారం అహింసే. అహింస ద్వారా బ్రిటిష్ వారినే కాదు, ఎవర్నైనా గెలవవచ్చు" అని చెప్పారు గాంధీ.

జడ్జిగారికి ఏమీ బోధపడకపోయినా, గాంధీగారి వినయానికి మెచ్చి ఆయన్ని విడుదల చేశారు" అని చదివారు పార్వతీశం మాస్టారు.

"అంటే... జడ్జీగారికి గాంధీ సమాధానం అర్థం కాలేదన్నమాట!" అడిగారు

డీ.ఈ.ఓ. పార్వతీశం మాస్టార్ని.

"అవును సార్! బ్రిటిష్‌వాళ్ళు కదా! వాళ్ళకేం అర్థమవుతుంది" అన్నారు పార్వతీశం మాస్టారు.

"పోనీ మీరు పిల్లలకు బోధపడేలా వివరించండి. పిల్లలకోసమే గదా ఈ పాఠం పెట్టారు. వారికి మీరు ఎలా వివరిస్తారో నేను వింటాను" అన్నారు డీ.ఈ.ఓ.గారు.

మాస్టారు పిల్లలవైపు తిరిగి "మనని ఎవరు కొట్టినా తిరిగి మనం వాళ్ళని కొట్టకూడదు. ఒక చెంపమీద కొడితే మరో చెంప చూపించాలి. ఇదే అహింసా సిద్ధాంతం" అని చెప్పి "అర్థమయిందా?" అని అడిగారు.

"ఓ..." అన్నారు పిల్లలు ప్రాణాలరచేత పుచ్చుకొని.

"భేష్, భలే చెప్పారు మాస్టారూ! మీకే సరిగ్గా బోధపడనిది పిల్లలకెలా బోధపడుతుంది? ఇలాగేనా అహింసా సిద్ధాంతాన్ని చెప్పేది? మానవత్వం, అహింస రెండూ ఒకే నాణానికి రెండు ముఖాలు. అలాంటి దాన్ని వివరించేందుకు మీకు చేతకాలేదా? పిల్లలూ! మీకు అర్థమయిందన్నారుగా. అర్థమయిన వాళ్ళు చేతులెత్తండి. చూస్తాను. మళ్ళీ అడిగితే చక్కగా చెప్పగలగాలి సుమా!" అన్నారు డీ.ఈ.ఓ.

ఒక్క వివేక్‌తప్ప ఎవరూ చేయి ఎత్తలేదు. వివేక్‌ని లేచి చెప్పమని సైగ చేశారు మాస్టారు, డీ.ఈ.ఓ.

"కోపం, ఆవేశం, దుర్మార్గంలాంటివి మనిషి స్వభావం కానే కావు. కేవలం ఆలోచన లేకపోవటంచేతనే మనిషి వీటికి క్షణాలలో లోనవుతాడు. ఫలితంగా తీవ్రమైన ప్రకంపనానికి గురై కొద్ది గంటల్లోనే అలిసిపోతాడు. ఉదాహరణకు ఎంతటి కోపిష్టి వాడైనా ఒక మనిషిని ఓ గంటకు మించి కొట్టలేడు. ఆ తరువాత నిస్సత్తువకు లోనవుతాడు. శాంతం మనిషికి అమితమైన బలాన్నిస్తుంది. ప్రయోగం, పరిశీలన ద్వారా వివేకంతో మానవుడు తెలుసుకున్న ఈ రహస్యమే సైన్సు. నిగ్రహం లేకపోవటమే హింస. నిగ్రహమే అహింస. అందుకే బ్రిటిష్‌వారు గాంధీ అహింసా ఆయుధం ముందు తలవంచుకొన్నారు" చెప్పాడు వివేక్.

వివేక్ వివరించింది విని క్లాసంతా పులకించిపోయింది. పిల్లల చప్పట్లతో క్లాసు మార్మోగింది.

పార్వతీశం మాస్టారికి ఆనాడు వివేక్ అడిగిన ప్రశ్నకు, ఈనాడు వివేక్ ముఖంగానే సమాధానం అందింది. ఇప్పుడు పిల్లల దృష్టిలో తనేమిటో ఆయనకు వివేక్ బోధపరిచాడు.

"మాస్టారూ! విన్నారా! అన్నీ మనకే అర్థమవుతాయి. పిల్లలకేం అర్థం కాదన్న భావం మాస్టార్ల అహానికి పెద్ద దెబ్బ సుమా! పిల్లల్లో కూడా సూక్ష్మగ్రాహులుంటారు. కాస్త నిగ్రహంతో పాఠం చెప్పండి" అంటూ లేచి, వివేక్ వంక అభినందనగా చూసి వెళ్ళిపోయారు డీ.ఈ.ఓ.

పార్వతీశం మాస్టారు తన దగ్గరకు వస్తుంటే భయపడ్డాడు వివేక్.

కాని "గుడ్ వివేక్! నీవల్ల ముందు ముందు మంచి జరగనుంది" అంటూ వివేక్‌ని ఆనందభాష్పాలతో, పశ్చాత్తాపంతో అభినందించారు పార్వతీశంగారు.

రమేష్ బృందం మరెప్పుడూ వివేక్‌లాంటి వాళ్ళ జోలికి పోలేదు.

- 02.11.1991 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - బాలప్రభ)

❖ ❖ ❖

సాధన

శ్రీపతి, విద్యాపతి ఇద్దరూ పదేళ్ళ ప్రాయంలోపు వాళ్ళు. ఒకే పాఠశాలలో ఒకే తరగతి చదువుతున్నారు. వాళ్ళిద్దరూ మంచిమిత్రులు కూడా వారితోపాటు ఆ తరగతిలో మరో యాభైమంది విద్యార్థులు కూడా ఉన్నారు. అయినా చదువు విషయంలో శ్రీపతి, విద్యాపతిల మధ్యనే ఎక్కువపోటీ ఉండేది. పంతులుగారు చెప్పే పాఠంలోని విషయాల్ని శ్రద్ధగా ఆలకించి, ముఖ్యమైన విషయాలను గుర్తుగా పుస్తకాల్లో రాసుకునే వాళ్ళు ఆ ఇద్దరూ. ఆ విషయంలో కూడా వాళ్ళిద్దరూ పోటీ పడుతున్నట్లనిపించేది. అయితే మాత్రమేం? పరీక్షల్లో మాత్రం ఎప్పుడూ శ్రీపతే అందరికన్నా ముందుండేవాడు. ఇదే విద్యాపతికి బాధ కలిగించేది.

శ్రీపతే ఎందుకు ప్రథమస్థానంలో ఉంటున్నాడో అతనికి బోధపడలేదు. అనేకసార్లు తను రాసిన సమాధాన పత్రాలను, శ్రీపతి సమాధాన పత్రాలతో పోల్చి చూసుకున్నాడు. తనకన్నా శ్రీపతి ఎన్నో విషయాలను సమాధాన పత్రాలలో పొందికగా రాస్తున్నట్లు విద్యాపతికి స్పష్టమైంది. ఆ విషయాలన్నీ తనకు తెలిసినవైనా, ప్రతిసారీ తను ఏవో కొన్నింటిని వదిలివేయటం, శ్రీపతిలా పొందికగా రాయలేకపోవటం జరుగుతూనే ఉంది. అంతేగాక, శ్రీపతి రాసే విధానం కూడా చిన్న చిన్న వాక్యాలలో స్పష్టంగా ఉండి, తన రాతలా గజిబిజిగా లేకపోవటం గమనించాడు విద్యాపతి. నిజానికి శ్రీపతిలాగానే తనూ రాయాలని సంవత్సరం నుంచి ఎంతో తాపత్రయపడ్డాడు. కానీ, ఫలితం కనిపించలేదు. అతనికి ఇదో చిన్న బెంగగా మారింది కూడా.

ఒకసారి శ్రీపతినే అడిగి చూద్దామని అనుకుని 'ఒరే శ్రీపతి! నేనొక విషయం అడుగుతా చెబుతావా? నువ్వేమడిగినా ఇస్తారా" అన్నాడు విద్యాపతి ప్రేమగా.

"ఏమిట్రా అది? నాకు తెలిస్తే నే తప్పక చెబుతా" అన్నాడు శ్రీపతి.

"ఏం లేదు! ప్రతిసారీ పరీక్షల్లో నువ్వు రాసే సమాధానాలు చూస్తాను గదా! నువ్వు ఎన్నో విషయాలను, పొందికగా పూసగుచ్చినట్లు వివరంగా రాస్తావు. అవన్నీ నాకూ తెలిసినా, నేను నువ్వు రాసినంత చక్కగా రాయలేను. నువ్వు అలా రాయటానికి కారణం ఏమిటి?" అడిగాడు విద్యాపతి.

"అబ్బ! చాలా పెద్ద ప్రశ్నే వేశావురా? నువ్వు చెబుతుంటే నేను అలా రాస్తున్నానని నే అనుకోవాల్సిందే తప్ప నాకింకేమీ తెలియదు. నిజానికి నేను కూడా నీలాగే నువ్వు చదివే విషయాలే చదువుతాను. అవే రాస్తాను. అందులో గొప్ప కూడా ఏమీ లేదు. మరి నీకు అలా ఎందుకు అనిపిస్తోందో" అన్నాడు శ్రీపతి.

"నేనేమీ నిన్ను పొగడటం లేదు. పరీక్షల్లో ప్రతిసారీ ప్రథమస్థానం వస్తున్నది నీకేగా! అందుకు తగ్గట్లు నువ్వు రాస్తున్నావు కాబట్టి అడిగాను. నీకు చెప్పటం ఇష్టంలేకపోతే పోన్లే!" అని ముఖం అదోలా పెట్టుకొని వెళ్ళిపోయాడు విద్యాపతి.

విద్యాపతి అలా ఎందుకు బాధపడుతూ వెళ్ళాడో శ్రీపతికి కొంచెం కూడా అర్థం కాలేదు. నిస్సహాయంగా భుజాలెగరేసి ఇంటికి వెళ్ళిపోయాడు.

విద్యాపతి ఏదో బెంగపడుతున్నట్లు వాళ్ళమ్మ గోవిందాలు ఒకటి రెండు రోజుల్లోనే గ్రహించింది. విద్యాపతి ఆలోచించే సమస్య ఏమిటో కనుక్కుంది. విద్యాపతి ఆలోచనాసరళి ఆవిడకెంతో నచ్చింది. అసలు ఆ వయసు బాలుడి పురోగమనానికి ఉండవలసిన మొదటి లక్షణమే తన కొడుకులో ఉండటం గమనించి గోవిందమ్మ లోలోన ఎంతో సంతోషించింది.

ఒక్క క్షణం ఆలోచించి "నువ్వేం బెంగపడకు. మీ బాబాయి వివేకానంద గొప్ప మేధావి. ఆయనకు అనేక శాస్త్రాలు క్షుణ్ణంగా తెలుసు. ప్రస్తుతం రాజధాని నగరంలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. ఆయన్ని పిలిపిస్తాను. ఆయన నీ సమస్యకు పరిష్కారం చెబుతారేమో చూద్దాం" అని ఊరడించింది గోవిందాలు.

తల్లి తన సమస్యని ఎగతాళిగా కొట్టిపారేయకుండా సరిగ్గా అర్థం చేసుకొని సహాయం చేయటానికి అంగీకరించినందుకు అమ్మని వాత్సల్యపూరితమైన కళ్ళతో చూస్తూ, "మా అమ్మ! బంగారమ్మ!" అంటూ తేలికపడ్డ హృదయంతో ఆటలకెళ్ళాడు విద్యాపతి.

తుర్రుమని పరిగెడుతున్న కొడుకుని చూసి – "పిచ్చి నాగన్న! చదువంటే ఎంత ప్రాణమో!" అనుకుని, ఆ రోజే వాళ్ళ బాబాయికి విషయం వివరిస్తూ ఉత్తరం రాసింది విద్యాపతి అమ్మ.

వారంలోపునే వివేకానంద దగ్గరనుంచి జవాబు వచ్చింది. విద్యాపతిని తన

దగ్గరకు నెలరోజులు ఉండటానికి పంపమని రాశాడు విద్యాపతి బాబాయి వివేకానంద.

పాఠశాలకు సంక్రాంతి సెలవులు రాగానే, ఆఘమేఘాలమీద బాబాయి దగ్గరికి వెళ్ళాడు విద్యాపతి.

బాబాయి దగ్గర నెలరోజులనుండి తిరిగి వచ్చిన కొడుకు ముఖంలో ఇదివరకటి కంటే తేజస్సు, వెలుగు, ప్రశాంతత, ఆనందం స్పష్టంగా గుర్తించింది గోవిందాలు. అయితే నీళ్ళ మార్పిడికి బిడ్డలో ఇటువంటి మార్పు వచ్చి ఉండవచ్చు ననుకొంది గోవిందాలు. మొత్తానికి పిల్లవాడిలో బెంగపోయి నూతనోత్సాహం రావటం ఆవిడని ఎంతో సంతృప్తిపరిచింది.

ఇదివరకులా విద్యాపతి ఇప్పుడు గంటల తరబడి రంకెలు వేస్తూ చదవటం లేదు. మౌనంగా చదువుతూ, రోజంతా ఎక్కువసేపు మౌనంగా, అలజడి చేయకుండా ఉంటున్నాడు. చదువు విషయంలో పిల్లవాడి ప్రవర్తన గోవిందాలుకు ఆశ్చర్యం కలిగించినా, ఇంటిపనుల గొడవలో ఆ విషయమే పట్టించుకోలేదు. విద్యాపతి వాళ్ళ నాన్నకైతే అసలే తీరదు.

విద్యాపతి మునుపటిలాగే స్కూలుకు చక్కగా వెళ్ళి వచ్చి పరిమిత సమయంలో పుస్తకాలలో కాలం వెళ్ళబుచ్చసాగాడు. అయితే అనతికాలంలోనే ఎవరూ ఊహించని మలుపు ఒకటి జరిగింది. ఆ ఏడాది వార్షిక పరీక్షల్లో విద్యాపతి పాఠశాల ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యాడు. అందూర శ్రీపతే పాఠశాల ప్రథముడుగా వస్తాడని భావిస్తున్న తరుణంలో విద్యాపతి ప్రథముడిగా రావటం మిగతా పిల్లలకు, ఉపాధ్యాయులకు ఆశ్చర్యం కలిగించింది. శ్రీపతి ముఖం చిన్నబోయింది.

ఆనాటి సాయంత్రం విద్యాపతి మిఠాయిలు తీసుకుని, అమ్మా, నాన్న వెంటరాగా శ్రీపతి వాళ్ళింటికి వెళ్ళారు.

"ఏమోయ్! భలే కొట్టేశావు ప్రథమస్థానం. శుభం! ఇలాగే ఎప్పుడూ చదవాలి సుమా!" అంటూ శ్రీపతి వాళ్ళ నాన్న విద్యాపతిని దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా తల నిమిరారు.

శ్రీపతి కూడా మిఠాయి అందుకుని, విద్యాపతితో, "అవునూ! నేనో విషయం

అడుగుతా చెబుతావా? మొన్నటిదాకా ఎప్పుడూ నాకంటే వెనుకబడి ఉండేవాడివి. ఇప్పుడు ఇంత హఠాత్తుగా ఎలా ముందుకు వెళ్ళగలిగావు?" అడిగాడు శ్రీపతి.

"ఇదంతా మా బాబాయి శిక్షణవలన సాధ్యమైంది. ఇటీవల నెలపాటు ఆయన దగ్గరకి వెళ్ళాను. రోజూ ఉదయం అయిదుగంటల నుంచి ఒక గంటపాటు ఆయనా, నేను మౌనంగా మాకు ఇష్టమైన ఒక విషయంపై దృష్టిని ఏకాగ్రతతో నిలిపి, వేరే ఆలోచనలేవీ మనస్సులోకి రాకుండా సాధన చేసేవాళ్ళం. ముందు ముందు రెండు మూడు నిమిషాలకల్లా వేరే ఆలోచనలు వచ్చేవి. కాని, మనం గట్టిగా ప్రయత్నిస్తే ఆలోచనలేవీ రాకుండా ఆగిపోతాయి. అప్పుడు మనసు చాలా హాయిగా ఉంటుంది. అలా గంటసేపు గడిపాక, చదువులో కూడా శిక్షణ ఇచ్చేవాడు. మొదలు మొదలు గంటలో రాయగలిగే పాఠాన్ని, చదవగలిగే పాఠాన్ని యాభై నిమిషాల్లోనే రాసి, ఒప్పచెప్పేటట్లు సాధన చేయించాడు నాతో మా బాబాయి. తర్వాత, తర్వాత దాన్నే నలభై నిమిషాల్లో, అరగంటలో చదివి రాసేట్లు శిక్షణ ఇచ్చాడు. అందువల్ల ఏకాగ్రత మరింత పదునవుతుంది. అప్పుడు చదివింది మరచిపోకుండా పొందికగా, త్వరగా, చక్కగా ఒకదాని తర్వాత మరోటి గుదిగుచ్చినట్లు రాయగలుగుతాం. చిన్నపిల్లల స్థాయినుంచి ఏకాగ్రత అలవడితే మంచిదని మా బాబాయి చిన్నపిల్లల కోసం ఒక శిక్షణా సంస్థను నడుపుతున్నాడు కూడా" అని చెప్పాడు విద్యాపతి.

విద్యాపతి చెప్పింది విని నోరు వెళ్ళబెట్టాడు శ్రీపతి.

"విన్నవురా శ్రీపతీ! నీకు కూడా అక్కడే నెలరోజులపాటు శిక్షణ ఇప్పించాం! కానీ, ఏం లాభం! మళ్ళీ నువ్వు సాధన మానేసేప్పటికి విద్యాపతి ముందుకు వెళ్ళిపోయాడు. ఏదైనా సాధన లేకపోతే మరుగైపోతుంది. మంచిపని చేశావోయ్ విద్యాపతి! నీవల్ల మా అబ్బాయికి మరోసారి ఆ శిక్షణ గొప్పతనం అర్థమయింది" అన్నాడు శ్రీపతి వాళ్ళ నాన్న విద్యాపతి భుజం తడుతూ.

- 28.11.1990 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధసంచిక - బాలప్రభ)

❖ ❖ ❖

బాధలో మర్మం

పూర్వం కోశలదేశాన్ని గణపవర్మ అనే రాజు పాలించేవాడు. గణపవర్మ నిజాయితీకి, ధర్మానికి పెట్టిన పేరు. ఆయన రాజ్యంలో ప్రజలు సుఖశాంతులతో ఉండేవారు. సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా ఉండేది. అయితే రాజు గారికి ఒకే ఒక దిగులు ఉండేది. ఆయన ఏకైక పుత్రుడు సగంవర్మ చదవు, సంధ్య లేకుండా అల్లరి చిల్లరగా తయారయ్యాడు. ఇప్పటికే వాడికి ఆరేళ్లు వచ్చాయి. తల్లి వసుధరాణి వాడికి ప్రేమతో ఎన్నో పద్యాలు, పాటలు నేర్పాలని చూసింది. కాని, వాడువింటేగా! వాడు అలా అల్లరిచిల్లరి వాడుగా మారటం రాజప్రాసాదంలో ఉండే వారందరికీ క్రమంగా తెలియసాగింది. ఈ విషయం అలా బయటికి ప్రాకితే తాము, తమ రాజ్యం ఇరుగు పొరుగు రాజుల ద్రుష్టిలో చాలా చులకనయిపోతామని ఆందోళన వాళ్లలో కలగసాగింది.

తమ ఆస్థాన గురువులను సంప్రదించి వాడ్ని రాజ్యానికి దూరంగా ఉండే మహర్షుల దగ్గర విద్యాభ్యాసం చేయటానికీ కుదుర్చాడు రాజు. అయితేనేమి? సగంవర్మకు అలా రుషుల వద్ద విద్య నేర్వటం సుతాము ఇష్టంలేదు. పైగా బలవంతంగా విద్య నేర్చుకోమని తన తండ్రి తనను నగరం నుంచి దూరంగా అడవుల్లో రుషుల వద్ద ఉంచటం వాడిలోని అల్లరిచిల్లర మనస్తత్వాన్ని క్రౌర్యానికి ఉసిగొల్పింది.

అలా సగంవర్మ రుషుల దగ్గరకు వచ్చిన కొద్ది రోజుల్లోనే అందరిపట్ల అమర్యాదగా ప్రవర్తించటం మొదలు పెట్టాడు. ఆశ్రమంలోని గోవులకు వేసిన చొప్పను అవి తినకుండా లాగేసేవాడు. అవి ఆకలితో 'అంబా' అని అరిస్తే సగంవర్మ పకపక నవ్వేవాడు. మేకలను, ఇతర ఆశ్రమ జీవులను హింసించటం ప్రారభించాడు. అవి రొదపెడితే ఆనందంగా ముఖం పెట్టేవాడు. రుషి కన్యల, రుషిపత్నుల దుస్తులను నది ఒడ్డున స్నానం చేస్తుంటే, నీళ్లలోకి తోసేసే వాడు. ఇలా వాడి ఆగడాలు ఇన్నీ, అన్నీకావు. ఏమైనా మందలిద్దామంటే రాజు గారి పుత్రుడు. కాబోయే రాజు. కొడుకును చూసేందుకు అప్పుడప్పుడూ రాణీ వసుంధరాదేవి వచ్చినా ఆవిడకు కూడ సగంవర్మ అల్లరిని తెలియపర్చలేదు. అలా వాడి అల్లరి చేష్టలకు బాధపడని వ్యక్తి లేడు. అయితే, వీళ్ళు చెప్పక పోయినా వేగుల ద్వారా గణపవర్మ ఎప్పటికప్పుడు తన కొడుకు చేస్తున్న దుష్టచేష్టల

విషయాలు తెలుసుకొంటూనే ఉన్నాడు. చివరికి లాభం లేదనుకొని భటులను పంపి తన కుమారుడిని వెనక్కు తెచ్చాడు మహారాజు. కాకపోతే, తన కొడుకు భవిష్యత్తు పైబెంగ ఆయన్ని క్రుంగ దీయసాగింది.

అది గమనించిన మహామంత్రి తనే రంగంలోకి దిగాడు. ఆయన రంగంలోకి దిగిన కొద్ది రోజులకే సగంవర్మకు పెద్ద పెట్టున జబ్బు చేసింది. లక్షణంగా ఉండే కుర్రాడు బాధతో ఒకటే మూలుగు, అరుపులు, పెడబొబ్బలు పెట్టడం మొదలు పెట్టాడు. రాజు ఎంతో మంది రాజవైద్యులను పిలిపించి చూపించాడు. కాని, ఫలితం శూన్యం. అలా పిల్లవాడి అనారోగ్యంతో క్రుంగిపోతున్న మహారాజును చేరి ఇలా అన్నాడు మహామంత్రి. ‘మహారాజా, మీ బాలుడి అల్లరిచిల్లరి తప్పుడు ప్రవర్తనకు నిన్నటిదాకా క్రుంగి పోతిరి. ఇప్పుడు వాడి జబ్బుకు క్రుంగి పోతున్నారు. మీకేమి అనుకోనంటే నాతో చిన్న సలహా. చెప్పమన్నారా?’ అనిఅడిగాడు. చెప్పమన్నట్టుగా తలూపాడు మహారాజు.

‘మీరు బాబును నాకు అప్ప జెప్పండి. వారం రోజుల్లో మీ బాబును బంగారంలా మార్చి మీకు అప్ప జెబుతాను’ అన్నాడు మహామంత్రి. సంతోషంగా అంగీకరించాడు మహరాజు. వెంటనే సగంవర్మను మహామంత్రి నివాసానికి మార్చారు రాజభటులు.

మహామంత్రి చెప్పినట్టే వారంకల్లా సగంవర్మ జబ్బు నయమై ఆరోగ్యంగా రాజు ముందుకు వచ్చాడు. జబ్బే కాదు, మునపటి దుర్మార్గం కూడ మటుమాయమైనట్టు రాజుతో సహాసభికులు, అంత:పురవాసులు గ్రహించారు. అయితే అది ఎలా సాధ్యమైందో రాజుతో సహా ఎవ్వరికీ అంతుబట్టలేదు.

ఒకనాడు ఉండబట్టలేక రాజు, రాణీ ఇద్దరూ తమ సమావేశ మందిరానికి మహామంత్రిని పిలిపించి తమబిడ్డ ఆరోగ్యం, వాడితిక్కా రెండూ వారం రోజుల్లో ఎలా నయం చేయగలిగారో ఆ రహస్యం విప్పమని అడిగారు.

అందుకు మహామంత్రి ఏలినవారు క్షమిస్తానంటే తమకు జరిగినది వివరిస్తాను క్లుప్తంగా. నానాటికీ మితిమీరిపోతున్న సగంవర్మ ప్రవర్తన రేపు అతను రాజ్యాధిపత్యంకు వస్తే ఏ విపరీత పరిణామాలకు దారితీస్తుందోనన్న భయం ప్రజల్లోకి ప్రబలంగా వెళ్తున్న విషయం మనందరం ఎరిగినదే. దీనికి అడ్డుకట్ట వేయడానికి అతనికి ప్రాణహానిలేని, విపరీతమైన బాధ కలిగించే మందును ఆహారంలో కలిపి పెట్టించాను.

ఫలితంగా అతనికి భరించలేని శరీర బాధ కలిగి విలవిలలాడసాగాడు. నేను ఇచ్చిన మందు ప్రభావం పదిరోజుల కంటే ఎక్కువ కాలం ఉండదు. అందువల్ల, వారం కాగానే మేలైన చికిత్స నా ఇంటివద్ద ఇప్పిస్తానని చెప్పి మీ అనుమతితో అతనిని మా ఇంటికి మార్చాను. అలా మా ఇంటికి మారాక అతని జబ్బుకు విరుగుడు మందు ఇచ్చాను. అది పనిచేయటం ప్రారంభం అయిన తరువాత అతను విలవిలలాడటం తగ్గింది. అదే అదనుగా అతనికి 'బాధ అంటే ఏమిటో అర్థమైందా ?' అని అడిగాను. 'ఇక ఎవరినీ బాధించే ఏ పనిచేయనని, ప్రజలను సమద్రుష్టితో చూస్తాను' అని హామీ కూడ ఇచ్చాడు. వెంటనే పూర్తి విరుగుడు ఇచ్చి సంపూర్ణ స్వస్థతత కలిగించాను. అతను ఇలా మారాక తను బాధించిన తన గురువు గారికి, మిత్రులకు అందరికి క్షమాపణలు గూడ చెప్పాడు వారిని స్వయంగా కలిసి. ఇందుకు వాడిన మందులు ఏవీ హానికరం కావు మహారాజ. అవన్నీ మా తండ్రిగారు తమ వద్ద ఆయుర్వేద భిషక్గా ఉన్నప్పుడు వాడినవే. అది విని రాజు, రాణి ఎంతో సంతుష్టి చెంది మహామంత్రికి కానుకలు కూడ ఇచ్చారు.

సరిగ్గా అదే సమయానికి అటుగా వచ్చిన కుమారుడు సగంవర్మ ను చూసి దంపతులు ఇద్దరూ అతనిని తమ వద్దకు ఆహ్వానించారు. మహామంత్రి సమక్షంలోనే 'కుమారా, మంత్రి గారి వద్ద నీకు ఏమి బోధపడింది?' అని అడిగారు . 'మనకు బాధ కలిగితే ఎంత దుఃఖం కలుగుతుందో, మనం వేరే వారిని బాధిస్తే వారికి అంతే బాధ కలుగుతుంది అని గ్రహించాను తల్లీ!' 'మరి ఇప్పుడు ఆనందంగా ఉన్నావా? ఇది వరకు ఆనందంగా ఉన్నావా?' అడిగాడు మహారాజు సగంవర్మను. 'తండ్రి గతంలో ఆనందం మానసిక అలజడి లోనించి వచ్చేది. కాని, ప్రస్తుతం నేను పొందే ఆనందం మానసిక ప్రశాంతత నుంచి వస్తున్నదని తెలిసింది తండ్రీ' బదులు ఇచ్చాడు సగం వర్మ.

తమ కుమారుడి సమాధానాలు విని రాజు, రాణి ఎంతో ఆనందించారు . తమ పుత్రుడిలో మార్పు శాశ్వత మార్పే గాని తాత్కాలిక మార్పు కాదని సంతృప్తి చెందారు.

(నవంబర్ 5, 2023 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో 'మార్పు' అనే పేరుతో అచ్చయింది)

❖ ❖ ❖

విద్య వేణువైన వేళ

తెనాలిలో ఉండే రామయ్య, సీతమ్మ దంపతులకు ఒక్కగానొక్క కొడుకు జగదీష్. రామయ్యది పెద్దగా ఆదాయం ఉన్న వ్యాపారం కాదు. చిన్నపాటి బంగారునగలు చేసేపని. ఒక కుంపటి, కొన్ని పనిముట్లు, కాస్తంత ఆమ్లంతో బంగారం శుద్ధిచేసి ఉంగరాలు, కమ్మలు, మొలతాడు వంటివి చేస్తాడు. ఆ పని మీద వచ్చే ఆదాయంతో కాలం నెడుతున్నాడు. తమ ఒక్కగానొక్క కొడుకు జగదీష్‌ను బాగా చదివించి పెద్ద ఉద్యోగంలో చూడాలని ఆశ ఆ దంపతులది. తానొకటి తలిస్తే విధి మరొకటి తలచినట్టు, జగదీష్‌కు ఎందుకో చదువు పట్ల ఆసక్తి లేదు. ఏడవ తరగతికి వచ్చాడని పేరేకాని టీచర్లు చెప్పేది ఆ అబ్బాయి తలకెక్కటం లేదు. ఆ అబ్బాయికి అటువంటి చదువుపై ఆశక్తి లేదు. వయస్సులో చిన్నవాడవటం మూలాన ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పే ధైర్యమూ లేదు.

మొదటినెల యూనిట్ పరీక్షలలో అన్నింటిలో అత్తెసరు మార్కులువచ్చాయి. దీన్ని పెద్ద బలహీనంగా భావించిన తల్లదండ్రులిద్దరూ అడపాదడపా వాణ్ణి నిష్టూరమాడుతునే ఉన్నారు. అయినా నోరెత్తలేని పరిస్థితి జగదీష్‌ది. ఈ కారణంగా అతనిలో పరధ్యాస ఏర్పడింది. చదువు గురించి కాక, దాని నుంచి విముక్తి ఎలానా అని ఆలోచించటం అధికమైంది. ఒకసారి ఇంటి నుంచి పారిపోదామాని కూడ ఆలోచించాడు. కాని, తను చదువుకోక పోగా పారిపోతే వాళ్లింకా దు:ఖ పడతారని ఆలోచించి ఆ ఆలోచనను విరమించాడు.

ఇది ఇలా ఉండగా ఒకనాడు జగదీష్ మామయ్య వేంకటేశ్వరులు వాళ్ల ఇంటికి వచ్చాడు. ఆయన జగదీష్ తల్లి సీతమ్మ సొంత తమ్ముడు. మాటల సందర్భంలో 'ఏరా జగదీష్? ఎంత వరకూ వచ్చింది నీ చదువు? బాగాచదువుతున్నావా? మంచి మార్కులు వస్తున్నాయ్యా?' అనిఅడిగాడు. ఇంతలో జగదీష్ తల్లి కలగజేసుకొని, 'ఇకవాడి చదువు సంగతే అడిగావు? అధ్వాన్నం, చతుర్మధ్యంగా ఉంది. చదువు మీద వాడికేమి ఆసక్తి ఉన్నట్లు కనిపించటంలేదన్నయ్యా. ఎప్పుడూ ఏదో పరధ్యాసలో ఉన్నట్టు ఉంటాడు. మనకా తాతల , తండ్రుల ఆస్తులేవీ లేవు. వీడు కాస్త గట్టిగా చదివితే ఏ సాఫ్ట్వేర్ ఉద్యోగమన్నా రాకపోతుందా? మా కష్టాలు గట్టెక్కక పోతాయాని చిన్న ఆశ. వాడికి

మా మనస్సు ఎప్పటికి అర్థం అవుతుందో, ఏమిటో? నువ్వన్నా నాలుగు మంచి మాటలు చెప్పన్నయ్యా? నీమాటైనా తలకెక్కుతుందేమో' అని అంది సీతమ్మ. వెంకటేశ్వర్లు జగదీష్ వైపు తిరిగి 'ఏంటిరా? అమ్మ ఇలా అంటోంది' అని అడిగాడు సమాధానం కోసం ఎదురుచూస్తూ. జగదీష్ ఏమి మాట్లాడలేదు. అక్కడ వాళ్ల ముందు తన చదువుపై చర్చ పెట్టడం ఇష్టం లేనట్టు జగదీష్ ముఖం పెట్టటం గమనించాడు వేంకటేశ్వర్లు.

'సరే అక్కా! వాడు చిన్నవాడు. ఇప్పుడు నేను వాడిని ఏమన్నా వాడి నుంచి సమాధానం రాదు. నాతో ఒక వారం పంపించు. నా దగ్గర ఉంచి, క్రమం తప్పకుండా సలహా ఇస్తే పరిస్థితిలో ఏదైన మార్పు రావచ్చు' చెప్పాడు వెంకటేశ్వర్లు. తరువాత కొద్దిరోజులకే జగదీష్ తన మామయ్య ఇంటికి వెళ్లాడు.

వారం రోజుల తరువాత ఒకనాడు వెంకటేశ్వర్లు తన సోదరి సీతమ్మ ఇంటికి వచ్చాడు. సీతమ్మ సోదరుడికి సకల మర్యాదలు చేసి తన కొడుకు జగదీష్ గురించి ఏమన్నా బోధ పడిందాని అడిగింది. 'వాడు చాలా లోతైన వాడు సీతమ్మ. నీలాగా, బావలాగా గబుక్కున బయటపడదు. నువ్వేమనుకోకపోతే నాదో ఉచిత సలహా. ఇక్కడుంటే మీకు వాడినర్థం చేసుకొనే తీరిక లేక వాడి గురించి విసుక్కుంటూ, నిష్ఠురాలాడుకొంటూ గొడవపడుతూ ఉంటారు. వాడిని నాకు వదిలేయి. వాడి చదువు, భవిష్యత్తు పూచి నాది. వాడిని ప్రయోజకుడిని చేసే బాధ్యత నాది. ఏమంటావు?' అని అడిగాడు.

సీతమ్మ , రామయ్యలు ఒకరి మొఖం ఒకరు చూసుకొని 'సరే, మేము వాడి ఖర్చు నిమిత్తం, చదువు నిమిత్తం నెలకు ఎంతో కొంత పంపుతాము. నువ్వే వాడి ఆలనా, పాలనా అన్నీను' అన్నారు ముక్తకంఠంతో. 'శుభం. ఇక మీరు నిర్భయంగా ఉండండి', అని వాడి బట్టలు, పుస్తకాలు తీసుకోని తన ఊరు ప్రయాణమైనాడు వెంకటేశ్వర్లు.

కాలం గిర్రున తిరిగింది . అప్పుడప్పుడు జగదీష్ స్వస్థలం తెనాలి వచ్చి అమ్మ, నాన్నలను చూసి, నాలుగు రోజులుండి వెళ్తుండేవాడు. వాడు ఏమి చదువుతున్నది, ఎలా చదువుతున్నది వాళ్ళూ అడిగే వారు కాదు. జగదీష్ చెప్పేవాడూ కాదు. ఒకరోజు ఒక ప్రముఖ టెలివిజన్‌లో త్వరలో రాబోయే సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ జరుగుతున్నది. హఠాత్తుగా 'జగదీష్' పేరు పిలిచినట్టు తల్లిదండ్రులకిద్దరికి వినిపించి ఒకరిమొఖాలు

ఆశ్చర్యంగా చూసుకొన్నారు. టెలివిజన్ తెర పైన కనిపిస్తోంది ఎవరో కాదు, తమ ఏకైక పుత్రుడు జగదీశే. వాళ్లిద్దరికీ ఒళ్ళు గగుర్పొడిచింది. ఒకరినొక్కరు గట్టిగా పట్టుకొని ఊపిరి బిగపట్టుకొని చూస్తున్నారు.

ఇటీవల ఎంతో పేరు గడించిన ఒక ప్రముఖ సంగీత దర్శకుడు జగదీషును పరిచయం చేస్తున్నాడు. 'అత్యంత చిన్న వయసులో సంగీతంలోని అన్ని ఇన్స్ట్రుమెంట్స్ వాడటంలో ఎంతో నైపుణ్యం ప్రదర్శించిన 'జగదీష్' ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నాడు. ఇతను పెద్దగా చదువుకోక పోయినా తన నూతన బాణీలను సాఫ్ట్వేర్ లో చేసి ట్రాక్స్ మీద ఎక్కించగలడు. ఇతనికి అది జన్మతో వచ్చిన విద్యనిపించింది. ఎన్నెన్నో కొత్త కొత్త బాణీలను అలవోకగా కట్టి , గాయకులతో ట్రాక్స్ మీద పాడించి, సాఫ్ట్వేర్ గా మార్చి సంగీత కంపెనీలకు అందిస్తున్న ఇతని సామర్థ్యం స్వయంగా చూసి నేను నిర్మాతలతో మాట్లాడి అతనికి ఈ అవకాశం కలిపించాను. ఇప్పుడు ఈ సినిమాకు ఆయన చేసిన పాటలను రెండు ఆయనే విడుదల చేస్తాడు. ఈ కొత్త యువదర్శకుడికి మీరు తగిన ప్రోత్సాహం అందిస్తారని ఆశిస్తున్నా. నౌ జగదీష్, స్టేజ్ ఈజ్ యువర్స్' అంటూ జగదీష్కు షేక్ హ్యాండ్ ఇచ్చి పక్కకు తప్పుకున్నాడు ఆ ప్రముఖ డైరెక్టర్.

ఇతర విషయాలలోకి పోకుండా, క్షణం ఆలస్యం చేయకుండా రెండు పాటలను విడుదల చేశాడు జగదీష్. ఆడిటోరియంలో కరతళధ్వానాలు మిన్నంటాయి. జగదీష్ కళ్ళల్లో రెండు ఆనంద భాష్పాలు కనుకొనల్లోంచి రాలాయి. అదే పరిస్థితి జగదీష్ తల్లిదండ్రులది. తరువాత వారానికి జగదీష్ స్వస్థలమైన తెనాలి వచ్చాడు ఎవ్వరికీ చెప్పకుండా మామయ్య వెంకటేశ్వర్లతో.

ఒక్కసారిగా బిడ్డ ఎదిగిన స్థాయి నూహించుకొని ఉక్కిరిబిక్కిరి అయింది సీతమ్మ. అయితే, 'ఇదెలా సాధ్యం?' అన్న విషయం మాత్రం రామయ్య, సీతమ్మలకు బోధపడలేదు.

వాళ్ళ ముఖాల్లో గిరికీలు కొడుతున్న సందేహం అర్థం చేసుకొని జగదీష్ 'ఇదెలా జరిగిందని కదా మీ సందేహం ? ఇదంతా మామయ్యా చలువ. నాకు చదువు మీద కన్నా సంగీతం మీద, వాయిద్యాలపైన ఎక్కువ ఆసక్తి ఉన్న సంగతి గ్రహించిన మామయ్య నన్ను చదువు మానిపించి హైద్రాబాద్లోని ప్రముఖ సంగీత

డైరెక్టర్ల దగ్గర పనికి కుదిర్చాడు. వాళ్ళు జీతం ఏమీ ఇవ్వకపోయినా, మామయ్యే నా ఖర్చు భరించేవాడు. ఈ కారణంగా నాలో కసిపెరిగి అన్ని వాయిద్యాలు, సంగీతం నేను వేగంగా నేర్చుకున్నాను. అప్పుడప్పుడు సొంతగా బాణీలు కట్టడం నేర్చుకొన్న నా నైపుణ్యం చూసి ఆ డైరెక్టర్ నా చేత ప్రైవేట్ ఆల్బంలు చేయించి సంగీత కంపెనీలకు అమ్మి ఆ డబ్బును నాకు ఇవ్వటం మొదలు పెట్టాడు. ఆ డబ్బులో కొంత మామయ్యకు పంపి ఆయన పెట్టిన ఖర్చు తీర్చేసాను. ఇదిగో ఈ కోటి రూపాయల చెక్కు. న్యాయంగా ఇది మీకు చెందాలి. ఇకపై ఈ బంగారం పని మానేసి హాయిగా ఒక మంచి ఇల్లు కట్టుకొని జీవితం నెట్టండి. నేను నెల నెల డబ్బు పంపుతాను. సాఫ్ట్ వేర్ వాళ్లకన్నా ఉ ద్యోగం పోతుందనే భయం ఉండవచ్చు. కానీ,నాకు బ్రతికినంత కాలం తిండికి, బట్టకు లోటులేకుండాగడిచిపోయేటంత మార్కెట్ ఉంది.' చెప్పాడు జగదీష్.

'అవునమ్మా, ఎప్పుడూ ఇరుగు పొరుగు పిల్లల్లా వాళ్ళే ఉద్యోగం చేస్తున్నారో మన పిల్లలూ అదే ఉద్యోగం చేయాలని అనుకొంటుంటాం. కానీ, మన పిల్లలు ఆ విధమైన నైపుణ్యానికి తయారుగా ఉన్నారా, లేరా అన్న సంగతి తెలుస్కోందుకు ప్రయత్నించాం. మరో భిన్నమైన మార్గంలో తమ పిల్లలు పైకి రాగలరన్న విశ్వాసం లేకపోవటమే ఇందుకు కారణం. మీ అవగాహనాలోపం కారణంగా పిల్లలో వివిధ మార్గాల్లో పైకి వచ్చే నైపుణ్యాలని చంపేస్తున్నారు. పిల్లలు తప్పు దోవ పట్టకుండా ఏ నైపుణ్యం ఇష్టంతో నేర్చుకొంటే అందులోనే రాణిస్తారు. ధనం, కీర్తి సంపాదిస్తారు. ఇవాళ జగదీష్ కున్న పేరు ఎంతమంది సాఫ్ట్ వేర్ ఇంజనీర్ లకు ఉంది. పిల్లల మనసు తెలుసుకోండి. అప్పుడే మీబాధ్యత సరిగా నెరవేర్చినట్టు', చెప్పాడు వెంకటేశ్వర్లు.

దూరానఎక్కడినుంచో జగదీష్ చేసిన ఆల్బంలోని వేణు గానం వినిపిస్తున్నది. అది వింటున్న ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

(ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం)

❖ ❖ ❖

గురువు బాధ్యత !

పూర్వం అలంపుర రాజ్యాన్ని జితేంద్రసేన మహారాజు పాలించేవాడు. పాలకుడుగా అనతికాలంలోనే మంచిపేరు గణించాడు. ఈక్రమంలోనే మహారాజు తమ పొరుగు రాజ్యం కొండవీటిరాజు నరసింహవర్మ కూతురు దమయంతిని వివాహమాడాడు. కొద్దికాలానికే ఆ దంపతులకు పండంటి కుమారుడు కలిగాడు. ఆ పసివాడికి కిరీటవర్మ అని నామకరణం చేశారు పండితులు. రాజు ఆనందానికి అవధుల్లేవు. రాజ్యమంతా వేడుకలు, వినోదాలు జరిపారు. రాజుపాలన కూడ సక్రమంగా సాగుతున్నది.

నాలుగేళ్లు తిరిగే సరికి కిరీటవర్మను చదువుల కోసం గురుకులానికి పంపే సమయం వచ్చింది. మహారాజు మంత్రులతో సంప్రదించి వేంగిపురంలోని నచికేతశర్మ దగ్గరకు తన పుత్రుడిని పంపాలని నిశ్చయించాడు. నచికేతశర్మ ఘనాపాటి. వేద వేదాంగాలను క్షుణ్ణంగా చదివినవాడు. సూక్ష్మబుద్ధి, చతురత, సమయస్ఫూర్తి, చమత్కారం ఉన్నవాడు.

ఒక రెండేళ్లు గడిచేసరికి ఆయన కిరీటవర్మను చంధో, తర్క, వ్యాకరణాలలో విద్యావంతుడిని చేశాడు. నచికేతశర్మ మహాపండితుడే గాక, పరమనిష్ఠాగరిష్టుడు. క్రమశిక్షణలో చండశాసనుడు కూడ. వేద విద్యలేగాక కత్తిసాము, మల్లయుద్ధం, గుర్రపుస్వారీ చేస్తూ ఒడుపుగా యుద్ధం చేయటం వంటి వాటిలో కూడా దిట్ట. అనేక మంది ఆప్రాంతరాజులు, సేనాపతులు తమ వారికి నచికేతశర్మ వద్దనే యుద్ధ విద్యలలో శిక్షణ ఇప్పించేవారు.

అలాగే కిరీటవర్మ గూడ యుద్ధ విద్యాభ్యాసంలో శిక్షణపొందడం ఆరంభమైంది. అలంపురం నుంచి అప్పుడప్పుడు కొంతమంది పిల్లల తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలు ఎలా ఉన్నారో చూసి వెళ్తుండేవారు. అదే సమయంలో గురువుకు ఇవ్వవలసిన దక్షిణ, ధాన్యం, సరుకులు, బట్టలు, కాయకూరలు ఇచ్చి వెళ్తుండేవారు.

ఆ సందర్భంలో వారు గురువు నచికేతశర్మతో మాటామంతి కలిపేవారు. తమ రాజ్యం ఎలా ఉంది, రాజుపాలన ఎలాసాగుతోంది వంటి విషయాలు గూడా మాట్లాడేవారు. ఇలా సాగుతున్న క్రమంలో అక్కడికి తమ పిల్లలను చూడటానికి వచ్చే

తల్లిదండ్రులు తమ పిల్లలు క్రమంగా బలహీనులై నానాటికి నీరసించటం గమనించారు. ఈ విషయమై గురువు నచికేతశర్మను నిలదీసినా పెద్దగా ప్రయోజనంలేక పోయింది. ఈ విషయం ఆ నోట, ఈ నోట పడి చివరకు రాజుగారిని చేరనే చేరింది. అలా నానాటికి చిక్కిపోతున్న వారిలో రాకుమారుడు కిరీటవర్మ కూడ ఉన్నాడని తెలుసుకొని రాజే స్వయంగా నచికేతశర్మ గురుకులానికి వచ్చాడు ఎటువంటి మందీమార్బలం లేకుండా, ముందుగా గురువుగారికి చెప్పకుండా.

నచికేతశర్మ హఠాత్తుగా వచ్చిన రాజును చూసి ఏమి కంగారు పడలేదు. పైగా, ఆయనకు కమ్మని విందు భోజనం చేయించి పెట్టి, భోజనకాల రాజోచిత సపర్యలు చేయించాడు. వారి పుత్రుడికి ఏవేమి శిక్షణలిచ్చింది వివరాలు చెప్పాడు. రాజుసమక్షంలోనే ఆ పిల్లలకు పంక్తి భోజనం ఏర్పాటు చేశాడు. వారికి వడ్డించిన భోజనం భిన్నంగా ఉండటం గమనిస్తూనే ఉన్నాడు రాజు. కాసేపు అక్కడే గడిపి గురుకులం నుంచి బయల్దేరాడు మహారాజు.

అలా గురుకులం చూసి వచ్చిన కొద్ది రోజుల్లోనే రాజ్యంలో పలుమార్పులు చోటుచేసు కొన్నాయి. తన ముందు ఒకలా, తన వెనుక మరోలా ప్రవర్తిస్తూ ప్రజలను పీడిస్తున్న అధికారులపై నిఘా పెట్టి పట్టుకొని కారాగారంలో వేయించాడు మహారాజు. పేట్రేగిపోతున్న దళారులను, అధికధరలకు అమ్ముతున్న దగా కోరులను బంధించాడు. శరవేగంతో జరగిన మార్పులతో ఒక్కసారిగా రాజ్యం గాడిలోకి వచ్చింది. ప్రజల్లో అలజడి తగ్గి శాంతి నెలకొంది.

అయితే గురుకులం చూసి, అక్కడ గురువు నచికేతశర్మకు గుణపాఠం చెబుతాడేమోననుకొన్న ప్రజలకు మహరాజులోనే ఇంత మార్పు రావటం చాలా ఆశ్చర్యం కలిగించింది. అయితే ప్రజల మనస్సులోని ఈ సంశయం నివృత్తి చేయదల్చుకొని, గురుపౌర్ణమి సందర్భంగా గురు నచికేతశర్మను ఆహ్వానించి, ఉచిత రీతిన సత్కరించాడు మహారాజు. దీనితో ప్రజలు మరింత ఆశ్చర్యానికి, తికమకకు లోనయ్యారు.

అప్పుడు రాజుసభలోనున్న ప్రజలనుద్దేశించి, 'ప్రజలారా, మీరంతా గత కొన్ని దినాలుగా రాజ్యంలో జరిగిన మార్పులు గమనించే ఉంటారు. నేనవి చేపట్టడానికి కారణం ఈగురువుగారు నచికేతశర్మనే. నా కుమారుడికి సరైన ఆహారం అందక అందరి

పిల్లల్లా నీరసించి పోతున్నాడని తెలిసి నేను విషయం స్వయంగా పరిశీలిద్దామని గురుకులానికి వెళ్లాను. అక్కడ వారు నాకు ఘనమైన విందునిచ్చి పిల్లలకు మాత్రం చాలా భిన్నమైన ఆహారం వడ్డించారు. అది కూడా నా ముందే. ఎంతో విజ్ఞుడైన నచికేతశర్మ నా ముందే ఇలా చేశాడంటే దాని వెనుక ఏదో సందేశం ఉండి ఉండాలని గ్రహించి రాజ్యానికి తిరిగి వచ్చాను. ఇటీవలి కాలంలో నా పాలనలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పూర్తిగా తగ్గించి, అధికారులపై ఆధారపడిపాలన సాగించాను. ఫలితంగా అరాచకం ప్రబలింది. అంతేగాదు.అధికారులు వేగుల ద్వారా కూడ ఈ విషయాలు నా ద్రుష్టికి రాకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. కాని, పిల్లల తల్లిదండ్రుల ద్వారా విషయాలు గ్రహించిన గురువు నచికేతశర్మ, పిల్లలాంటి ప్రజలపట్ల నా తీరు సరిచేయటానికే ఈమార్గం ఎంచుకొని నా ముందు కూడ తన శిష్యుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు.అలా నా కళ్ళు తెరిపించారు. అందుకే ఈ విషయాన్ని మీ సమక్షంలో వెల్లడిస్తున్నాను. ఇకపై మీ పిల్లలకు మంచిశిక్షణతో పాటు, బలమైన ఆహారం కూడ అందుతుంది. కదండీ గురువుగారు?' అంటూ ముగించారు తన ప్రసంగాన్ని మహారాజు.

తన మనోభావాలను మహారాజుకి నోరు విప్పి చెప్పకుండానే బోధపరచటం గురువుగా తన బాధ్యత అని గుర్తెరిగి, తనపై కోపం తెచ్చుకోకుండా సత్కరించి పంపుతున్న మహారాజుకు ఆశీస్సులిచ్చి బయల్దేరాడు నచికేతశర్మ. నిజమైన గురువులు ఎవరినీ శిక్షించరు. తమ చేష్టలతో, సైగలతోనే అవతల వారిని సరిచేస్తారు.

(విశాలాంధ్ర ఆదివారం అనుబంధం)

❖ ❖ ❖

వైవిధ్యం సృష్టి విలాసం

ఒకసారి అడవికి విహారానికి వచ్చిన సుబ్బయ్య కుటుంబానికి ఒక కుందేలు పిల్ల దొరికింది. సుబ్బయ్య భార్య మహాలక్ష్మి, పిల్లలు రాము, శివాలు ముచ్చట పడటంతో ఆ కుందేలు పిల్లను ఊరికి తెచ్చుకొని పెంచటం మొదలు పెట్టారు. అది శాకాహారి కాబట్టి దానిని పెంచటం పెద్ద శ్రమ కాలేదు సుబ్బయ్య కుటుంబానికి. పిల్లలతో ఆడుకొంటూ కుందేలు కూడా హాయిగా కాలం గడుపుతున్నది. కుందేలుకు చిన్ని అని పేరుపెట్టారు. 'చిన్ని' అని పిల్లా పెద్దా ఎవరు పిలిచినా చెంగు చెంగున ఎగురుకొంటూ వచ్చేది కుందేలు.

అయితే చిన్ని చాల బుద్ధి కలది. ఆ ఇంటిలో అన్నీ గమనిస్తున్నదది. ఇలా గమనిస్తుండగా దానికొక సందేహం వచ్చింది. అదేమిటంటే అడవిలో కూడా ఆడ, మగా జంతువులు ప్రతిజాతిలో ఉంటాయి. పిల్లల్ని కంటాయి. కొద్దిరోజుల తర్వాత ఎవరి జీవితం వారిది. పిల్లల దారి పిల్లలది. కానీ, సుబ్బయ్య గారింట్లో సుబ్బయ్య, ఆయన భార్య అనుక్షణం కీచులాడుకొంటుంటారు. ఒకరిమీద మరొకరు అజమాయిషీ చేయాలనుకొంటుంటారు. ఎక్కువసార్లు సుబ్బయ్యనే మహాలక్ష్మిని తన మాట వినేట్లు చేస్తాడు. మళ్ళీ కాసేపటికి ఇద్దరూ కలిసి నవ్వుకొంటూ మాట్లాడు కొంటుంటారు. చూడడానికి వీళ్ళ జీవితం మన జీవితంలానే ఉన్నా ఇదేం విచిత్రమబ్బా మనిషి జీవితంలో. ఈ సందేహం వచ్చినప్పటి నుంచి చిన్ని ఇది వరకులా ఇంట్లో అందరితో కలిసి, మెలిసి ఆడుకోలేకపోయేది. క్రమంగా దానిలో మునపటి హుషారుతగ్గింది. ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతూ చిన్న కునుకు తీసింది చిన్ని.

అందులో దానికొకకల వచ్చింది. ఆ కలలో ఒక రుషికూడా తనలాగే కీచులాడు కొనే మొగుడూ పెళ్ళాన్ని చూసి, భార్యపై జాలిపడి ఆమెను పులిగా, ఆయనను జింకగా మార్చేశాడు. ఎప్పుడైతే ఆ జంటలోని భార్య పులిగా మాదిరిందో వెంటనే భర్త ఆమెను చూసి పరుగు లంఘించుకొన్నాడు. అది చూసి రుషి కంగారు పడ్డాడు. రుషి కోరుకొంది వేరు, జరిగింది వేరు. భర్త భార్యను అనుక్షణం శాసించటం, భార్య లొంగి లొంగి ఉండటం ఇష్టం లేక తాను వారిని అలా మారిస్తే భార్యకు భయపడి జింక అణిగిమణిగి కాపురం చేస్తుందనుకొన్నాడు. కానీ, తానొకటితలిస్తే వేరొకటి జరిగింది. వారి కాపురమే బుగ్గిపాలైంది. ఇలా అనుకోని, చేసిన పొరపాటుకు పశ్చాత్తాప పడి తిరిగి జింకగా

మారిన భర్తను మనిషిగా, పులిగా మారిన భార్యను స్వస్వరూపానికి తెచ్చాడు. 'హమ్మయ్య' తను చేసిన పొరపాటు సరిదిద్దుకొన్నాని లోపల సంతోష పడ్డాడు. కానీ, ఆ సంతోషం ఎక్కువ సేపు నిలువలేదు.

ఇప్పుడు భర్త అంటే అణుకువుగా కనిపించే భార్య పూర్వలక్షణం పోయింది. జింకాకారం నుంచి మనిషైన భర్త ఆమెను క్రితం లాగా చూడ లేకపోయాడు. అలా వాళ్ళ కాపురం ఎవరికి వారిదై, భార్యాభర్తల బంధం తెగిపోయింది.

ఇప్పుడో స్వరం కునుకు తీస్తున్న చిన్నికి వినిపించింది 'చూశావా చిన్ని, నువ్వు అనుకున్నట్టే వాళ్ళ జీవితం జంతువుల జీవితంగా మారిపోయింది. అప్పుడు దేవుడు మనుషులను సృష్టించటం దేనికి? అందుకే మనుషుల జీవితం జంతువులకంటే భిన్నంగా ఉండాలని దేవుడు ఇలా సృష్టి జరిపాడు. వైవిధ్యం సృష్టికి ఆధారం, మకుటం, అందం కూడా'.

కుందేలుకు హఠాత్తుగా మెళుకువ వచ్చింది. తన ఆలోచనలోని లోపానికి సిగ్గు పడింది. అంతే. మరుసటిక్షణం నుంచి మళ్లీ ఎప్పటిలాగే అందరితో కలిసి మెలిసి ఆడుకోసాగింది.

❖ ❖ ❖

మితస్య అమితః ఫలం

రామారావు, చంద్రికలకు ఒకే ఒక కూతురు లావణ్య. పుట్టీపుట్టకముందే మొబైల్, టీవీల లాలి పాటల మధ్య పెరిగింది. కారణమేమో గాని రామారావుకు అతని వైపు వాళ్ళు ఉన్నారు. చంద్రికకు వాళ్ళ అమ్మా, నాన్న ఉన్నారు. కానీ, పిల్లల పోషణ, పెంపకం విషయానికొస్తే ఎటు వైపు వారిని దగ్గరకు రానీయ లేదు వాళ్లిద్దరూ. ఒక రకంగా చెప్పాలంటే రామారావు బాగా చదువుకోవటమే కాదు. ఇవ్వాళ ఆర్థికంగా తాను ఇతరులకన్నా ఉన్నత స్థాయిలో ఉన్నాడు.

ఉన్నత స్థాయిలో ఉన్నవారు తమ పిల్లల్ని తమ స్థాయికి తగ్గట్టు పెంచాలను కోవటం తప్పు కాదుకదా! అందువల్ల వాళ్ళ పెంపకం విషయంలో తన వాళ్ళను గాని, తన భార్య వైపు వాళ్ళను గాని మాట్లాడ నిచ్చే వాడు కాదు. కేవలం వీడియోల్లో మనవరాలిని చూసుకొని మురిసిపోవటమే ఇరువైపు వాళ్లకు రామారావు, చంద్రిక మిగిల్చిన అదృష్టం.

పిల్ల ఏమి అడిగినా, చేసినా, పలికినా అదో అపురూపం. అంతేగాదు. వీళు ళ్ళ కూడా ఐశ్వర్యం ఉందన్న కారణమో, స్థాయీ పరమైన అవసరమో గాని తరుచు బయట రకరకాల హోటళ్లకు, రెస్టారెంట్లకు వెళ్లే వారు. కనిపించిన ప్రతి కొత్త వంటకం, భోజన పదార్థాలు తినే వారు. అలాగే పిల్లకు ఇవ్వాళ పిల్లలు తినడానికి అందుబాటులోకి వచ్చిన ప్రతి కొత్త ఆహారాన్ని పెట్టేవారు. ఇక అవేమీ లేకపోయినా రోజుకు నాలుగైదు సార్లు పౌష్టికాహారం అంటూ డ్రై ఫ్రూట్స్, పండ్లు పెట్టే వారు. ఇక పిల్ల ఆనందం కోసం స్వీట్స్, చాకోలెట్స్, ఐస్ క్రీమ్స్ అంటూ మరికొన్ని ఇచ్చేవారు. ఇవన్నీ తిన్న మీదట ఆకలి లేదని పిల్ల చెప్పినా వినే స్థితిలో వారు లేరు. ఎలాగైనా బలవంతంగా టీవీ పెట్టో, మొబైల్ చేతికిచ్చో తినిపించే వారు.

చివరకు అవి వికటించి, పొట్ట కుట్టు చేసి ఆస్పత్రిలో పిల్లను చేర్చ వలసి వచ్చేది. వాళ్ళ స్థాయికి తగ్గట్టు ఆసుపత్రులు కూడా చాలా ఖరీదైనవే. రోజుకు వేలు పలుకుతాయి. వారికి వైద్యం చేసే డాక్టర్లు కూడా వేలు వసూలు చేసే డాక్టర్లే. ఒకటి రెండుసార్లకు డాక్టర్లకు లావణ్య సమస్యలకు తల్లి దండ్రులు రామారావు, చంద్రికల అతి ధనిక స్థాయి మనస్తత్వమే కారణం అని అర్థమైంది. ఒకింత వాళ్లపై కోపం వచ్చినా

వాళ్ళ వలన ఆసుపత్రికి ధన లాభం ఉండటం వలన గట్టిగా చెప్ప లేకపోయారు. దీనితో పరిస్థితి చేజారి పిల్ల పొట్ట నొప్పని గిలగిలలాడ సాగింది.

అప్పటికి పిల్లకు నాలుగేళ్లు నిండి అయిదోయేడుకూడా వచ్చింది. నర్సరీ చదువుతోంది. చివరకు ఆ పాప లావణ్యను ఒక స్పెషలిస్ట్ కు చూపించవలసి వచ్చి అతనిని పిలిపించారు. అతనికి అప్పటి దాకా లావణ్యను చూసిన ఆసుపత్రి వైద్యులు విషయం బోధపర్చారు.

ఆ స్పెషలిస్ట్ లావణ్యకు ఉపశమనం కలిగించే చికిత్స ప్రాథమికంగా చేసి, పిల్లను ఇంటికి పంపేముందు రామారావు, చంద్రికలను పిలిపించి మాట్లాడారు. 'ముఖ్యంగా మీ పిల్లకు ఆకు కూరలు, పప్పుతేట, చారువంటితేలికగా అరిగే వంటలు భోజనంలో వడ్డించండి."ఆకలి" అని అనేంతవరకూ అన్నం కానీ, మరేదీ కానీ పెట్టకండి. ఆకలి బాగా వేస్తే పిల్లనే అడుగుతుంది. ఇప్పటిదాకా ఆ పిల్లకు పెట్టే అన్ని రకాల తిండ్లను తక్షణమే ఆపేయండి' అని చెప్పాడు.అలా పద్ధతి మార్చకపోతే పిల్ల ప్రాణానికే ప్రమాదం ఉందని కూడా హెచ్చరించాడు. ఆ స్పెషలిస్ట్ మాట రామారావు, చంద్రికలకు నచ్చకపోయినా లావణ్య మీద ప్రేమతో ఒప్పుకోక తప్పలేదు.

కానీ, లావణ్యకు ఇదంతా అర్థమయ్యే వయస్సు కాదు. తనకు అమ్మా, నాన్న రోగం పేరు చెప్పి గతంలో పెట్టినవేవి పెట్టటం లేదని వాళ్ళిచ్చే డాక్టర్ చెప్పిన భోజనం తినడానికి మొండికేసింది. అంటే అంతవరకూ వారు చేసిన గారాబం ఫలితం అలా పరిణమిచ్చింది.

ఈ పరిస్థితుల్లో తిరిగి ఆ స్పెషలిస్టును సంప్రదించాడు రామారావు.కారణమేమో తెలియదుగాని, ఆ తరువాత రెండు రోజులకే రామారావుకు విపరీతమైన జ్వరం వచ్చింది. డాక్టర్ లావణ్యకు ఏ ఆహారం తీసుకోమని సలహా ఇచ్చాడో అదే సలహా రామారావుకు ఇచ్చాడు. ఇప్పుడు చంద్రిక పని అడకత్తెరలో పోక చెక్కయింది. ఎందుకంటే రామారావు కూడా తనకు ఆకుకూరల భోజనం వద్దని, మాంచిమసాలాలుండే వంటకాలు పెట్టమని గొడవచేసేవాడు. లేకపోతే అన్నం తిననని మొండికెత్తాడు. ఇక ఏమి చేయాలో పాలుపోక చంద్రిక లావణ్య చేత రామారావును బ్రతిమాలించింది. చివరకు ఎట్టాగో రామారావు లావణ్య చెప్పినట్టు ఆకుకూరలు వండిన భోజనం రెండు పూట్ల తినడానికి సిద్ధమయ్యాడు. అయితే లావణ్య కూడా తింటేనే తింటానని నియమం పెట్టాడు.

అలాగ తండ్రి కూతుళ్లు ఒకరికోసం ఒకరు తిన్నగా ఆకుకూరల భోజనం తినటం ఆరంభించారు. బయట తిండ్లు, ఇంట్లో తిండ్లు అతిగా తినటం మానేశారు. వీరిలో మార్పు చూసి చేసేదిలేక చంద్రిక కూడా పూర్తిగా ఆకుకూరల వంటలు, తేలిగ్గా అరిగే వంటలు, ఫలహారాలు అలవాటుచేసుకోంది. నెలరోజుల్లో వారి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడింది. ఆకలి, రుచితెలియటం ఆరంభమైంది. రామారావుకు ఎనలేని సంతోషం కలిగింది. ఇటువంటి నాటకం ఆడమని తనకు సలహా ఇచ్చి తమ కుటుంబాన్ని నిలబెట్టిన ఆ స్పెషలిస్ట్ డాక్టర్ కు మనసులోనే వేవేల కృతజ్ఞతలు తెలిపాడు రామారావు. ఎందుకంటే ఈ రహస్యం చంద్రికకు కూడా రామారావు చెప్పలేదు కాబట్టి.

❖ ❖ ❖

నవ్యతతో నాస్తి అవిద్య

అది పినపాడు. సుమారు వేయి గడపలుండే గ్రామం. ఆ ఉరికి నాలుగు మైళ్ళ దూరంలో గుంటూరు వెళ్లే దారిలోని జిల్లా పరిషత్ పాఠశాల ఉంది. అందులో పదవ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ ఉభయ భాషల్లో బోధన జరుగుతుంది. పినపాడు పిల్లలు ఎక్కువమంది ఆ పాఠశాలలోనే చదువుతున్నారు. ఏటా ప్రభుత్వం తమ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలకు వందకు వంద శాతం ఫలితాలు రావాలని ఉపాధ్యాయులను పురమాయించటం అందరికీ తెలిసినదే. అందుకు తగ్గట్టు ఉపాధ్యాయులు రకరకాల పద్ధతులలో పిల్లలను చదివిస్తుంటారు.

కానీ, కొన్ని తరగతులలో పిల్లలు చదువులో పెద్దగా ప్రతిభ ప్రదర్శించలేక పోతున్నారు. పిల్లలను శిక్షించడం, లేదా తల్లిదండ్రులను పిలిచి వారికి తెలియబర్చడం మినహా ఉపాధ్యాయులు ఏమీ చేయలేక పోతున్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు రాయుడు ఎన్ని సార్లో సమావేశం అయ్యి ఈ చిక్కుముడిని విప్పటం ఎలా అని తలబాదుకొనేవారు. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ప్రతి తరగతిలో కొంతమంది పిల్లలు ఆశించినంత ప్రతిభ ప్రదర్శించలేక పోతున్నారు. అలా అని ఉపాధ్యాయులకు అనుభవం లేదా అంటే వారికి అపార అనుభవం ఉంది. వారి బోధనా పద్ధతికూడా చాలా అద్భుతంగా ఉంటుంది. అయినా ప్రతి తరగతిలో కొందరే చదువుపై ఆసక్తి, అందుకు తగ్గ ప్రతిభ చూపిస్తున్నారు. మిగతావారు అంతగా ఆసక్తి చూపడం లేదు.

ఇది ఇలా సాగుతుండగా కొంతమంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేసి వెళ్లిపోయారు. వారి స్థానంలో కొత్తవారిని ప్రభుత్వం పంపింది. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులతో తొలిసారి సమావేశంలోనే ప్రధానోపాధ్యాయుడు రాయుడు ఈ సమస్య ప్రస్తావన చేశారు. అంతేగాదు. తాము గతంలో చేసిన అనేక ప్రయత్నాలూ వివరించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులెవ్వరైనా పాఠశాలను ఈ చిక్కునుంచి బయట పడేయగలరేమో ఆలోచించండని విజ్ఞప్తి చేశారు. అందరు తమవంతు ప్రయత్నం చేస్తామని చెప్పారేగాని నమ్మకంగా తాము ఇది చేయగలుగుతామని భరోసా ఇవ్వలేకపోయారు.

పాఠశాల ఎప్పటిలాగే జరుగుతున్నది. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు కూడా యధావిధిగా జరుగుతున్నాయి. కానీ, క్రమంగా ఏదో మార్పు చాపకింద నీరులా రాసాగింది. ఈ విషయం ఉపాధ్యాయులందరికీ అవగతమవుతుంది. ఇది వరకు సరిగ్గా చదవటం లేదన్న పిల్లలు ఇప్పుడు బాగా చదువుతున్నారు. నెలసరి పరీక్షల్లో, క్రమ మూల్యాంకనల్లో ఇప్పుడా పిల్లలు మంచి ప్రదర్శన చూ పిస్తున్నారు.

దానితో ఉపాధ్యాయుల్లో, ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడిలో కొత్త ఆశలు పుట్టుకొచ్చాయి. కానీ, ఎవరివల్ల, ఏ మార్పు చేబట్టటం వలన ఇది సంభవం అవుతున్నదో బోధపడలేదు. ముఖ్యంగా పినపాడు నుంచి వచ్చే పిల్లల ప్రదర్శన గతంలో కన్నా ఎన్నో రేట్లు అద్భుతంగా మారింది. అక్కడినుంచి వచ్చే అన్ని తరగతుల పిల్లలలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో నిర్లిప్తంగా ఉండే పిల్లలు ఇప్పుడు చాలా హుషారుగా ఉంటున్నారు చదువుల్లో. అదేసమయంలో ఇతర గ్రామాలలోని అంత వరకూ సరిగ్గా చదవని వారుగూడ ఇప్పుడు బాగా చదువుతున్నారు.

వార్షిక పరీక్షలు జరిగాయి. పాఠశాల ఈ ఏడాది జిల్లాలోనే ప్రధమ స్థానంలో వచ్చింది అన్నితరగతుల్లో వందశాతం ఫలితాలు సాధించి. ప్రధానోపాధ్యాయుడు రాయుడి ఆనందానికి పట్ట పగ్గాలు లేవు. పాఠశాల సాధించిన ఈ విజయం సందర్భంగా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపే సమావేశం ఏర్పరచాడు ప్రధానోపాధ్యాయుడు రాయుడు. ఆ సందర్భంగా పాఠశాలలో గత ఆరునెల్లలో వచ్చిన మార్పుని ప్రస్తావించి, 'ఆ మార్పుకు కృషి చేసిన తల్లి దండ్రులెవరో, ఉపాధ్యాయులెవరో దయచేసి ఇప్పుడైనా బయటికి తెలిపితే వారిని అందరి సమక్షంలో తగు రీతిలో సన్మానిస్తాను' అని చెప్పారు రాయుడు. అప్పుడో ఉపాధ్యాయురాలు లేచి 'జ్యోతి గారే దీనికి శ్రీకారం చుట్టారండి. ఆవిడని సన్మానించటమే న్యాయం' అనిచెప్పింది.

అప్పుడు జ్యోతిగారు లేచి 'నేను కాదండి, మన విద్యార్థి సుశాంత్ తల్లి శారదగారే ఈ మార్పుకు ఆద్యులు. ఆవిడకే న్యాయంగా మీరిచ్చే గౌరం అందాలి' అని చెప్పింది. అందరూ శారద గారి వైపు చూశారు.

అప్పుడు శారద గారు లేచి, 'పిల్లలో, వారి ప్రదర్శనలో ఇప్పుడు మీరు చుసిన మార్పుకు కారణం నా మిత్రురాలు అరవింద. ఆవిడ పిల్లలో చదువు పట్ల ఆసక్తి కలిగేందుకు తల్లి దండ్రులు ఎటువంటి పాత్ర పోషించాలనే అంశంపై అనేక పరిశోధనలు చేసి, వాటిని పుస్తకాలుగా వేసి నాకు పంపింది. జ్యోతి ద్వారా మన స్కూలు సమస్య తెలుసుకొన్న నేను, ఆ పుస్తకంలోని కొన్ని అంశాలు ఎన్నుకొని పినపాడులోని పిల్లల తల్లిదండ్రులను కలిసి వారితో మాట్లాడి అందరం కలిసి సమిష్టిగా ప్రయత్నాలు ప్రారంభించాం. అవేమి పెద్ద పెద్ద పధకాలు కావు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఒక నిర్దిష్ట కాల-పట్టిక అనుసరించాలి. నోములు, వ్రతాలులాగే ఖచ్చితంగా ఆ కాల-పట్టిక పెట్టుకొని, ఆ సమయంలో మొబైల్, టీ వి కట్టేసి, తామూ పిల్లలతో విధిగా కూర్చుని చదవాలి. ఆ సమయంలో వారిలో ఉత్తేజమ్ ప్రేరేపించే కబుర్లు చెప్పాలి క్లుప్తంగా. న్యూటన్ గొర్రెల కాపరి కుటుంబం నుంచి వచ్చాడని, మైఖేల్ ఫెరడే బైండింగ్ షాపులో కూలీగా చేసే వాడని, లూయిపాశ్చర్ వడ్రంగి కొడుకని చెబితే పిల్లలు ఎంత ఆశ్చర్య పోతారో నేను వారిని చదివించేప్పుడు వారి కళ్ళలోచూశాను. వారిలో రోజు రోజుకు వస్తున్న మార్పు వేరేచోట ఉన్న వారి స్నేహితులను కూడా తాకింది. వారూ మారటం మొదలెట్టారు. అలా వారిని ఉత్తేజితం చేయాలి. చదువును ఆనంద దాయకంగా మార్చాలి. అలా 'నవ్యతతో అవిద్యనాస్తి'-చేయగలుగుతాం. కాబట్టి మీరిచ్చే గౌరవం న్యాయంగా అరవిందకు చెందాలి' అని ముగించింది శారద. అలా అందరూ త్వరలోనే అరవిందను పిలిపించి తగిన రీతిలో సన్మానించాలని నిశ్చయించారు.

❖ ❖ ❖

శాకాంబరి

అది చిట్టిరామయ్య కమ్యూనిటీ ఉన్నత పాఠశాల. పమిడిపాడు చుట్టుపక్కల అదే పెద్దపాఠశాల. బీదా బిక్కి, వెనుకబడిన వర్గాల పిల్లలకు అతితక్కువ డబ్బులకే చదువు బోధించే ఏకైక పాఠశాల. సమాజహితం కోరి తన ఆస్తి కొంత అమ్మి ఈ పాఠశాల కట్టించి అందులోఉపాధ్యాయులకు తానే జీతం ఇచ్చేవాడు చిట్టిరామయ్య. ఆయన చేస్తున్న మంచిని మెచ్చి కొంతమంది పెద్దలు దానాలు చేసేవారు. కొందరు స్కూలు ఆర్థిక అవసరాలకు సరిపడ భూములు, తోటలు కూడ దానం ఇచ్చారు. పదుల్లో ప్రారంభమైన విద్యార్థుల సంఖ్య పాతికేళ్లలో వందలకు ఎగబ్రాకి అయిదు వందలకు చేరింది. పాఠశాల బోధన బాగుండటంతో డబ్బున్నవారి పిల్లలు, ఉన్నత స్థాయి పిల్లలు కూడ అక్కడేచేరి, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకొన్నారు

ఇవ్వాళ ఆ పాఠశాల పూర్వవిద్యార్థుల పునఃసమాగమం. బహుశ పాఠశాల ఆరంభం మొదటి మూడు, నాలుగు సంవత్సరాల పిల్లలయి ఉంటారు వీళ్ళు. అప్పటి అధ్యాపకులు ఇంకా అక్కడే ఉన్నారు. తమ సమ్మేళనం విన్నూతనంగా రూపొందించారు వారు.

తాము ఆ పాఠశాలలో ఉండగా బయట ఏ తినుబండారాలు అమ్మేవారో, వారినిఆబండ్లుతెమ్మనిడబ్బులిచ్చిరప్పించారు. కొందరి ప్రత్యేకానుభవాలను తిరిగి రిహార్సల్ జరిపేలా తతంగం. ఇలా దాదాపు పది అంశాల పథకం రూపొందించారు. అందులో పొద్దునే ప్రార్థనతో పాఠశాల ఆరంభం, వార్తలుచదవడం, ప్రధానాధ్యాపకుడి సందేశం, తరువాత జనగణమన, ఆపై లైన్లో ఎవరి క్లాసులకు వారెళ్ళటం వంటివి ఉన్నాయి.

ఆయా తరగతుల్లో ఆనాడు ఆ సబ్జెక్టులు బోధించిన అధ్యాపకుల హావ భావాలు, వాళ్ళు చెప్పిన తీరు తమను ఎలా ఆకట్టుకున్నది. వాళ్ళ ముందు చేసి చూపారు. వాళ్ళు కూడా తమ బోధన వాళ్లనంత ఆకట్టుకొన్నందుకు ఎంతో సంతోషించారు. విద్యార్థులను ఎంతగానో మెచ్చుకొన్నారు. అలా ఇంటర్వెల్ బ్రేక్ దాకా గడిపి, బాగా ఆకలిగా ఉన్న అందరికీ కమ్మని ఫలహారాలు అందించారు. రాగి దోశ, పుదీనా పచ్చడి, కొత్తిమీర పచ్చడి, రవ్వ ఇడ్లీ, సాంబారు, క్యారెట్ రసం, బీట్ రూట్ రసం, నిమ్మ రసం ఇలా విన్నూత్నంగా ఫలహారాలు వడ్డించారు. ఉపాధ్యాయులివి చూసి ఆశ్చర్య పోయారు. ఆ పాఠశాలతో పూర్వ పరిచయం లేనివారు మరింత ఆశ్చర్య పోయారు.

తీరా ఉపాధ్యాయులను సన్మానించే సమయం ఆసన్నమైంది. ఒక్కక్కరిని వేదిక మీదికి ఆహ్వానించి చిట్టి రామయ్య గారితో శాలువా కప్పించి, మెమెంటో, నగదు, అర సవరి బంగారు ఉంగరం బహుకరించారు. చివరగా చిట్టి రామయ్య పంతులు గారిని, వారి అర్ధాంగి శాకాంబరీగారినీ సన్మానించారు మంగళ వాయిద్యాల, వేదమంత్రాల నడుమ.

విద్యార్ధులందరి తరపున హైకోర్టు జడ్జి గారుగా పనిచేస్తున్న లక్ష్మణరావు గారు సన్మాన పత్రం చదివారు. 'ఇప్పుడు ఈ శుభ సమయంలో చిట్టి రామయ్య గారు, శాకాంబరిగార్ల విశిష్టత చెప్పటం మా ప్రధాన కర్తవ్యం.

"నాడు మాలో చాలామందికి తినడానికి సరైన ఆహారం లేని రోజులు. కడుబీద కుటుంబాలు మావి. కూలిపనికి వెళ్తే పూట కూలీ గూడా పుట్టని రోజులు. ఎలాగోలాగ చదువొస్తే చాలు –ఏ ఉద్యోగమన్నా రాకపోదా అని ఇక్కడ చేరాం. మాలో చాలా మంది ఎర్రకారం, ఉల్లిపాయ ఉన్న డబ్బా భోజనంగా తెచ్చుకొనేవారం. కూరలు, పండ్లు మా ఊహకు కూడా అందని ఆహారాలు. అలాంటి టిఫిన్ డబ్బాలను చెక్ చేసి, మా దారిద్ర్యాన్ని గ్రహించి, భోజనం అయినాకఖాళి అయిన డబ్బాలలో రోజుకొక ఆకుకూర, వంట సామానులు పెట్టే మహాతల్లి ఎవరో తెలుసా? ఆవిడే చిట్టి రామయ్య గారి ధర్మపత్ని శాకాంబరిగారు. పేరుకు తగ్గ చల్లని తల్లయింది మాకు. అలా మా ఇళ్లలో ఆకు కూరలు భోజనం చేయటం ప్రారంభమైంది. రోజుకొకటి చొప్పున ఆవిడ ఇవ్వటం మేము తినటం వలన మా ఆరోగ్యం, జీర్ణశక్తి అన్నీ మెరుగయ్యాయి. పేద విద్యార్ధులకు ఆకుకూరలు ఉచితంగా ఇస్తే అది వారికి ఎంతో మేలు చేస్తుందని ఆ మహాతల్లి ఆనాడే గ్రహించింది. పాఠశాల వదిలి కళాశాలకు వెళ్లినా మేము ఆకుకూరలు తినటం మానలేదు. అలా చదువులు పూర్తైనాయి' అని ముగించాడు లక్ష్మణ రావు.

ఈ చివరి మాటలు పలుకు తున్నప్పుడు అందరి కళ్ళు సజలమైనాయి. శాకాంబరిగారి ఆనందానికి అవధుల్లేవు. తన చిరు ఉపకారం వారికీ అంతలా మేలు చేసినందుకు.

అందరూ రకరకాల ఆకు కూరలతో చేసిన పచ్చళ్ళు, పులుసులు, పప్పులు, పకోడీలు, పొడి, తడి కూరలు తిని ఇంత వెరైటీ భోజనం వడ్డించిన విద్యార్థులను మనస్సులో అభినందించలేకుండాఉండలేకపోయారు.

❖ ❖ ❖